
రుద్రనేత్రం
గన్నవరపు నరసింహా మూర్తి

# రుద్రనేత్రం (నవల)

అరవై సంవత్సరాల క్రితం...

దండకారణ్యం...

ఆంధ్రా ఒరిస్సా సరిహద్దులోని ఓ గిరిజన తండా...

ఆ రోజు అక్కడ అమ్మవారి పండుగ జరుగుతోంది... ఆ ఊరికి ఉత్తరంగా పోలేరమ్మ గుడి ఉంది... ఆ ఊరు పుట్టకముందే ఆ గుడి ఊరికి ఉత్తరంగా ఉన్న ఏనుగుల గుట్ట మీద వెలిసిందనీ ఆ ఊరి జన్నివాడు చెబుతుంటాడు.

ఆ పండగని చూడటం కోసం చుట్టుపక్కల ఊళ్ళవాళ్ళంతా వచ్చారు... జన్నివాడికి కోడిని చంపి దాని పేగుల్ని జంధ్యంగా వేసారు... ఊళ్ళోని ఆడా మగా పూటుగా మాంసంతినీ విప్పసారా పీకల దాకా తాగి ఉన్నారు.... ఇంతలో సిరిమాను వచ్చింది.

జన్నివాడిని కర్ర బండిలో ఓ వేపచెట్టు కర్రతో తయారు చేసిన సిరిమాను మీద కూర్చోబెట్టారు. ఆ తరువాత ముందు సిరిమాను మీద జన్నివాడు, వాడి వెనక ఊళ్ళోని పిల్లలు, పెద్దలు వెళుతునారు. సిరిమానుకు ముందు మేళతాళాలు భీకరంగా మోగుతున్నాయి. కొందరు యువకులు పెద్ద వెదురు పీపాలు ఊదుతూ ముందు కెళ్తుంటే, వాటికి అనుగుణంగా జంతు చర్మాలతో తయారు చేసిన డప్పులను మోగిస్తూ మరికొందరు వెళ్తున్నారు.

రాను రాను ఆ జాతర ఉధృతం అయింది... ప్రజలు తండోపతండాలుగా రావడం మొదలైంది...

రాను రాను ఆ డప్పుల శబ్దం భయంకరంగా మోగుతోంది...

అలా ఒక గంట తరువాత అది ఊరి చివర కొండ ప్రాంతం చేరుకుంది... ఆ కొండమీద దేవత గుడి ఉంది.

దేవతకి బలివ్వడానికి రెండు మేకలను స్నానం చేయించి నుదుటన కుంకుమ పెట్టి ఇద్దరు యువకులు తీసుకొచ్చారు.

అరగంట తరువాత వారంతా గుడి చేరుకున్నారు... జన్నివాడు అమ్మవారికి కుంకుమ వేసి పూజ చేసాడు...

ఇంతలో కొందరు యువకులు కొండ మీద నుంచి పరిగెడుతూ వస్తూ 'మీదన అమ్మోరు ఎలిసింది... పెద్ద గుడి ఉన్నాది' అంటూ అరుచుకుంటూ వచ్చారు...

భక్తులంతా ఆ అరుపులు విన్నారు. ఆ తరువాత పరిగెడుతూ ఆ కొండ మీదకు పరిగెత్తారు...

అక్కడ మట్టి రాళ్ళు కప్పబడ్డ ఓ పెద్ద పాడుబడ్డ దేవాలయం కనిపించింది వాళ్ళకు...

ఆ వార్త దావానంలా వ్యాపించి సబ్–కలెక్టర్‌కి, తరువాత కలెక్టర్‌కి చేరింది...

కలెక్టర్ ఈ విషయాన్ని పరిశీలించాలనీ పురావస్తు శాఖకి ఉత్తరం వ్రాసాడు.

పదిహేను రోజుల తరువాత పురావస్తు శాఖకి చెందిన 'గిరిధారి' అనే అసిస్టెంట్ డైరెక్టర్ నాయకత్వంలోని నలుగురు బృందం ఆ గిరిజన గ్రామానికి వచ్చి ఏనుగుల గుట్ట ఎక్కి ఆ పాడు బడ్డ దేవాలయాన్ని పరిశీలించింది.

అక్కడ చరిత్రనంతా తిరగవేసాడు గిరిధారి. ఇటువంటి పురావస్తు కట్టడాల విషయంలో అతనికి మంచి జ్ఞానం ఉంది. ఎన్నో గ్రంథాలను అతను చదివాడు. అందుకనీ అక్కడ నాలుగు రోజులు కేంపు వేసి ఆ గుడిని ఎవరు ఎప్పుడు నిర్మించారో జియోలజికల్ మేప్స్ ఆధారంగా లెక్కలు కట్టి అది నాలుగువందల సంవత్సరాల క్రితం కళింగరాజులు నిర్మించి ఉండొచ్చన్న నిర్ధారణకి వచ్చి అందుకనుగుణంగా ఒక రిపోర్టు తయారు చేసి తమ డైరెక్టర్‌కీ, కలెక్టర్‌కీ పంపాడు.

నెలరోజుల తరువాత దాన్ని చుట్టూ పూర్తిగా తవ్వకాలు జరిపి అక్కడ ఇంకా ఏమి ఉన్నాయో తెలుసుకోవాలనీ, ఆ తరువాత దాన్ని పురాతత్వ కట్టడంగా ప్రకటించే విషయం మీద ఒక నిర్ణయం తీసుకునేందుకు అవకాశం కలుగుతుందనీ అతనికి సమాధానం వచ్చింది.

వెంటనే గిరిధారి అక్కడ ఓ కేంపు వేసి ఆ పాడుబడ్డ గుడి చుట్టూ తవ్వకాలు మొదలు పెట్టాడు.

ముందు 200 అడుగుల చదరంలో ఆ గుడికి నాలుగు పక్కల తవ్వకాలు మొదలయ్యాయి. రోజూ 50 మంది కూలీలవాళ్ళతో తవ్వకాలు మొదలై 100 మంది దాకా పెరిగారు.

వారం రోజుల తరువాత గుడి చుట్టూ ప్రహరీ గోడ, ఒక మూల నుయ్యి, ఇంకో మూల ధ్వజస్తంభం తూర్పుముఖంగా శివుడి గర్భగుడి, అక్కడ పాడుబడిపోయిన శివలింగం కనిపించాయి.

గర్భగుడి పక్కన ముఖ మంటపాన్ని రాతిస్తంభాలతో నిర్మించినట్లు గిరిధారి అక్కడ రాతి స్తంభాల అమరికను బట్టి ఊహించాడు.

ప్రతీ స్తంభం మీద ఒక కొత్త లిపితో ఏవో శాసనాలు వ్రాయబడి ఉండటాన్ని గమనించాడు. అది ముందర పాలీ భాషనకున్నాడు గానీ ఆంధ్రి, గ, న, బ, అన్న అక్షరాలు కనిపించటంతో అది ఆది తెలుగు భాషగా భావించాడు. ఆ మంటపంలో గోడమీద నన్నయ, తిక్కన ల ఆకృతులు, రామాయణం, భారతంలోని కొన్ని ఘట్టాలు కొన్ని రాతి పలకల మీద చెక్కబడి ఉన్నాయి. శ్రీరామ పట్టాభిషేక ఘట్టం ముందర స్తంభాల మీద చెక్కబడి ఉండటాన్ని గమనించి అది హిందూ రాజులు కట్టిన కట్టడంగా నిర్ధారణకి వచ్చాడు గిరిధారి...

వారం రోజుల తరువాత తవ్వకాలు పదడుగులకు చేరుకున్నాయి.

ఒక రోజు గుడికి ఉత్తరంలో నలుగురు మనుషులు తవ్వుతుంటే ఠాంగ్ ఠాంగ్ మన్న శబ్దాలు రావడంతో గిరిధారికి పరుగున వచ్చి ఆవిషయాన్ని చెప్పారు.

గిరిధారి అక్కడికి వచ్చి ఆశబ్దాన్ని విన్నాడు. బహుశా అది ఏ ఇనుమో అయి ఉంటుందనీ ఊహించాడు.

అందర్నీ పిలిచి ఒకేసారి అక్కడ తవ్వించడం మొదలు పెట్టాడు.

రాను రాను శబ్దం మరింత గట్టిగా వినిపిస్తోంది.

మూడు గంటలు తవ్వకం జరిపిన తరువాత ఒక పెద్ద రాయి బయట పడసాగింది...

గిరిధారి ఆ తవ్విన వాళ్ళకు జాగ్రత్తగా దాన్ని వెలికి తియ్యమనీ చెప్పాడు.

ఓ గంట తరువాత ఒక పెద్ద రాయి బయట పడింది... అది గ్రానైట్ రాయి. చాలా గట్టిగా నునుపుగా ఉంది...

దాని మీద ఆ గుడి ఎప్పుడు ఎవ్వరు కట్టించారో వివరాలు ఒక శాసనంలో తెలియని లిపిలో వ్రాయబడింది. ఆ అంకెల్ని బట్టి అది 600 సంవత్సరాల క్రితం విజయనగర పాలకులు కట్టించారని, ఆ ప్రాంతంలో ఒక గ్రామం ఉండేదనీ, శివుడు రాజుల ఆరాధ్య దైవమనీ అందులో చెక్కబడి ఉన్నట్లు ఆ లిపిని గిరిధారి డీకోడ్ చేసి తెలుసుకున్నాడు.

ఆ రాయి కింద ఓ పెద్ద రాగి రేకుని ఒక కూలివాడు చూసి 'దొరా... ఇక్కడేదో రేకు ఉన్నాది' అనీ ఓ పెద్ద రేకుని తీసి చూపించాడు.

గిరిధారి ఆ రేకుని చూసాడు. దాని మీద రెండు గజాల మందం సుద్ద కప్పబడి ఉంది... దాన్ని నలుగురు మనుషులు బయటకు తియ్యలేకపోయారు. అంత బరువుంది.

ఆ తరువాత ఆ రేకుని పూర్తిగా కడిగించాడు. అదొక నాలుగు అడుగుల చదరం ఆకారంలో ఉన్న ఓ రాగి రేకు....

దాని మీద రుద్రనేత్రం వేసి ఉంది. ఆ తరువాత ఒక నది, గుడుల ఆకారంలో బొమ్మలు, శివలింగం... చుట్టూ ఏదో లిపిలో వ్రాయబడ్డ శాసనాలు.

ఆ రాగి రేకుని రాత్రంతా పరిశీలించాడు గిరిధారి...

అందులో ఉన్న శాసనాల అర్థం ఏమై ఉంటుందోననీ చాలా సేపు ఆలోచించాడు. కానీ అతనికి అర్థం కాలేదు.

కానీ అందులో ఏదో రహస్యం దాగి ఉందనిపించింది అతనికి.

ఆ నది ఏమిటి? ఇటు పక్క అటు పక్క గుళ్ళు, రుద్రనేత్రం, ఇవన్నీ బహుశా ఏదో రహస్యాన్ని తెలిపే చిత్రాలుగా ఊహించాడు. పూర్వం రాజులు నిధుల్ని ఇలా కొండల్లో దాచి వాటిని ఇటువంటి శాసనాల రూపంలో నిక్షిప్త పరిచేవారనీ అతను గుప్తనిధులు అన్న పుస్తకంలో చదివాడు.

ఇది కూడా బహుశా నిధికి సంబంధించిందే అయి ఉంటుందనీ ఊహించాడు.

ఇంక తవ్వకాల్లో ఇంకేవీ కొత్తవి కనిపించక పోవడంతో తవ్వకాలను ముగించి చుట్టూరా ఫెన్సింగ్ వేసి నలుగురు మనుషుల్ని కాపలా పెట్టి ఆ రాగి రేకు శాసనాన్ని తీసుకొని ఆఫీసుకి వచ్చేసాడు.

... ... ...

పురావస్తుశాఖ డైరెక్టర్ హరనాథ్ గది... గిరిధారి వచ్చి ఆ తవ్వకాల వివరాలు విపులంగా అతనికి చెప్పాడు. ఆ తరువాత ఆ రాగి శాసనాన్ని అతనికి చూపించాడు.

హరనాథ్ దాన్ని పరిశీలించాడు. అతనికి అందులో ఉన్న శాసనం దేనికి సంబంధించిందో అర్థం కాలేదు.

"గిరిధారీ... దీన్ని సమగ్రంగా పరిశీలించండి. ఏదో రహస్యం ఇందులో ఉంది... అది మనం కనుక్కుంటే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. మన శాఖ గౌరవం కూడా పెరుగుతుంది. మీరు కొన్నాళ్ళపాటు ఈ పని మీదే ఉండండి.

ఈ తవ్వకాల విషయంలో మన శాఖ వైఫల్యం ఎంతో ఉంది. ఇదివరకు ఇలాగే మనకు ఎన్నో శాసనాలు తవ్వకాల్లో లభించాయి. కానీ మన వాళ్ళ నిర్లక్ష్యం వల్ల వాటిని మనం కనుక్కోలేక పోయాము. కొన్ని లక్షల కోట్ల విలువైన బంగారం, వజ్రాల నిధులు భూగర్భంలోనే ఉండిపోయాయి. అప్పటి పాలకులు అందరికీ అర్థం కాకూడదనీ, చదువుకున్న వారికే అర్థం అయితే వాళ్ళు ప్రజల కోసం ఆ నిధులను వినియోగిస్తారన్న ఆలోచనతో చాలా జాగ్రత్తగా ఎంతో తెలివితో ఆ శాసనాలను రూపొందించారు. మనం ఎన్నో డిగ్రీలు, పీజీలు చదువుకుంటున్నా వాటిని అర్థం చేసుకునే జ్ఞానం మనకి లేకపోవడం చేత వాటిని కనుక్కోలేక వెలికి తియ్యలేక పోతున్నాము. ఇది మనం సిగ్గుపడవలసిన విషయం" అన్నాడు ఆవేశంగా హరనాథ్.

"మీరు చెప్పింది నిజమే సార్... ఈ రోజు నుంచి ఆ పనిమీదే ఉంటాను" అన్నాడు గిరిధారి.

"మనలాగే అప్పటి వాళ్ళు అనుకుంటే మొహంజదారో లాంటి నగరాలు బయటపడేవా చెప్పండి. 1920లో ఆ నగరాన్ని తవ్వి వెలికి తీసారు... అందువల్ల అప్పటి నాగరికత మనకు తెలిసింది... కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనం ఆ విషయంలో వెనకబడ్డాము. మనుషుల్లో స్వార్థం, సంకుచిత్వం

పెరిగిపోయాయి. ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు అన్న భావంతో పనిచేస్తూ దేశం కోసం అన్న భావాన్ని మరిచిపోతున్నాము. ఎనీ వే... మీరు ఇక నుంచి అదేపని మీద ఉండండి. ప్రతీ నెలా నాకు ప్రోగ్రెస్ చెబుతుండండి. ఎలాగైనా దీని రహస్యాన్ని మనం ఛేదించాలి"... అనీ చెప్పాడు హరనాథ్.

గిరిధారి ఆలోచిస్తూ ఆ శాసనాన్ని తన గదికి తీసుకువచ్చాడు.

ఎలాగైనా దాన్ని ఛేదించాలనీ అతనొక నిర్ణయానికొచ్చాడు.

ఆమర్నాడు గుప్త నిధులన్న పుస్తకాన్ని గ్రంథాలయాన్నుంచి తెచ్చి చదివాడు.

పురాతన శాసనాలలోని లిపులను పరిశీలించాడు.

వాటిలో దొరికిన రాగిరేకు లోని లిపిని పోల్చి చూసాడు. వారం రోజుల తరువాత గిరిధారికి ఆ శాసనాల లోని మూలం కొద్దిగా అర్థం అయింది.

తను ఊహించిన ఆధారాలు సరియైనవా కావా అని తేల్చుకోవడానికి దండకారణ్యానికి వెళ్ళాడు.

శాసనంలో నది చిత్రం గీసి ఉండటంతో నది కోసం దండకారణ్యంలో రాగిరేకు దొరికిన అడవిలో వెతకటం మొదలు పెట్టాడు... అప్పుడు అతనికి ఆ లోయలో పారుతున్న శబరి నది కనిపించింది. ఆ శాసనంలో నది చిత్రం మధ్యలో రామాయణంలోని శబరి బొమ్మ ఉండటంతో ఆ నది శబరి అని పోల్చుకున్నాడు. దానికవతల ఒడ్డున ఒక పాడుబడ్డ శివాలయాన్ని కనుగొన్నాడు.

ఆ తరువాత ఇంటికి వచ్చేసాడు. ఆఫీసుకెళ్ళి మళ్ళీ ఆ శాసనాన్ని డీకోడ్ చేయడం మొదలు పెట్టాడు.

రెండు నెలల తరువాత డైరెక్టర్ హరనాథ్, కలెక్టర్ ఇద్దరికీ బదిలీ అయింది.

ఆ వార్త విన్న తరువాత గిరిధారికి దుర్బుద్ధి పుట్టింది.

ఈ రాగిరేకు శాసనం గురించీ వారిద్దరికే తెలుసు. వాళ్ళిద్దరూ ఇప్పుడు బదిలీ అయిపోయారు. కొత్త డైరెక్టర్ వచ్చేసరికి మరో ఆరు నెలలు పడుతుంది. వాళ్ళెవరికీ ఈ రాగిరేకు శాసనం గురించి తను చెబితే తప్పా తెలియదు.

అందుకనీ ఈ నిధిని తనే స్వంతం చేసుకుంటే అన్న ఆలోచన వచ్చింది.

అప్పట్నుంచీ ఆ దిశగా అడుగులు వెయ్యడం మొదలు పెట్టాడు.

మళ్ళీ దండకారణ్యానికి వెళ్ళాడు. ఈసారి ఆ ప్రాంతమంతా మళ్ళీ పరిశీలించాడు... కొంత వరకూ ముందుకెళ్ళ గలిగాడు గాని పూర్తిగా దాన్ని ఛేదించలేక పోయాడు.

ఇంతలో గిరిధారి కొడుక్కి అనారోగ్యం చేసింది. డాక్టర్లు బ్రతకటం కష్టం అన్నారు. ఆ సమయంలో ఒక రోజు ఆఫీసు నుంచి స్కూటర్ మీద వస్తున్న గిరిధారికి ఎదురుగా వస్తున్న జీపుని ఢీకొని ప్రమాదం జరిగింది...

అతనికెందుకో కొడుక్కి ఒంట్లో బాగులేకపోవడం, తనకి ప్రమాదం జరగటం అపశకునంలా తోచింది.

బహుశా తాను శివుడి గుడిలో దాచిన నిధి కోసం ప్రయత్నం చెయ్యడం వల్లే ఇలా జరిగిందేమో అన్న ఆలోచన వచ్చింది.

ఇలా ప్రజల నిధులను కాజేయడానికి ప్రయత్నించిన వారెవ్వరూ బ్రతికి బయట కట్ట లేదు అనీ ఆ "గుప్తనిధులు" పుస్తకంలో వ్రాసి ఉంది. అది పుస్తకంలో ముందు పేజీలో హెచ్చరిక అన్న హెడ్డింగ్ క్రింద వ్రాయబడి ఉడటాన్ని గిరిధారి చదివాడు.

ఆ తరువాత అతనికి రాత్రిపూట నిద్రపట్టటం మానేసింది. ఒకటే ఆందోళన... కలలో ఎవరో ఒక వ్యక్తి వచ్చి అతన్ని శూలాలతో పొడవటం, రుద్రనేత్రం నుంచి అగ్ని వచ్చి అతని ముఖం మీద పడుతుండటం... వీటితో అతను ఉలిక్కిపడి లేచి పోయేవాడు...

ఇదెవ్వరికీ చెప్పుకునేది కాదు... ఏం చెయ్యాలో అర్థం కాలేదు... ఆ శివుడికి తన మీద కోపం వచ్చినట్లు అతను భావించ సాగేడు.

వెంటనే శివాలయానికి వెళ్ళి తాను ఆ నిధి గురించి ఇంక ముందుకెళ్ళననీ తనని రక్షించమనీ వేడుకున్నాడు.

అతని మొర ఆ శివుడు ఆలకించినట్లు అతని కొడుక్కి ఆరోగ్యం మెరుగుపడింది.

ఇంక ఆ రోజు నుంచి ఆ ఫైలుని ఎవ్వరికీ తెలియకుండా బీరువా అడుగున పెట్టేసాడు. ఆ రాగిరేకుని కాగితాల మధ్య పెట్టి బీరువా ఫైళ్ళ మధ్యలో అనుమానం రాకుండా దాచేసాడు.

అలా ఆ ఫైలు శాశ్వతంగా మూతబడిపోయింది. ఆ తరువాత గిరిధారికి బొంబాయికి బదిలీ అయింది. అక్కడికి వెళ్ళటం ఇష్టంలేక ఇంకో ఉద్యోగాన్ని చూసుకున్నాడు.

దాంతో ఆ శాసనం, నిధి... వాటి గురించి ప్రపంచం మరిచిపోయింది.

కాలచక్రం తిరుగుతోంది...

ఏళ్ళకు ఏళ్ళు... అలా అరవై ఏళ్ళు గడిచిపోయాయి.

# 1

భారత పురావస్తుశాఖ... ఆర్కిలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయం...

ఉదయం పది గంటల ప్రాంతంలో డైరెక్టర్ శివరాం ఆఫీసులోకి ప్రవేశించాడు...

కొద్దిసేపటి తరువాత అదే ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ దివాకర్ అతని గదిలోకి ఒక ఫైలుతో ప్రవేశించాడు...

"హలో దివాకర్! ఏమైనా విశేషమా?" కుర్చీ చూపిస్తూ అడిగాడు శివరాం...

"యస్... సర్... మీరు పది నిముషాలు టైమిస్తే చెబుతాను" అన్నాడు...

శివరాం వాచీ చూసుకొనీ "చెప్పండి" అన్నాడు.

"ఇది సుమారు 60 సంవత్సరాల క్రితం నాటి ఫైలు.. అప్పట్లో మన ఆఫీసులో 'గిరిధారి' అనీ ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఉండేవాడు. అతను భాషలను బాగా తర్జుమా చేసేవాడు... అంటే పురాతన దేవాలయాల మీద వ్రాసిన పాలీ మొదలగు ప్రాచీన భాషలను, మన తవ్వకాల్లో బయటపడ్డ శిల్పాలు, దొరికిన రేకుల మీద వ్రాసిన లిపిని తర్జుమా చెయ్యడంలో అతను సిద్ధహస్తుడు... అతనెక్కువగా గుప్తనిధుల మీద పరిశోధనలు చేసేవాడట...

ఒకసారి అతనికి ఒక తాళపత్ర గ్రంథంలో దండకారణ్యంలోని శబరి నది లోయలో శివుడి గుడి ఉండేదన్న శాసనాన్ని అతను చదివాడు... ఆ తరువాత కొన్నాళ్ళకు ఆ ప్రాంతంలో మనవాళ్ళు తవ్వకాలు జరిపి ఏనుగుల గుట్ట అనే కొండమీద ఒక గుడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మరిన్ని బృందాలతో తవ్వకాలు జరిపితే చివరకు శివుడి గుడి శిథిలావస్థలో పాడుబడిపోయి కనిపించింది. ఆ తవ్వకాల్లో ఒక రాగి పలక మన వాళ్ళకు ఆ గుడి వెనక భాగంలో దొరికింది" అంటూ ఒక రాగిరేకును ఫైల్లోంచి తీసి అతనికి చూపించాడు.

"వెరీ ఇంట్రస్టింగ్" అంటూ శివరాం దాన్ని పరిశీలించేడు...

ఒక పక్క నది... దాని కెదురుగా ఉన్న ఒడ్డుపై రెండు దేవాలయాలు. పక్కనే త్రిశూలాలు... రుద్రనేత్రం అవతల ఒడ్డున ఇంకో గుడి... అక్కడ ఒక నంది బొమ్మ దాని కెదురుగా శివుడి లింగం మీద రుద్రనేత్రం గీసి ఉన్నాయి. రెండో పక్క ఒక స్త్రీ రాముడికి పళ్ళు తినిపిస్తున్న దృశ్యం కనిపించాయి...

ఆరేకు మీద "నది చూసే త్రిశూలాలు... రుద్రనేత్రం... నంది" అనీ ఒక తెలియని భాషలో వ్రాయబడి ఉంది...

ఆ అక్షరాలు ఇప్పటి తెలుగులా కాక పురాతన శాసనాల్లోని లిపిలో వ్రాయబడి ఉన్నాయి...

కొద్దిగా కష్టపడితే కానీ అర్థం చేసుకోవడం కష్టం.

"చూసారా... ఈ రాగి రేకు మీద వ్రాయబడ్డ శాసనం ప్రకారం ఒక నది ఒడ్డున త్రిశూలాలు అంటే నా ఉద్దేశ్యం ప్రకారం రెండు శివాలయాలు... ఆ రెండు శివాలయాలకి మధ్యగా ఇంకో ఒడ్డు మీద ఇంకో ఈశ్వరుడి గుడి... త్రిశూలాలు, నంది ఉన్నాయి కాబట్టి అవి శివాలయాలయ్యుంటాయి.

ఎదురుగా రెండో ఒడ్డున ఉండే శివాలయంలో నందిలో నిధి రహస్యం తెలిపే ఆధారం ఉంటుంది" అనీ ఈ శాసనం ద్వారా తెలుస్తోంది".

శబరి రాముడికి పళ్ళు తినిపిస్తోంది కాబట్టి అది శబరి నది అయి ఉంటుంది" అన్నాడు దివాకర్.

"ఈ శాసనం దొరికి 60 సంవత్సరాలైంది అంటున్నావు... మరి మనవాళ్ళు దీని మీద పరిశోధన చెయ్యలేదా?"

"60 ఏళ్ళ క్రితం ఈ శాసనం దొరికితే ఏం చేసారో రికార్డుల్లో లేదు కానీ అప్పట్లో మన శాఖలో పనిచేసిన గిరిధారి అనే అసిస్టెంట్ డైరెక్టర్ దీని మీద కొంత పరిశోధన చేసినట్లు ఈ ఫైలు ద్వారా తెలుస్తోంది... కాకపోతే ఇది అసంపూర్ణంగా ఉంది... ఆఫీసు రికార్డుల ప్రకారం కొన్నాళ్ళ తరువాత గిరిధారి ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఇందులో ఉంది..." అన్నాడు ఫైలుని చూపిస్తూ...

"ఈ రాగిరేకులో ఉన్న శాసనంలో విషయాలు నిజమంటావా?"... అదే నిజమైతే మన వాళ్ళు దీన్నెందుకు పక్కన పెట్టేసారు... అంటే వాళ్ళకే విధమైన ఆధారాలు బహుశా దొరికి ఉండవు" అన్నాడు శివరాం ఆ ఫైలుని తిరిగి దివాకర్‌కి ఇచ్చేస్తూ...

"అప్పుడేం జరిగిందో తెలియదు కానీ నేను ఈ విషయంలో చాలా విషయాలను సేకరించాను... దీని ప్రకారం దండకారణ్యంలోని శబరి నది ఒడ్డున తవ్వకాలు జరిపితే ఆ నిధిని కనుక్కోవచ్చునీ నా అభిప్రాయం... ఈ ఫైల్లో అన్ని విషయాలు పొందు పరిచాను" అంటూ ఒక నోట్‌ని అతనికిచ్చాడు.

శివరాం ఆ నోట్‌ని పూర్తిగా చదివాడు.

"ఆశ్చర్యంగా ఉంది... చాలా విషయాలు సేకరించావు... ఇందులో ఏదో రహస్యం దాగి ఉన్నట్లే కనిపిస్తోంది. అయితే ఈ గుప్తనిధులు ఎంతవరకు నిజం"... మన తవ్వకాల్లో కూడా నిధి దొరుకుతుందనీ అంటూ ఉంటారు... కానీ ఎప్పుడూ దొరకలేదు" అన్నాడు శివరాం.

"500 సంవత్సరాల క్రితం ఈ దొంగలబారి నుండి, యుద్ధంలో శత్రురాజుల నుండి రక్షించుకొనేందుకు అప్పటి రాజులు, మత పెద్దలు ఇలా బంగారం, నగలు, వజ్రాలను ఏదో ఒక రహస్య స్థలంలో పాతిపెట్టి, వాటి ఆనవాళ్ళను రాగి రేకుల మీద, శిలల మీదో రహస్య లిపిలో వ్రాసి, ఉంచేవారు... ఒక్కొక్కసారి ఆ దాచిన వాళ్ళు చనిపోవడంతో ఆ నిధులు ఎవ్వరికీ దొరక్కుండా భూమిలోనే

ఉండి పోయాయనీ చరిత్ర చెబుతోంది. అందువల్ల గుప్త నిధులు లేవనీ కొట్టిపారేయలేము. కాబట్టి దొరికిన శాసనాలను, లిపిని సరిగ్గా డీకోడ్ అదే తర్జుమా చేస్తే వీటిని గుర్తించవచ్చు. 1920లో మొహంజదారో తవ్వకాల్లో ఎన్నో విలువైన గుప్త నిధులు దొరికినట్లు ఆధారాలు లభ్యం అయ్యాయి కదా... కాబట్టి మనం దొరికిన ఆధారాలతో పరిశోధన కొనసాగించి తవ్వకాలు జరిపితే ఆ గుప్త నిధి లభ్యం కావచ్చు. ఆ నిధులన్నీ ప్రభుత్వ ఆస్తులు... అవి లభ్యం అయితే ప్రజల కోసం వాటిని సద్వినియోగం చెయ్యవచ్చు" అన్నాడు దివాకర్.

శివరాం... నేను దీన్ని పూర్తిగా పరిశీలిస్తాను... ఆ ఫైలు నా దగ్గర వదలి వెళ్ళండి. రెండు రోజుల తరువాత ఏం చెయ్యాలో చెబుతాను" అన్నాడు శివరాం...

"ఒకే సార్... అంటూ ఆ ఫైలుని అతనికిచ్చి దివాకర్ వెళ్ళిపోయాడు...

ఈలోగా దివాకర్ శలవు మీద వెళ్ళడంతో శివరాం దాన్ని పక్కన పెట్టేసాడు. వారం రోజుల తరువాత దివాకర్ రావడంతో ఆ విషయం మాట్లాడటానికి అతన్ని పిలిచాడు...

"దివాకర్... నువ్వు తయారు చేసిన ఫైలుని పూర్తిగా పరిశీలించాను... ఢిల్లీలోని డీకోడింగ్ స్పెషలిస్టుతో మాట్లాడేను... అతను కూడా నువ్వు చెప్పినట్లు అవి దేనికో ఆధారాలు సూచించే చిత్రాలనీ చెబుతున్నాడు. కాబట్టి మనం ఒకసారి ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తే కొన్ని విషయాలు తెలియవచ్చు. ముఖ్యంగా ఇది వరకు మన శాఖ ఆ దండకారణ్య ప్రాంతంలో ఎందుకు తవ్వకాలు చేపట్టారో తెలియాలి. దానికి సంబంధించిన ఫైలేమైనా ఉంటే మనకి మరింత స్పష్టత వస్తుంది" అన్నాడు శివరాం.

"ఈ రాగి శాసనం దొరికి అరవై ఏళ్ళైంది... ఆ ఫైలు కూడా సమగ్రంగా లేదు... కానీ ఆ ప్రాంతంలో శివుడి గుడి ఉండేదనీ, గిరిజనులు శివుణ్ణి పూజించేవారనీ, కాలక్రమంలో అది శిథిలమవడంతో అదే స్థలంలో ఒక రాతి లింగానికి పూజలు చేస్తున్నారనీ తెలుసుకొనీ మనవాళ్ళు బహుశా అక్కడ తవ్వకాలు జరిపి ఉండవచ్చు. అదీ కాక అది గిరిజనులకు ఎంతో పవిత్రమైన శబరీనది ప్రాంతం కావడం, శబరి గిరిజన మహిళ కావడంతో శబరి అదే ప్రాంతంలో రాముడికి పళ్ళు ఫలహారంగా ఇచ్చి ఉంటుందన్న నమ్మకం వల్ల అక్కడ బహుశా గుడి ఉండాలన్నది మన శాఖ నమ్మకం... ఊహించినట్లుగానే అక్కడ గుడి అవశేషాలు దొరికాయి. ఇప్పుడ ఆ తవ్వకాలలో దొరికిన విగ్రహానికే స్థానిక గిరిజనులు పూజలు చేస్తున్నారు. కాబట్టి ఈ శాసనం ఆగుడికి ఏదో సంబంధం ఉండి ఉండాలనే నా నమ్మకం" అన్నాడు దివాకర్.

"అయితే ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?"

"మనం ఆ దండకారణ్య ప్రాంతానికి వెళ్ళి శబరి నది చుట్టుపక్కల కొండల మీద ఏవైనా పాత

దేవాలయాల ఆధారాల కోసం ప్రయత్నించాలి. అటువంటి గుళ్ళు ఏవైనా ఉంటే మనం ముందుకెళ్ళవచ్చు" అన్నాడు దివాకర్...

"ఓ పని చెయ్యండి... మీరు మన స్టాఫ్‌ని తీసుకొని దండకారణ్యం వెళ్ళి ఆధారాల కోసం వెతకండి... ఆ తరువాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం..." అన్నాడు శివరాం.

ఆ తరువాత దివాకర్ వెళ్ళిపోయాడు.

## 2

వారం రోజుల తరువాత పురావస్తు శాఖకి చెందిన ఐదుగురు సభ్యుల బృందం దండకారణ్యం బయలుదేరింది.

ముందుగా శబరీ నది ప్రాంతం చేరుకొని అక్కడ ఇది వరకు తవ్వకాలు జరిపిన శివుడి గుడి ప్రాంతానికి చేరుకున్నారు. మునిగూడ అనే గిరిజన తండాకి ఆ గుడి దగ్గరగా ఉంది...

ఆ మునిగూడకి ఒరిస్సా సరిహద్దు 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది...

ఆ తండా కొండవాలులో ఉంది. అక్కడ సర్పంచ్ హరి బొందు. అతన్ని కలిసి ఆ ప్రాంతంలో పురాతనమైన దేవాలయాల వివరాలు అడిగాడు దివాకర్...

అతను కొద్దిసేపు ఆలోచించి "రామన్న కొండ మీద పదేళ్ళ కితం ఎవురో వచ్చి గుడి కోసం సానా రోజులు తవ్వి ఎల్లిపోయినారు. మా వోళ్ళసేతే తవ్వించినారు" అన్నాడు హరిబొందు... అతను బాగా తాగి ఉండటంతో అతను చెబుతున్నది నిజమో కాదో అర్థం కాలేదు దివాకర్‌కి.

ఆమర్నాడు అతను చెప్పిన రామన్న కొండకి బయలుదేరాడు.

ఆ తండాకి అది ఇరవై కిలోమీటర్లుంది. ఆ కొండ వివరాలను అక్కడ ఫారెస్ట్ గార్డ్ రాజుని అడిగి తెలుసుకున్నాడు దివాకర్.

అతను చెప్పిన వివరాల ప్రకారం ఆ కొండ దగ్గరకి బయలుదేరారు... జీపులో వెళ్తున్నపుడు సర్వే ఆఫ్ ఇండియా మేపుల్ని పరిశీలిస్తే శబరినది, దాని చుట్టు పక్కల కొండల్లోని రామన్న గుట్టమీద ఒక గుడి ఆకారపు బొమ్మ దాని పక్కన ఉన్న పులికొండ, ఆ రెండింటికి మధ్యగా నదికి అవతలి ఒడ్డున ఉన్న చింతకొండ మీద దేవాలయాల చిత్రాలు వేసి ఉండటాన్ని గమనించాడు. ఆ కొండల ఎత్తు అందులో వ్రాసిన కాంటూర్ల ప్రకారం సముద్ర మట్టాని 500 మీటర్ల ఎత్తులో ఉన్నాయి.

ఆ వివరాలన్నీ వ్రాసుకున్న తరువాత అతనికి ఒక అవగాహన కలిగింది.

ఆమర్నాడు నలుగురు గిరిజనుల సహకారంతో రామన్న గుట్ట ఎక్కడం మొదలు పెట్టారు. ఆ అడవులు, గుట్టలు కొట్టిన పిండి కావడంతో ఆ నలుగురు చాలా త్వరగా ఎక్కుతుంటే దివాకర్ బృందం మాత్రం మధ్యలో ఆగి కాసేపు విశ్రమించి, నీళ్ళు తాగుతూ ఎక్కసాగేరు. అలా రెండు గంటల తరువాత రామన్న గుట్ట ఎక్కారు. అక్కడ నుంచి చూస్తే కింద తండాల్లోని ఇళ్ళు చాలా చిన్నవిగా కనిపిస్తున్నాయి... అక్కడ ఉన్న చింతచెట్టు కింద కాసేపు కూర్చున్న తరువాత హిక్కా అన్న గిరిజనదు లేచి నిలబడి "దొరా! దూరంగా కనిపిస్తున్న ఆ సెట్లకాడ ఓ గుడి కనిపిత్తోంది." అంటూ అటువైపు నడిచాడు. దివాకర్ ఆశ్చర్యపోతూ అతని వెంట బయలు దేరాడు. కొంచెం సేపటికి వాళ్ళు ఆ ప్రదేశానికి చేరుకొన్నారు. కొండ మీద చల్లగా ఉంది కానీ అలవాటు లేకపోవడం వల్ల ఆయాసం వస్తోంది దివాకరానికి.

ఆ ప్రాంతంలో ఎవరో తవ్విన దాఖలాలు కనిపించాయి. సుమారు 4 మీటర్ల లోతు 20 అడుగుల చదరంలో తవ్వకం కనిపించింది. ఆ తవ్విన రాళ్ళు మట్టి పక్కనే కుప్పగా పోసి ఉన్నాయి. ఆ మట్టిలో రెండు సిగరెట్ల పేకట్లు, రెండు నీళ్ళ సీసాలు కనిపించాయి.

ఆ తవ్వకాన్ని చూడగానే దివాకరానికి చెమటలు పట్టాయి. తను ఎంతో కృషి, పరిశోధన చేసి గుర్తించిన ఈ ప్రాంతాన్ని ఇంతకు మునుపే ఎవరో కనిపెట్టి అక్కడికి వచ్చినట్లు అనిపించ సాగింది... దీని వెనక ఎవరిదైనా హస్తం ఉదా? పురావస్తు శాఖ వాళ్ళకే ఇటువంటి రహస్యాలు తెలిసే అవకాశం ఉంటుంది... అంటే తమ శాఖ వారే ఎవరో ఈ పనిచేసి ఉండాలి... కింద తండాలోని సర్పంచ్ చెప్పినట్లు ఎవరో వచ్చి ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిపినట్లు కనిపిస్తోంది...

ఎవరు? ఈ నిధి గురించి ఎవరు వెతికారో? తమ శాఖలో 20 ఏళ్ళ నుంచి ఈ ప్రాంతంలో ఏ తవ్వకాలూ జరిపిన దాఖలాలు లేవు... శివుడి గుడి కోసం మాత్రం తవ్వేరు... అందులోనే ఈ చిన్న శివాలయాల గురించి తెలిపే రాగి శాసనం దొరికింది. ఆ తరువాత ఏ విధమైన తవ్వకాలు జరగలేదు.

ఆ సమయంలో అతనికి లీలామాత్రంగా 'గిరిధారి' అనే వ్యక్తి గుర్తుకు రాసాగేడు. అతనెల ఉంటాడో తెలియదు. కానీ గొప్ప పరిశోధకుడనీ అప్పటి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు చెప్పటం గుర్తుకు వచ్చింది. కానీ ఇరవై ఏళ్ళ క్రితం అతనెక్కడికో వెళ్ళిపోయినట్లు విన్నాడు. అతనికీ ఈ తవ్వకానికి ఏమైనా సంబంధం ఉందా? లేక అంతకు మునుపే వీటిని ఎవ్వరైనా తవ్వేశారా? తవ్వితే వాళ్ళకి ఏమైనా లభ్యం అయ్యాయా? ఇలా ఎన్నో ప్రశ్నలు అతన్ని వేధించ సాగాయి.

ఆలోచనల్లోంచి తేరుకొని దివాకర్ తవ్వకాల్లో బయటపడ్డ మెట్ల ద్వారా జాగ్రత్తగా ఓ గిరిజనుడి సాయంతో కిందకు దిగాడు.

అక్కడ పెద్ద పెద్ద రాళ్ళు, చెక్క సున్నంతో కట్టిన ఓ చిన్న గుడి ఉంది... కానీ గోడలన్నీ కూలిపోయి ఉన్నాయి... దివాకర్ అందులోకి వెళ్ళబోతుంటే పెద్దనాగుపాముని చూసి ఆగిపోయాడు... ఆ మధ్యలో

రాళ్ళ మధ్య శివుడి లింగం నల్లటి రాతితో చేసింది కనిపించింది. దాని మీద ఎర్రటి మట్టి కప్పి ఉంది.... దానికి ఎదురుగా పెద్ద మట్టికుప్ప, రాళ్ళు కనిపించాయి...

దివాకర్ ఆ గిరిజనుల్ని అక్కడ మట్టిని, రాళ్ళను తవ్వమనీ చెప్పి బయటకు వచ్చాడు.

ఒక గంట తరువాత వాళ్ళు ఆ మట్టిని తవ్వి బయట పోసారు... అప్పుడు ఆ ప్రాంతం స్పష్టంగా కనిపించసాగింది... శివుడి లింగం మీద 'రుద్రనేత్రం' చెక్కబడి ఉంది. దాని చూడగానే దివాకర్‌కి దొరికిన రాగి రేకులోని శాసనంలోని రుద్ర నేత్రం' లాగే ఉంది... అందులోనే ఉన్నట్లు ఎదురుగా నల్లటి రాతితో చూస్తున్న నంది... దాని మీద పులిబొమ్మ... "పులికొండ గుడిలో దాగి ఉంది గుట్టు"... అని వ్రాయబడి ఉంది... ఆ లిపి రాతి మీద చెక్కబడి ఉంది. అది స్పష్టమైన తెలుగులో కాక బొమ్మల్లా గీతలతో గీసి ఉన్నాయి. ఆ లిపి దివాకర్‌కి తెలుసు కాబట్టి దాన్ని తర్జుమా చేసి చదివాడు. దాని ప్రకారం పులికొండ మీద గుడిలో దీనికి సంబంధించిన ఏదో రహస్యం దాగి ఉండొచ్చనిపించింది.

కానీ ఈ తవ్వకం చూస్తే ఎవరో ఈ గుళ్ళను కనిపెట్టి తవ్వకాలు జరిపినట్లు కనిపిస్తోంది. అయినా వాటిని చూస్తే మిగతా విషయాలు తెలిసే అవకాశం ఉంది...

మాజీ అనే గిరిజనుడు పులికొండ పక్కనే ఉంది అనే చెప్పడంతో ఆ కొండను దిగి ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి వచ్చేసాడు దివాకర్...

ఆ మర్నాడు మళ్ళీ అదే బృందాన్ని తీసుకొని 'పులికొండ' దగ్గరకు వెళ్ళీ రెండు గంటల తరువాత దాని మీదకు చేరుకున్నాడు.

అక్కడ ఓ గంట సేపు వెతికిన తరువాత ఆ గుడి ఉన్న ప్రవేశం కనిపించింది.

కానీ ఆశ్చర్యంగా అక్కడ కూడా రామన్న గుట్ట మీద తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్ళు కనిపించాయి.

అక్కడ గుడి బాగా పాడుబడిపోయి కనిపించింది. ఆ శివలింగం మీద 'రుద్రనేత్రం' చెక్కబడి ఉంది.

ఎదురుగుండా నంది పక్కన పడేసి కనిపించింది. దాని కాళ్ళు విరిగిపోయిన్నాయి. నంది కింద భాగంలో "నదికి ఆవల చింతకొండ గుడిలో నంది చెబుతుంది, దారి' అనీ ప్రాచీన లిపిలో వ్రాయబడి ఉంది...

అది చదివిన తరువాత దివాకర్‌కి అనుమానం పెరిగింది. ఎవరో దీని వెనక బడ్డారు. నిధి కోసం అన్వేషించినట్లు ఆనవాళ్ళు స్పష్టంగాకనిపించాయి...

ఆ సాయంత్రం మళ్లీ ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి వచ్చిన తరువాత దివాకర్ ఆలోచించడం మొదలు

పెట్టాడు.

తన అన్వేషణ సరియైన దిశలోనే సాగుతోంది... తన పరిశోధనల ఆధారంగా లభించిన ప్లాను లోని మూడు గుడుల వివరాలు లభ్యం అయ్యాయి. ఇంక మూడో గుడి సంగతి రేపు తెలుస్తుంది.

భారత పురాతత్వ శాఖ ఈ నిధి విషయమై ఎందుకో నిర్లిప్తత వహించినట్లు అతనికి అనిపించింది...

ఆ మర్నాడు ఆ రెండు కొండల మధ్య ప్రాంతంలోని శబరి నదికి చేరుకున్నాడు. అక్కడ ఆ నది రెండు కొండల మధ్య పారుతోంది... ఆ ప్రాంతంలో రెండు కొండల మధ్య దూరం 300 అడుగులు మాత్రమే ఉంది... దీంతో ప్రవాహ వేగం కూడా ఎక్కువగా ఉంది... దూరం నుంచి చూస్తే నది హెూరులోనే వడి కనిపిస్తోంది...

అక్కడ ఓ నాటు పడవ కనిపించింది... దాన్ని చూడగానే దివాకర్‌కి భయం వేసింది. ఈ సుడిగుండాల మీదుగా ఈ లోయని దాటడం ప్రమాదమేమో నన్న సందేహంగా కలిగింది... అదే విషయాన్ని గిరిజనులతో ప్రస్తావిస్తే తాము అవతలి ఒడ్డుకి ప్రతీరోజు వెళ్తూ ఉంటామనీ ప్రమాదం ఎప్పుడూ జరగలేదనీ చెప్పడం వల్ల పడవలో అవతల ఒడ్డుకి బయలుదేరాడు.

ఉదయం తొమ్మిది గంటలకే కారుమబ్బులు కనిపిస్తున్నాయి... వర్షం వచ్చే ప్రమాదం పొంచి ఉంది... చల్లటి హెూరు గాలి... చెట్లన్ని భయంకరంగా ఊగుతున్నాయి...

ఆ సమయంలో ఆ ప్రదేశం చాలా అందంగా కనిపిస్తోంది. ఎదురుగా ఆకుపచ్చటి కొండలు మధ్యలో ఉరుకులు పరుగులతో శబరి నది, సూర్యకిరణాలు నదిపై పడి పరావర్తనం చెందుతున్న దృశ్యం... కొండల మధ్య దోబూచులాడుతున్న నల్లటి మబ్బులు...

కొద్ది సేపటి తరువాత పడవ బయలుదేరింది... ఇద్దరు కుర్రవాళ్ళు చాలా తీక్షణంగా ప్రవాహ వేగాన్ని గమనిస్తూ జాగ్రత్తగా తెడ్లు వేస్తూ లోయని దాటిస్తున్నారు.

ప్రవాహ వేగానికి పడవ కుదువులకి లోనవుతూ భయాన్ని కలిగిస్తోంది... దివాకర్‌కి పడవ వెళ్తుంటే ఉద్విగ్నత ఎక్కువవుతోంది... రాను రాను అది వేగాన్ని సంతరించుకుంది... ప్రవాహం వేగం మధ్యలో ఎక్కువగా ఉండటంతో కుదుపులు ఎక్కువయ్యాయి.

అరగంట తరువాత ఎదురుగా కాకుండా దిగువన అవతలి ఒడ్డుకి చేరుకుంది పడవ.

ఏ సమస్య లేకుండా ఒడ్డుకి చేరడంతో ఊపిరి పీల్చుకున్నాడు దివాకర్...

అక్కడ పడవకి లంగరు వేసి కొండ ఎక్కడం మొదలు పెట్టారు...

కొండవాలు నిటారుగా ఉండటంతో ఆయాసం ఎక్కువవుతోంది... మధ్యలో ఆగి తన జేబులోని

మేపుని పరిశీలించసాగేడు... దాని ప్రకారం తాము వెళ్ళబోతున్న ప్రవేశానికి వ్యతిరేకంగా వెళ్తున్నట్లు గమనించాడు.

వెంటనే వెళుతున్న సహదేవ్, బలభద్ర, ప్రధాన్, సాహూలను ఆగమని చెప్పి వాళ్ళ దగ్గరకు వెళ్ళి వెళ్తున్న తూర్పుకి కాకుండా పడమర వైపుకి వెళ్ళాలనీ చెప్పాడు...

ఆ తరువాత వాళ్ళ ప్రయాణ దిశ మారింది. పడమర వైపుకి వెళ్ళడం మొదలు పెట్టి రెండు గంటల తరువాత మేపులో చూపించబడ్డ ప్రదేశానికి చేరుకున్నారు...

ఇంతలో హోరుగాలి, వర్షం మొదలైంది... ఉరుములు, మెరుపులు... వర్షం జోరు ఎక్కువవడంతో ఓ మర్రిచెట్టు కిందకు చేరుకున్నారు...

రాను రాను వర్షం ఎక్కువైంది... మధ్యాహ్నం 12 గంటలవుతుండగా వర్షం తగ్గిన తరువాత మళ్ళీ నడక మొదలు పెట్టారు...

ఒంటి గంట ప్రాంతంలో ఆ ప్రదేశానికి చేరుకున్నారు... నదికి అవతలి ఒడ్డున రెండు గుళ్ళకు మధ్యగా ఉన్న ఆ ప్రాంతంలో కొండ పైకెక్కి వెతకడం మొదలు పెట్టారు.

కొద్ది సేపటికి సహదేవ్ 'దొరా! ఈడ ఉంది గుడి' అనీ గట్టిగా అరిచాడు...

దివాకర్ పరుగు పరుగున అక్కడికి చేరుకున్నాడు...

అక్కడ 10 అడుగుల కింద ఓ గుడి కనిపించింది... ఇది వరకు కప్పబడి ఉన్న ఆ ప్రాంతాన్ని తవ్వినట్లు చుట్టూరా పెద్దరాళ్ళు, మట్టి కుప్పలు పోసి కనిపించాయి.

దివాకర్ కర్రల సాయంతో రాళ్ళ మీదుగా కిందకు చేరాడు. వర్షం వల్ల నీరు బాగా చేరింది.

కొద్దిసేపటికి రాళ్ళను తొలగించిన తరువాత శివలింగం కనిపించింది. దాని మీద మట్టిని తొలగించిన తరువాత మరింత స్పష్టంగా కనిపించసాగింది...

దాని వెనక వైపు రుద్రనేత్రం చెక్కబడి ఉండటాన్ని దివాకర్ గమనించి ఫోటోని తీసాడు. రాగిరేకులో వ్రాసినట్లు "నిధికి దారి నంది చూపుతుందని" వ్రాసి ఉంది...

కానీ అక్కడ నంది కనిపించలేదు. కొద్ది దూరంలోని పొదల మధ్య అది దర్శనమిచ్చింది. అది కూడా పాడుబడి పగుళ్ళతో విరిగిపోయి దర్శనమిచ్చింది.

గుడికి ఎదురు గుండా ఉండవలసిన నంది ఇంత దూరంలో ఎందుకుందో దివాకరానికి అర్థం కాలేదు.

ఆ ప్రాంతాన్ని జల్లెడ పడితే ఆకులు కప్పిన ఒక ప్రదేశం కనిపించింది...

వాటిని ఆరుగురు గిరిజనులు కష్టపడి తొలగిస్తే ఒక పెద్ద తవ్వకం కనిపించింది...

ఆ కందకంలోకి దిగి దాన్ని పూర్తిగా పరిశీలించాడు... అందులోంచి ఒక మూలగా మెట్ల దారి కనిపించింది. వెంటనే వాళ్ళని రావద్దని చెప్పి తనొక్కడే ఆ మెట్ల ద్వారా లోనికి వెళ్ళాడు. చీకటిగా ఉండటంతో టార్చి లైటు సాయంతో కిందకి దిగాడు. టార్చిలైటు వెలుగులో అతను లోపలకి దిగి చాలాసేపు పరిశీలిస్తూ గడిపాడు. అతను లోపల ఏం చేస్తున్నాడో అర్థం కాక బయట బృందం అతని కోసం ఎదురు చూడసాగింది.

గంట తరువాత దివాకర్ బయట కొచ్చాడు. అతన్ని చూసి గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు.

## 3

"ఈ గుప్తనిధి విషయంలో మన పురావస్తు శాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 40 ఏళ్ళ క్రితం దండకారణ్యంలోని శివుని గుడి తవ్వకాల్లో దొరికిన రాగిరేకు శాసనాన్ని సరిగ్గా పరిశోధించి ముందుకెళితే ఆ నిధి బయటవాళ్ళ చేతిలో పడి ఉండేదికాదు. ఏదో చాలా కేజువల్ ధోరణిలో 'గిరిధారి' గారి కప్పగించి ఊరుకున్నారు. ఆయన తన తెలివితేటలతో దాన్ని తన స్వలాభానికి వాడుకొనీ ప్రభుత్వాన్ని, మన శాఖనీ మోసం చేసాడు. ఆ తరువాత సడన్‌గా ఉద్యోగం మానేసి వెళ్ళినపుడు కూడా మనవాళ్ళు అతన్ని అనుమానించలేదు. ఎంత ప్రభుత్వ శాఖలైనా తన ఉద్యోగుల్ని ఓ కంట కనిపెడుతుండాలి... కానీ అది జరగలేదు... నా ఉద్దేశ్యంలో ఆ 'గిరిధారి' ఆ రాగిరేకు మీద వ్రాసిన వాటిని డీకోడ్ చేసి అన్ని వివరాలు తెలుసుకొనీ, ప్రభుత్వానికి తెలపకుండా తన స్వార్థానికి ఉపయోగించుకొనీ ఆ 'నిధిని' కైంకర్యం చేసి ఉంటాడు. ఆ గిరిధారికి తప్పా ఇంకెవరికీ ఆ నిధి గురించి తెలిసే అవకాశం లేదు... మొన్న నేను చేసిన సర్వేలో ఆ తవ్వకాలని చూసి నాకు చాలా బాధ వేసింది. నేను నాలుగేళ్ళుగా పరిశోధించి సేకరించిన వివరాలన్నీ వ్యర్థమయ్యాయి. వందల కోట్ల గుప్తనిధి పరుల పాలైంది. ఆ రోజుల్లో రాజులు బ్రిటిష్ వాళ్ళ పాలవకుండా మనకీ ప్రజలకీ చెందాలన్న సదాశయంతో దాచిన నిధి దురదృష్టవశాత్తూ మనికి దక్కకుండా పోయింది. ఇటువంటి ఆస్తులు సక్రమమైన రాజ్య వ్యవస్తలు లేక మంచి వ్యక్తుల చేతుల్లోనో పడితే అది ప్రజలకు మేలు చేస్తుంది. లేకపోతే అక్రమాలు పెరిగి ప్రజలకు హాని చేస్తుంది..." అనీ శివరాంకి సుదీర్ఘంగా చెప్పాడు దివాకర్.

ఆ సమయంలో శివరాం గదిలో వాళ్ళిద్దరే ఉన్నారు. దండకారణ్య ప్రాంతం నుంచి శనివారమే వచ్చినా మర్నాడు ఆదివారం కావడంతో ఈరోజు వచ్చి జరిగిన వృత్తాంతాన్ని అతనికి చెప్పసాగేడు...

అతను తెచ్చిన ఫోటోల్ని, వీడియోలను తన కంప్యూటర్లో చూస్తూ చాలాసేపు మౌనంగా ఉండిపోయాడు...

నువ్వు చెప్పినట్లు ఒకటీ రెండూ కాదు... వందల కోట్లు... అదీ ప్రజల సొమ్ము. దానికి ట్రస్టీలమైన మనం అది పరుల పాలౌతుంటే చూస్తూ ఊరుకొని జాతికి ద్రోహం చేసాము... ఇప్పుడు మనం ఏం చెయ్యాలి?" అన్నాడు గద్గద స్వరంతో...

గదిలో ఫోన్ చప్పుడు తప్పా నిశ్శబ్దం ఆవరించి ఉంది...

"ఈ విషయాన్ని రీజనల్ ఆఫీసుకి, హెడ్డాఫీసుకి తెలియపరచి, పోలీసు కంప్లైంట్ ఇప్పిస్తే మంచిది. సరిగ్గా పరిశోధన చేస్తే దీని వెనక ఎవరున్నారన్నదీ పట్టుకోవడం కష్టమైన పనికాదు. ఆ గిరిధారిని పట్టుకుంటే అన్ని విషయాలు బయటకు వస్తాయి. మనం మన విధిని సక్రమంగా నిర్వహించాము. కాబట్టి మన తప్పేమీ లేదు. కానీ మనం కూడా నిర్లక్ష్యంతో ఎవ్వరికీ చెప్పకుండా ఉంటే భవిస్యత్తులో మనల్ని కూడా అనుమానించే స్థితి రావచ్చు. కాబట్టి ఈరోజే మీరీ విషయాలను హెడ్ క్వార్టర్స్‌కి తెలియజేయండి" అన్నాడు దివాకర్.

"తప్పకుండా... నువ్వు అన్ని వివరాలు, ఫోటోలతో ఒక సమగ్ర నివేదికను తయారు చెయ్యి. దాన్ని వెంటనే పంపుతాను. ఈలోగా గిరిధారి వివరాలు కూడా సేకరించు. అతను ఎప్పుడు మన ఆఫీసులో చేరిందీ, ఎన్నాళ్ళు ఏం పనిచేసిందీ, ఎప్పుడు మానేసి వెళ్ళిపోయాడో...

అతని ఫోటోతో సహా అన్ని వివరాలతో నివేదిక తయారు చేస్తే హెడ్డాఫీసు వాళ్ళకి క్లారిటీ వస్తుంది. ఆ తరువాత వాళ్ళ సూచనల ప్రకారం మనం నడుచుకోవచ్చు..." అన్నాడు శివరాం.

సాయంత్రం ఐదు గంటలకి ఒక సమగ్ర నివేదికతో కూడిన ఫైలుని తెచ్చి శివరాంకిచ్చేడు దివాకర్...

ఆ ఫైలుని చదివి మెచ్చుకొనీ హెడ్డాఫీసుకి మెయిల్ చేసాడు శివరాం.

వారం రోజుల తరువాత "ఈ విషయాన్ని వెంటనే పోలీసులకి చెప్పి, ఈ కేసుకి సరియైన ముగింపు పలకాలనీ సూచించింది"... హెడ్డాఫీసు.

ఆ మర్నాడు జిల్లా ఎస్పీకి అన్ని వివరాలతో సమా నిధి మాయమైన విషయాన్ని తెలియపరుస్తూ ఫిర్యాదు చేసాడు శివరాం...

## <u>4</u>

కారు వేగంగా వెళుతోంది... శ్రీహర్ష రోడ్డు మలుపులను ఎంతో చాకచక్యంగా దాటిస్తూ డ్రైవింగ్ చేస్తున్నాడు.

మధుమిత అతని పక్కన ముందర సీట్లో కూర్చొని ప్రకృతిని ఆస్వాదిస్తోంది...

"ఇంకెంత సేపు హర్షా" అంది చేతి వేళ్ళని విరుచుకుంటూ...

"ఇంకా రెండు గంటలు పడుతుంది. త్వరగా వెళ్ళడాఇకి ఇది జాతీయ రహదారి కాదు... ఘాట్ రోడ్. మనం వెళుతున్నది దండకారణ్యంలోకి... అయినా హాయిగా ఏ కడియం ప్రాంతాన్నో ఎంచుకోక ఈ అడవి నెందుకు ఎంచుకున్నావు" అన్నాడు నవ్వుతూ...

"నర్సరీల్లో ఈ ప్రాజెక్ట్ కష్టం హర్షా... మన రాష్ట్రంలో "ఫ్లోరా ఎండ్ ఫౌనా" అంటే వృక్ష జంతు జాతుల గురించి పరిశోధన చెయ్యాలంటే అడవులే సరియైన ప్రదేశాలు... అందుకే ఈ అడవిని ఎంచుకున్నాను. నేను చెయ్యబోయే ప్రాజెక్టు తూర్పు కనుమల్లోని అడవుల్లో వివిధ రకాల వృక్షాలు, వాటి వైరుధ్యం, అలాగే ఏయే జంతుజాలాలు అక్కడ ఉన్నాయో, వాటి జీవన వైవిధ్యం, ప్రకృతి సమతుల్యానికి అవి ఎలా సహాయపడుతున్నాయో... అన్న విషయాలను వివరించేలా ఉంటుంది... మా ప్రొఫెసర్ గారు కూడా నీలాగే అన్నారు... అంతటి కీకారణ్యంలో ఈ ప్రాజెక్ట్‌ని చెయ్యడం కష్టమే... ఆ విషయం నాకూ తెలుసు... నాన్నగారు మొదట్లో ససేమిరా ఈ ప్రాజెక్ట్‌కి ఒప్పుకోలేదు... కానీ నాన్నగారి స్నేహితుడు ఫారెస్ట్ ఆఫీసరు... అతను వాళ్ళ ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో రెండు నెలలు ఉండటానికి అనుమతివ్వడంతో నాన్నగారు ఒప్పుకున్నారు" అంది మధుమిత...

మధుమిత బోటనీ, జువాలజీలో బీయస్సీ చదివి ఆ తరువాత బోటనీలో ఎమ్మెస్సీ చేసింది... ఆ తరువాత మన రాష్ట్రంలోని అడవుల్లో వృక్ష జంతువుల వైవిధ్యం గురించిన విషయం మీద పరిశోధన చెయ్యాలనీ నిర్ణయించుకుంది. ఈ విషయంలో గైడ్‌గా ప్రొఫెసర్ రంగనాథం నియమించబడ్డారు. అతను కూడా తూర్పు కనుమల్లోని దండకారణ్యమే ఈ ప్రాజెక్ట్‌కి సరియైన స్థలమనీ అభిప్రాయపడ్డాడు...

మధుమిత తండ్రి బలరామకృష్ణమూర్తి విశాఖకి దగ్గర్లోని ఒక పల్లెలో టీచరు... వ్యవసాయం కూడా చేస్తుంటాడు. అతనికి మధుమిత ఒక్కర్తే కూతురు. భార్య విమల వద్దంటున్నా ఈ ప్రాజెక్టుని కూతురు మధుమిత చెయ్యడానికి ఒప్పుకున్నాడు... అదృష్టవశాత్తూ ఫారెస్ట్ అతిథి గృహంలో ఉండటానికి అనుమతి లభించింది కాబట్టి అతని మనసు కుదుటపడింది. స్త్రీలు ఏ విషయంలోనూ తక్కువ కాదనీ, స్త్రీకి స్వేచ్ఛ ముఖ్యం అనీ నమ్మిన వాడతను. అందుకే కూతుర్ని ఆమె స్నేహితుడు శ్రీహర్ష దండకారణ్యానికి అతని కార్లో తీసికెళ్ళడానికి అనుమతించాడు.

శ్రీహర్ష బియస్సీ చదివి రెండేళ్ళ క్రితం గ్రూప్ వన్‌లో ఎంపిక కాబడి డీయస్పీగా రాష్ట్ర ప్రభుత్వంలో చేరాడు... అతను బీయస్సీలో మధుమిత సహాధ్యాయి... అలా మొదలైన పరిచయం డిగ్రీ పూర్తయ్యేసరికి ఇద్దరూ బాగా దగ్గరయ్యారు... కానీ తమ పరిధులు దాటలేదు... మొదట్లో బలరామకృష్ణ తన కూతురు మధుమిత శ్రీహర్షతో స్నేహంగా ఉండటాన్ని ఇష్టపడలేదు కానీ శ్రీహర్ష వ్యక్తిత్వం చూసి తన మనసు మార్చుకున్నాడు.

మధుమిత పీహెచ్.డీలో చేరిన నెల్లాళ్ళకు శ్రీహర్షతో 'దండకారణ్యంలో నెలరోజులుండి మొక్కలు, జంతువుల వివరాలు సేకరించాలనీ, అందుకోసం నాన్నగారు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ తన కోసం నెల్లాళ్ళ పాటు రిజర్వ్ చేసారనీ చెప్పింది.

శ్రీహర్ష తనకు కూడా దండకారణ్యంలో ఒక కేసు విషయమై వెళ్ళవలసిన అవసరం ఉందనీ, తాను కూడా రెండురోజుల తరువాత అక్కడికి వస్తాననీ చెప్పడంతో మధుమిత అతనితో బయలుదేరడానికి సిద్ధపడింది...

ఈ రోజు ఉదయాన్నే ఇద్దరూ శ్రీహర్ష జీపులో బయలుదేరారు.

ఒంటిగంట ప్రాంతానికి వాళ్ళు ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌కి చేరుకున్నారు.

వాళ్ళని చూసి ఒక పాతికేళ్ళ యువకుడు బయటకొచ్చి ఇద్దరికీ దండాలు పెట్టి "నా పేరు మారీచు దొరా... మీరొస్తున్నారనీ ఫారెస్ట్ గార్డు రాజు బాబు సెప్పినాడు... నేనిక్కడ వాచ్‌మెన్ని" అంటూ ఇద్దరి బేగులు జీపులోంచి దింపి గెస్ట్ హౌస్ లోకి తీసికెళ్ళాడు. అక్కడ మూడు సూటులున్నాయి. నాగావళి, గోస్తని, వేగావతి ఆ గదుల పేర్లు... వాటిని చూసి శ్రీహర్షకు ఆనందం కలిగింది. మూడూ నదుల పేర్లే...

"మారీచూ! ఎన్నాళ్ళైంది ఇక్కడ చేరి" అనీ అడిగాడు హర్ష...

"నేను టెంపర్‌వరీగా మూడేళ్ళకితం సేరాను దొరా... మాది పాడేరు దగ్గర ఊరు. అమ్మా నాన్న లెవ్వరూ లేరు" అనీ చెప్పాడు.

"సర్లే... నా లగేజీ వేగావతిలోనూ, అమ్మగారిది గోస్తనీ లోనూ ఉంచు... భోజనం దొరకుతుందా?" అని అడిగాడు.

"చేసాను దొరా... నాకన్ని వొంటలూ వొచ్చు... మీకేమి కావలిస్తే సెప్పండి. సిటికెల మీద తయారు సేసెస్తాను" అన్నాడు మారీచు.

అప్పుడు చూసాడు శ్రీహర్ష మారీచుని... మనిషి నల్లగా, రివటలా ఉన్నాడు. చింపిరిజుట్టు, చేతిమీద శబరి అన్న పచ్చబొట్టు, కాకీపేంటు, చొక్కాతో... అతని కళ్ళు మాత్రం తెల్లటి కనుగుడ్లతో తీక్షణంగా కనిపిస్తున్నాయి... మెడలో పూసల దండ, చేతికి తాయెత్తు... ఏదైనా మనిషి వింతగా కనిపిస్తున్నాడు. స్నానాలు చేసే సరికి డైనింగ్ హాల్లో వేడి వేడి భోజనం వడ్డించాడు మారీచు...

వేడి సాంబారు, బంగాళాదుంపల కూర... ఆవకాయ... పెరుగు... భోజనం ఆకలిగా ఉండటం వల్ల రుచిగా ఉంది...

ఇద్దరూ మాట్లాడుకుంటూ తినేసారు...

"మారీచూ! అమ్మగారు ఇక్కడ నెల్లాళ్ళు ఉంటారు. రోజు అడవిలోకి వెళ్ళాలి... నువ్వు ఆమెకు తోడుగా వెళ్ళీ అన్ని చూపించాలి..." అన్నాడు.

"ఈ అడవి నాకు కొట్టిన పిండిబాబూ... అలాగే సూపిత్తా" అన్నాడు ప్లేట్లను తీస్తూ...

"మారీచూ! ఇంతకీ ఏం చదువుకున్నావు".

"నాను ఎనిమిది సదివాను... కానీ పేసు కాలేదు... అయ్య సనిపోవడంతో మానేసేను" అన్నాడు మారీచు...

మధుమిత "భోజనం రుచిగా ఉంది... బాగా చేసావు..." అంటూ మారీచుని మెచ్చుకుంది.

ఇద్దరూ బయట వరండాలో ఉన్న వెదురు కుర్చీల్లో కూర్చున్నారు... ఎదురుగా టీపాయి మీద పేపర్లున్నాయి.

"హర్షా... ఇంతటి కీకారణ్యంలో ఇంత చక్కటి గెస్ట్ హౌస్ కట్టడం చాలా గొప్ప విషయం... అడవనీ తప్పితే ఇంటికన్నా ఇదే బాగుంది... హాయిగా ప్రకృతి మధ్యలో చెట్లూ చేమలకి దగ్గరగా ఉంది... నాకైతే ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది" అంది మధుమిత.

"తరలి రాద తనే వసంతం తన దరికి రాని వనాల కోసం" అనీ ఓ కవి చెప్పినట్లు అడవికి వసంతం వచ్చినట్లు మనమూ ఇక్కడికి వచ్చాము... నా పోలిక సరిపోయిందా" అన్నాడు...

"చాలా బాగా చెప్పావు... కొన్నాళ్ళ పాటు ఈ వనంలో ప్రకృతికి దగ్గరగా ఉంటే మనసుకి ప్రశాంతత కలుగుతుంది" అంది మధుమిత చుట్టూ పరిసరాలను చూస్తూ...

"నువ్వనుకున్నంత ప్రశాంతత ఈ అడవిలో ఏం లేదు. ఇక్కడ చాలా అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నట్లు మాకు ఫిర్యాదులొచ్చాయి. ఇక్కడ టేకుచెట్లను, గంధం చెట్లను కొట్టి ఇతర రాష్ట్రాలకు తరలించుకు పోతున్నారు. ఇక్కడ కలప కంట్రాక్టర్ల ముసుగులో ఈ పనులకు కొందరు నేరస్తులు పాల్పడుతున్నారు. ఇప్పటికీ అడవిలో చాలా కలపని తరలించుకు పోయారు. దీన్ని అరికట్టాలి... నెలరోజుల క్రితం జిల్లా అటవీశాఖాధికారి మాకు అధికారికంగా ఫిర్యాదు చేసారు. అందుకే నువ్వు జాగ్రత్తగా అప్రతమత్తంగా ఉండాలి. అదీ కాక ఇక్కడ క్రూరమృగాలు అంటే పులులు, చిరుతలు, ఎలుగుబంట్లూ ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇది టైగర్ రిజర్వ్... అంటే పులుల అభయారణ్యం... జాగ్రత్త" అన్నాడు.

వాళ్ళు అలా మాట్లాడుకుంటున్న సమయంలో ఒక మోటారు సైకిలు ఆ ఆవరణలోకి ప్రవేశించింది. దాన్ని స్టాండ్ వేసి ఒక వ్యక్తి వచ్చి శ్రీహర్షకు నమస్కారం చేసి "సార్! నమస్తే... నా పేరు సోమరాజు...

ఫారెస్ట్ గార్డ్‌ని... ఈరోజు మా రేంజర్ గారు ఫోన్ చేసి మీరొస్తున్నట్లు చెప్పారు" అన్నాడు...

"గ్లాడ్ టూ మీట్ యూ! కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాడు.

"ఈవిడ మధుమిత. రీసెర్చి స్కాలర్... ఇక్కడ చెట్లు, జంతువుల వివరాలు సేకరిస్తారు... మీకు తెలిసిన ఎవర్నైనా పంపిస్తే బాగుంటుంది. నేను మీ డి.ఎఫ్.ఓ. గారితో చెప్పాను" అన్నాడు హర్ష.

"నమస్తే మేడం!" అనీ మధుమితకి విష్ చేసాడు.

"రేపే భీమన్న దొర అనీ ఒక చదువుకున్న గిరిజనుడు నా దగ్గర పనిచేస్తున్నాడు. ఈ అడవంతా వాడికి బాగా తెలుసు... వాడు మేడంకి అన్నీ చూపిస్తాడు" అన్నాడు.

"థేంక్యూ రాజూ... అది సరే... మీ డి.ఎఫ్.ఓ. గారు ఇక్కడ టేకు, గంధం, కలప స్మగ్లింగ్ జరుగుతోందని ఫిర్యాదు చేసారు. మీ అటవీశాఖ వాళ్ళని పట్టుకోలేదా?'' అని అడిగాడు.

"సార్! మా దగ్గర స్టాఫ్ చాలా తక్కువ... ఈ అడవి 1000 చకిమీ విస్తీర్ణంలో వ్యాపించి ఉంది... మధ్యలో శబరి నది... అందుకనీ వాళ్ళని పట్టుకోవడం కష్టం అవుతుంది. దానికి తోడు ఒరిస్సా సరిహద్దు ఇక్కడకు చాలా దగ్గర. ఒకవేళ వాళ్ళను వెంటాడినా ఒరిస్సాలోకి వెళ్ళిపోతారు. అందుకనీ మీ పోలీసుల సహాయం లేకుండా వాళ్ళని మేము ఏమీ చెయ్యలేము. క్రితం సారి మా డీయఫ్ఓ గారు ఇక్కడికి ఇన్‌స్పెక్షన్‌కి వచ్చినపుడు వారికీ, విషయం చెప్పాము. అందుకే వారు మీకు ఫిర్యాదు చేసినట్లున్నారు" అన్నాడు సోమరాజు.

"ఈ కలప రవాణా చేస్తున్న వాళ్ళెవరో మీకు తెలుసా?" అని అడిగాడు హర్ష.

"సార్... మేము చెబితే మాకు ప్రమాదం... ఈ అడవిలోనే ముగ్గురు కంట్రాక్టర్లున్నారు. జోగిందర్, కైలాసం, గంగారాం... వీళ్ళు మా శాఖ వేసే వేలంలో కలపని పాడుకొనీ కొంటారు. కానీ వాళ్ళు మా శాఖ కళ్ళు కప్పి మరికొన్ని చెట్లను అక్రమంగా తరలిస్తుంటారు. వాళ్ళని పట్టుకున్నా వాళ్ళకి పెద్ద పెద్ద రాజకీయ నాయకులతోనూ, మంత్రులతోను పలుకుబడి ఉండటం వల్ల కేసులేవీ ఉండవు. ఆ తరువాత వాళ్ళు మా మీద దాడులు మొదలెడతారు. ఇప్పటి దాకా నలుగురు గార్డులు హత్యకు గురయ్యారు..." అనీ బాధగా చెప్పాడు.

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే మధుమిత ఆసక్తిగా వింటోంది.

"మరి జంతువులతో ఏ సమస్యలూ లేవా?" అని అడిగాడు హర్ష.

"ఎందుకు లేవు సార్! ఒరిస్సా అటవీ ప్రాంతం నుంచి ఇంద్రావతికి నీళ్ళు తాగడానికి వందల ఏనుగులు వచ్చేసి దారి తప్పి మన గ్రామాల మీద పడతాయి. వాటిని వెనక్కి పంపడం. మాకో పెద్ద

సమస్య... దీనికి మీ శాఖ ఏం చెయ్యలేదనుకోండి... మేమే కష్టపడి వాటిని అడవిలోకి పంపించేస్తున్నాం" అన్నాడు.

"ఒకే రాజూ... చాలా మంచి విషయాలు చెప్పారు. మీరు ఎల్లుండి వస్తే మనం అడవిలోకి వెళ్ళి ఆ కంట్రాక్టర్ల వ్యవహారాలను చూద్దాం... మీరు వెళ్ళండి" అన్నాడు హర్ష.

"థాంక్యూ సార్! మీకేమైనా సహాయం కావాలంటే గెస్ట్ హౌస్‌లో వాకీ టాకీ ఉంది. దాన్లో నాతో మాట్లాడవచ్చు. మారీచు మీకు అన్నీ అమర్చి పెడతాడు. నేను వెళతాను... వెళ్తాను మేడం" అంటూ అతను వెళ్ళి పోయాడు... అతను వెళ్ళిపోయిన తరువాత ఇద్దరూ అక్కడ కూర్చొని మాట్లాడుకోసాగారు.

"అటవీ శాఖ ఉండగా మీరేం చేస్తారు?" అని అడిగింది మధుమిత.

"ఎక్కడైనా లా & ఆర్డర్ మాదే... ఎవర్నైనా పట్టుకోవాలన్నా, అరెస్ట్ చెయ్యాలన్నా మాకే అధికారం ఉంటుంది. అందుకనీ మా సహాయం తీసుకోక తప్పదు... అదీ కాక నేను ఇంకో వ్యవహారం మీద ఇక్కడికి వచ్చాను. ఆ విషయాలు తరువాత నీకు చెబుతాను. అది సరే... రేపు నీ ప్రోగ్రాం ఏమిటి?" అన్నాడు హర్ష.

"రేపు ఆ ఫారెస్ట్ భీమన్న వస్తే అడవిలోకి వెళ్ళి ఇక్కడ ఉన్న చెట్లు, జంతువుల వివరాలు తెలుసుకొనీ, అవసరం అయితే ఫోటోలు, వీడియోలు తీసుకుంటాను..."

"ఒకే... రేపు నేను కూడా నీతో వస్తాను. మొదటి రోజు కదా... నేను కూడా అడవిని చూసినట్లుంది..." అన్నాడు...

ఆ తరువాత వాళ్ళిద్దరూ ప్రకృతిని ఆస్వాదించసాగారు.

అడవంతా నిశ్శబ్దంగా ఉంది... పక్షుల కూతలు తప్పా ఇంకే శబ్దాలు వినిపించటం లేదు...

... ... ...

## 5

ప్రత్యూషపు వేళ... అడవి అప్పుడే మేల్కొంటోంది. తూరుపు ఎరుపు కిరణాలు అడవి చెట్లలోంచి ఏటవాలుగా పడుతున్నాయి.

అడవిలోంచి కోకిల కలకూజితాలు వినిపిస్తున్నాయి...

జీపు మెల్లగా సాగిపోతోంది. ముందు సీట్లో మధుమిత, వెనక మారీచూ, భీమన్న ఉన్నారు.

"ఇప్పుడు మనం ఎక్కడికెళ్ళాలి భీమన్నా?" జీపుని స్పీడుగా డ్రైవ్ చేస్తూ అడిగాడు హర్ష.

"బాబూ! ఇంకాసేపు ఎళితే సెట్ల కొండ వత్తాది. ఆ లోయలో బోలెడు సెట్లుంటాయి. అమ్మ గారకు సెట్లెక్కువున్న దగ్గరికి తీసికెళ్ళమన్నారు" అన్నాడు భీమన్న...

"మారీచూ! నువ్వెప్పుడైన అక్కడికి వెళ్ళావా?" అని అడిగింది మధుమిత.

"ఎళ్ళానమ్మా! భీమన్నే తీసికెళ్ళాడు" అన్నాడువాడు.

కొంచెంసేపటికి జీపు లోయ దగ్గరికి చేరుకుంది.

మర్రిచెట్టు కిందకు నలుగురూ అక్కడ దిగీ వెళ్ళారు.

"హర్షా! రాత్రి ఈ దండకారణ్యం మీద ఒక నోట్స్ తయారు చేసాను. చదువు" అంటూ ఒక ఫైలిచ్చింది.

"సినాప్సిస్ చెప్పు... తరువాత చదువుతాను" అన్నాడు హర్ష ఆ ఫైలుని తిరగేస్తూ...

"ఈ దండకారణ్యం కృతయుగం నుంచి ఉన్నట్లు పురాణాల ఆధారంగా తెలుస్తోంది. రామాయణంలో శ్రీరాముడు సీతా, లక్ష్మణులతో కలిసి వనవాసం కోసం ఈ దండకారణ్యంకి వచ్చినట్లు వ్రాయబడింది. ఇక్కడే శబరిని, మారీచుడిని, కబందుడుతో సహా చాలామందిని కలిసాడు. అందుకే ఇక్కడి గిరిజనులకు ఎక్కువగా శబరి, మారీచు, బందు... అన్న పేర్లుంటాయి... ఇది కాకులు దూరని కారడవి... ఇక్కడ వేల రకాల వృక్షాలు, జంతువులున్నాయి. దీన్ని 15 ఏళ్ళ కిందట పులుల అభయారణ్యం కింద ప్రకటించారు. ఇక్కడ 25 పులులున్నట్లు సర్వే చెబుతోంది. ఇక్కడ టేకు, గంధం చెట్లెక్కువ. ఈ అడవిలో మిరియం, కాఫీ చెట్లు కూడా విరివిగా ఉంటాయి. ముఖ్యంగా ఈ అడవి తూర్పుకనుమల పొడవునా ఒరిస్సా – ఆంధ్ర సరిహద్దుల్లో వ్యాపించి ఉంది... 2000 చ.కి.మీ. అటవీ ప్రాంతం. ఇందులో ఇంద్రావతి, శబరి నదులు.. అందుకే ఇక్కడ వృక్ష జంతుజాలాలు విరివిగా వృద్ధి చెందాయి. నీటికి సమస్య లేకపోవడం దీనికి ముఖ్య కారణం. ఏనుగులు అడవిలో ఎక్కువగా సంచరిస్తుంటాయి. ఈ అరణ్యం చుట్టుపక్కల ఎన్నో గిరిజన తండాలు కనిపిస్తాయి... అడవిలో వేట నిషిద్ధం... ఇక్కడ గిరిజనులు పోడు వ్యవసాయం ఎక్కువగా చేస్తుంటారు" అనీ గుక్క దిప్పుకోకుండా ఆ దండకారణ్యం గురించి చెప్పింది మధుమిత.

ఆమె వాగ్ధాటి చూసి హర్ష ఆశ్చర్యపోయాడు.

"ఓహో! అద్భుతంగా చెప్పావు... చాలా విషయ సేకరణ చేసావు... ఇంక నీ ప్రాజెక్ట్‌కి ఏ అడ్డంకి ఉండదు" అన్నాడు హర్ష...

కొద్ది సేపటికే వాళ్ళు లోయ చేరుకున్నారు...

లోయంతా ఆకుపచ్చగా కనిపిస్తోంది.

అక్కడ విరివిగా వృక్షాలు కనిపిస్తున్నాయి...

దూరంగా ఆకాశాన్ని ముద్దాడుతూ సిల్వర్ జోక్ చెట్లు...

పక్షుల కూతలు, జంతువుల అరుపులు ఎక్కడి నుంచో చెవులకు సోకుతున్నాయి...

"అమ్మా! ఇక్కడ ఎక్కవగా టేకు, దేవదారు, గంధం సెట్లుంటాయి" అంటూ వాటిని చూపించ సాగేడు భీమన్న...

మధుమతి వాటికి ఫోటోలు తీయడం మొదలు పెట్టింది.. మధ్యలో కాఫీ ప్లాంట్‌షన్స్ కనిపిస్తున్నాయి.

"ఇక్కడ కాఫీ గింజల సెట్లూ ఎక్కువేనమ్మా!" అంటూ మారీచు కాఫీ మొక్కల్ని చూపిస్తూ అన్నాడు...

కొండ వాలులో సిల్వర్ ఓక్ చెట్లు కనిపిస్తున్నాయి. పొడవుగా ఆకాశాన్ని అంటుతూ దూరం నుంచి చూస్తే వెండిలా మెరుస్తున్న ఆకులు...

"ఆ చెట్లను ఏమంటారు" అంది భీమన్నని.

"సిలవరు సెట్లంటారు..." అన్నాడు వాడు...

"సిల్వర్ ఓక్‌కి తెలుగులో సరియైన పేరు లేదు" అన్నాడు శ్రీహర్ష.

కొంచెం దూరం వెళ్ళిన తరువాత అటవీశాఖ వారి వాచ్ టవర్ కనిపించింది.

"ఇదెక్కితే అడవంతా కనిపిత్తాది" అన్నాడు భీమన్న...

మధుమతి ఉత్సాహంగా వాచ్టవర్ ఎక్కి బైనాక్యులర్స్ తీసి చుట్టూ చూడటం మొదలు పెట్టింది...

ఎదురుగా పెద్ద ఆకుపచ్చని లోయ... కనుచూపు మేరంతా హరిత వర్ణపు పరదా పరిచినట్లు లోయ చాలా అందంగా ఉంది... చిన్న చిన్న చినుకులు ప్రారంభం కావడంతో లోయ మీద సప్తవర్ణాల హరివిల్లు ప్రత్యక్షమైంది...

ఆ అద్భుత దృశ్యం రవివర్మ గీసిన ఓ చిత్రంలా కనిపించింది...

ఆ తరువాత ఓ గంటసేపు అక్కడి చెట్లు, జంతువుల వివరాలు సేకరించి గెస్ట్ హౌస్‌కు బయలుదేరారు.

## <u>6</u>

ఘాట్ రోడ్డు... ఒక లారీ స్పీడుగా వెళుతోంది. అందులో టేకు దుంగలున్నాయి... కాసేపటికి లోయలోకి ప్రవేశించింది.

సాయంత్రం వేళ కావడంతో పక్షులు గూళ్ళకు తరులుతున్నాయి... లోయలోకి చీకటి ఆవరిస్తోంది... ఘాట్ రోడ్డు కావడం, దానికి తోడు పెద్ద టేకు దుంగలు లోడు చెయ్యడం వల్ల లారీ నెమ్మదిగా వెళు తోంది... అది గాలి కొండకు వచ్చేసరికి గంటకి పైగా పట్టింది... ఆలోయ వంపు తిరుగుతుంటే ఎదురుగా కనిపించే మలుపులో ఒక జీపు వస్తూ కనిపించింది... ఇంతలో ఆ డ్రైవర్‌కి ఫోన్ వచ్చింది... ఆ లారీని పోలీసులు వెంబడిస్తున్నారనీ, త్వరగా వెళ్ళిపోవాలనీ అతన్ని ఎవరో హెచ్చరించారు. ఫోను సంభాషణ తరువాత డ్రైవర్ స్పీడు పెంచాడు. ఆ డ్రైవర్ పేరు ధర్మలింగం... ఇటువంటి స్మగ్లింగ్ కార్యకలాపాల్లో అతను అందెవేసిన చెయ్యి...

వెంటనే లారీ వేగాన్ని పెంచాడు... ఆ వేగానికి దుంగలన్నీ కదలడం మొదలైంది... ఎంత స్పీడు పెంచినా హెయిర్ పిన్ బెండ్స్ కావడం వల్ల ప్రతీ మలుపులో ఒకటో గేరుకి రావడం వల్ల వేగం ముప్పై మించటం లేదు. రాను రాను ఆ జీపు లారీకి దగ్గర కాసాగింది... కొద్ది సేపు తరువాత వెనక్కి చూస్తే ఇప్పుడు ఇంకో జీపు దాని వెనకాల వస్తోంది...

ధర్మలింగానికి అనుమానం పెద్దదైంది... మళ్ళీ ఫోనులో మాట్లాడిన తరువాత పక్కనే ఉన్న క్లీనర్ వెంకడుతో "ఒరేయ్... ఓనర్ గారు లారీని లోయలోకి తోసెయ్యమనీ సెప్పారనీ ఎంకటసామి సెప్పాడు... నేకపోతే పోలీసులకి దొరికి పోతాము. దొరికామా ఇక ఇంతే... ఆ జీపులో కొత్త డియస్పీ ఉ న్నాట్ట... ఆడికి దొరికితే ఇక మనకి జైలేనట" అన్నాడు స్టీరింగ్ గట్టిగా తిప్పుతూ...

"ఆ జీపు మనకాడకొచ్చేసరికి అరగంట పడుద్దిలే.. ఈలోగా రెండ కిలోమీటర్లు ఎళితే అక్కడ ఏనుగుల లోయలోకి తోసేద్దాం" అన్నాడు వెంకడు.

ఆ తరువాత ధర్మలింగ మాట్లాడలేదు. రెండు కిలోమీటర్లు స్పీడుగా పోనిచ్చి ఏనుగులోయ రాగానే లారీని లోయవైపు తిప్పి కిందకు గెంతేసాడు. అంతకు మునుపే వెంకడు కూడా దూకేయడంతో ఆ లారీ పెనువేగంతో లోయలోకి జారిపోవడం మొదలైంది... రాను రాను అది కిందకు జారిపోతోంది. ఆ ప్రాంతంలో ఆ లోయ లోతు కిలోమీటరుపైనే ఉంటుంది... అందుకే దాన్ని ఏనుగులోయ అంటారు...

కొద్దిదూరం జారిన తరువాత టేకు దుంగల కట్లు ఊడిపోయి అవి కిందకు దొర్లిపోవడం మొదలైంది. ఒకదాని తరువాత ఇంకొకటి లోయంతా పెద్ద శబ్దం... ఇంకో పక్క మేఘంలా ధూళి కప్పేసింది...

ఆ సమయంలో శ్రీహర్ష జీపు అక్కడికి చేరుకుంది. అతని వెనకాలే ఫారెస్ట్ గార్డు సోమరాజు జీపు కూడా చేరుకుంది. ఆరు కానిస్టేబుళ్ళు, ఫారెస్ట్ గార్డులు తుపాకులతో లోయ దగ్గరికి చేరుకున్నారు.

కానీ అప్పటికే లారీ లోయలోకి జారిపోయి కనిపించకుండా పోయింది. లోయంతా ధూళి వ్యాపించి ఏమీ కనిపించటం లేదు.

"సోమరాజు... వాళ్ళు లారీని తోసేసి పారిపోయారో, ప్రమాదం జరిగిందో తెలీదు... అయినా మనవాళ్ళు ముందుకెళ్ళి వెతికితే డ్రైవర్ దొరకవచ్చు... రేపు ఈ లారీని మనం లోయలోంచి తీస్తే ఆ లారీ ఎవరిదో ఈ టేకు కట్టెల దొంగలెవరో తెలుస్తుంది... ఆ తరువాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం" అన్నాడు. ఇక్కడ ఇద్దర్ని కాపలా ఉంచండి" అన్నాడు హర్ష.

"అలాగే సర్" అన్నాడు సోమరాజు...

## 7

ఆ మర్నాడు నలభైమంది మనుషులతో ఒక క్రేనుని తెచ్చి ఆ లోయలో పడ్డ లారీ వెలికితీతకు ఏర్పాట్లు చేసాడు శ్రీహర్ష...

కానీ ఆ లోయ చాలా లోతుగా ఉండటం వల్ల అది చాలా కిందకు వెళ్ళిపోవడంతో దాన్ని తియ్యడం సాధ్యం కాలేదు... 20 మంది కూలివాళ్ళు తాళ్ళు కట్టుకొని లోయలోకి చాలా కింద వరకు దిగినా లారీ ఆచూకీ దొరకలేదు గానీ మధ్యలో ఓ జీపు పడిపోయి ఉన్నట్లు వాళ్ళు చెప్పారు. వెంటనే క్రేన్ సహాయంతో దాన్ని వెలికి తీయించేడు. ఓ గంట కష్టం తరువాత అది బయటకు వచ్చింది.

దాని రిజిస్ట్రేషన్ నెంబరు పూర్తిగా చెరిగిపోయి కనిపించింది. చాలా రోజుల క్రితం పడిపోయి ఉండటం వల్ల పూర్తిగా పాడై పోయి తుప్పు పట్టేసి ఉంది. బాడీ మాత్రమే మిగిలి ఉంది...

ఆ జీపులో రెండు ఇత్తడి పెట్టెలు మట్టి కప్పబడి కనిపించాయి. మట్టిని తీస్తే ఆశ్చర్యంగా వాటి మీద రుద్రనేత్రం బొమ్మలు కనిపించాయి.

ఆ రుద్రనేత్రాన్ని చూడగానే శ్రీహర్షకి దాన్ని ఎక్కడో చూసినట్లు అనిపించింది. కానీ గుర్తుకు రావటం లేదు...

జీపులో వెను తిరిగి వస్తున్నప్పుడు కూడా ఆ విషయమై ఆలోచిస్తూనే ఉన్నాడు...

గెస్ట్ హౌస్‌కి వచ్చేసరికి మధుమతి అతని కోసం ఎదురు చూస్తూ కనిపించింది.

ఇద్దరూ బయట లాన్‌లో కుర్చీలు వేసుకొని కబుర్లలో పడ్డారు.

"ఈ రోజు ఏమిటి విశేషాలు" అని అడిగాడు హర్ష.

"మా ప్రొఫెసర్ గారు మాట్లాడేరు... అతనికి నేను చేస్తున్న ప్రాజెక్ట్ వివరాలు చెప్పాను... అతను

చాలా ఆనంద పడ్డాడు... ఇంకా ఎన్నాళ్ళ పని అనీ చెబితే 10 రోజులనీ చెప్పాను..." అంది మధుమతి.

"అంటే నీ ప్రాజెక్ట్ సక్సెస్ అన్నమాట... శుభాకాంక్షలు..." అన్నాడు...

ఇంతలో గెస్ట్ హౌస్‌లోకి ఒక జీపు ప్రవేశించడాన్ని శ్రీహర్ష గమనించాడు...

అందులోంచి నలుగురు కానిస్టేబుళ్ళు, వెనకన బేడీలు వేసికొన్న ఇద్దరు వ్యక్తులు దిగారు...

హెడ్ కానిస్టేబుల్ గోపాల్ వచ్చి నమస్కారం పెట్టి! "సార్! వీళ్ళిద్దరూ నిన్న లోయలో పడిపోయిన లారీ డ్రైవరు, క్లీనర్లు... వీళ్ళని విచారిస్తే ఆ లారీ కైలాసం గారిదనీ, ఈ కలప కోరాపుట్‌కి తీసికెళు తున్నట్లు చెప్పారు. వాళ్ళ దగ్గర ఏ విధమైన కాగితాలు లేవు" అనీ చెప్పాడు.

"ఒకే... ఆ కైలాసాన్ని స్టేషన్‌కి తీసుకురండి. వీళ్ళిద్దర్నీ అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపండి" అనీ చెప్పాడు... హర్ష.

"కానీ కైలాసం నెలరోజుల నుంచి ఇక్కడకు రావటం లేదనీ, అక్కడ కర్రల మిల్లు వాళ్ళు చెప్పారు... ఆ కర్రల మిల్లు కైలాసానిదే అయినా అతనప్పుడప్పుడు అక్కడికి వస్తుంటాడట... "అతనో పెద్ద స్మగ్లర్... ఇక్కడ ఉన్న ముగ్గురు ఫారెస్ట్ కంట్రాక్టర్లు కైలాసం, జోగీందర్, గంగారాం... కోట్ల విలువ చేసే టేకు, గంధం చెట్లని బయటకు తరలించేసి కోట్లు గడించారు. ప్రభుత్వ పెద్దల అండ ఉండటంతో వాళ్ళనేం చెయ్యలేము... ఈ మధ్యన ఇక్కడేదో నిధులున్నాయనీ చాలా చోట్ల తవ్వకాలు జరుపుతురానీ ఇక్కడ గిరిజనులు చెబుతున్నారు... వాళ్ళని వదలకూడదు. వాళ్ళ మీద ఓ కన్ను వెయ్యాలి" అనీ కోపంగా చెప్పాడు గోపాల్...

అతని మాటలు యథాలాపంగా వింటున్న శ్రీహర్షకి అతను చెప్పిన నిధులు అన్న మాట వినగానే ఒక్కసారిగా మెరుపు మెరిసినట్లు ఏదో గుర్తుకు వచ్చింది...

అవును... నిధి... దాని గురించి పురావస్తుశాఖ వాళ్ళు ఇచ్చిన ఫిర్యాదు విషయం గుర్తుకొచ్చింది. తరువాత ఆ సంస్థ డైరెక్టర్ శివరాం తనతో చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి... ఆ నిధి ఏమైందో ఆ చూకీ తీయమనీ అతను చెప్పిన విషయం శ్రీహర్షకి బాగా గుర్తుంది...

ఆ రోజు అతను చెప్పిన విషయాల్లో రుద్రనేత్రం అన్న పదం చాలాసార్లు దొర్లింది. ఈ రోజు లోయలో కనిపించిన జీపులో దొరికిన పెట్టెల్లో రుద్రనేత్రం బొమ్మలు కనిపించడం యాధృచ్ఛికం కాదు. ఈ రెండింటికీ ఏదో సంబంధం ఉండి ఉండాలనిపించింది హర్షకు...

అతను తీవ్రంగా ఆలోచించ సాగేడు.

వెంటనే శివరాంకి ఫోన్ చేసి ఆ ఫైలుని దివాకర్‌తో పంపించమనీ చెప్పాడు...

... ... ...

ఆరోజు ఉదయాన్నే మధుమిత భీమన్నతో కలిసి అడవిలోకి వెళ్ళింది...

శ్రీహర్ష గెస్ట్‌హౌస్ లాన్‌లో కూర్చొని ఉన్నాడు.

10 గంటల ప్రాంతంలో ఓ జీపు వచ్చి ఆగింది. అందులోంచి దివాకర్ ఇంకో వ్యక్తి దిగారు.

దివాకర్ చేతిలో ఒక పెద్ద ఫైలు, లేప్‌టాప్ ఉన్నాయి. వస్తూనే "నమస్తే సార్... నేను దివాకర్ని... ఐదు నెలల క్రితం మిమ్మల్ని మీ ఆఫీసులో కలుసుకున్నాను... గుర్తుండే ఉంటుంది" అన్నాడు.

"గుర్తుంది దివాకర్ గారూ! వెల్‌కమ్... ఈ అడవికి స్వాగతం" అన్నాడు నవ్వుతూ...

"ఇంతటి కీకారణ్యంలో ప్రయాణం చాలా బాగుంది. నేను ఇదివరకు ఆ నిధి విషయమై ఈ ప్రాంతానికి ఓసారి వచ్చాను కానీ ఇంతటి అడవిలోకి రాలేదు. ఇక్కడ ఒక్కరూ ఎలా ఉంటున్నారు" అన్నాడు...

"చాలా రోజుల తరువాత ప్రశాంతమైన ఈ అడవిలో గడపడం ఆనందంగా ఉంది... ఇన్నాళ్ళూ ప్రకృతికి దూరంగా బ్రతికాను... ఇప్పుడు ప్రకృతికి దగ్గరగా ఉండటం హాయిగా ఉంది... అప్పుడప్పుడు మనం ఇలాంటి అడవుల్లోకి వచ్చి కొన్నాళ్ళు ఉండాలి... పూర్వం మునులు, ఋషులు ఈ అడవుల్లో ప్రకృతికి దగ్గరగా ఉండటం వల్లే అంత గొప్పవాళ్ళయ్యారు..... "అన్నాడు శ్రీహర్ష... ఇంతలో మారీచు వాళ్ళిద్దరికీ టీలు తెచ్చేడు...

"సార్! మా డైరెక్టర్ మీకీ ఫైలిచ్చి ఏవైనా అనుమానాలుంటే తీర్చమన్నారు" ఆ ఫైలుని శ్రీహర్షకిస్తూ చెప్పాడు దివాకర్...

శ్రీహర్ష ఆ ఫైలుని కాసేపు పరిశీలించాడు.

"దివాకర్! ఇంతకీ ఏం జరిగిందనీ మీరనుకుంటున్నారు? ఆ నిధిని ఇంకెవరైనా తీసికెళ్ళి పోయారంటారా?"

"శివుడి గుడి కోసం తవ్విన తవ్వకాల్లో దొరికిన రాగిరేకు శాసనం ఆధారంగా నేను రెండు సంవత్సరాలు పరిశోధించి దాని ప్రకారం మూడు గుళ్ళ దగ్గర తవ్వకాలు జరపాలనీ ఆ ప్రాంతాలకు వెళితే అక్కడ మాకు ఆశ్చర్యంగా ఇదివరకే తవ్విన జాడలు కన్పించాయి... మూడవ గుడికి కొంచెం దూరంలో ఓ పెద్ద కందకం తవ్వి ఉంది. అంటే ఎవరో ఆ నిధి కోసం తవ్వకాలు జరిపినట్లు అర్థం అయింది... బహుశా ఆ నిధి వాళ్ళకి దొరికే ఉంటుంది..." అన్నాడు దివాకర్... అతని మాటల్లో నిరాశ

ధ్వనించింది...

"దివాకర్! ఈ మధ్యన ఇక్కడకు దగ్గర్లోని గాలికొండ లోయలో ఎప్పుడో ప్రమాదానికి గురైన జీపు మాకు కనిపించింది. అందులో రెండు లోహపు పెట్టెలు... దాని మీద రుద్రనేత్రం బొమ్మలు కనిపించాయి. ఈ రుద్రనేత్రాలరహస్యం ఏమిటనుకొంటున్నారు" అని అడిగాడు శ్రీహర్ష.

దాచిన గుప్త నిధులను వెతికేందుకు అప్పటి పాలకులు రుద్రనేత్రంని వాళ్ళు గుర్తుగా వాడేరు... అందుకే వాళ్ళు ఈశ్వరుడి గుళ్ళను కట్టారో లేక పాతవి అక్కడ ఉన్నాయో కానీ వాటిని ఎంచుకొని వాటి సమాచారాన్ని తెలుసుకొనేలా రాగిరేకు మీద శాసన రూపంలో బొమ్మలతో సహా లిఖించారు... అదంతా నిధి ఆచూకీ భవిష్యత్తు తరాలకి తెలియాలనే" అన్నాడు దివాకర్.

"మీరు రెండు సంవత్సరాలు కష్టపడితే కానీ దాని వివరాలు దొరకలేదు. అటువంటిది ఇవన్నీ ఆ నిధి కోసం తవ్వకాలు జరిపిన వాళ్ళకు ఎలా తెలిసింది? దీనికి మీ శాఖలోని ఉద్యోగులెవరో వాళ్ళకి సహకరించి ఉండాలి లేదా మీ ఉద్యోగులే ఈ పనికి పూనుకొనీ ఉండాలి... అటువంటి వ్యక్తులెవరైనా మీ శాఖలో ఉండేవారా? మీకెవరి మీదైనా అనుమానం ఉందా?" ఫైలుని చదువుతూ అడిగాడు హర్ష.

"నలభై ఏళ్ళ క్రితం శివుడి గుడి కోసం జరిపిన తవ్వకాల్లో 'రాగిరేకు శాసనం' దొరికింది. దాని మీద శాసనాలు తెలుగులో కాక బ్రహ్మలిపిలో వ్రాయబడి ఉండటంతో వాటిని తర్జుమా చెయ్యలేక అప్పటి మావాళ్ళు వదిలేసారు. కానీ 40 ఏళ్ళ కిందట మా శాఖలో 'గిరిధారి! అనే ఓ వ్యక్తి ఆ శాసనంలో ఉన్న భాషను తర్జుమా అంటే డీకోడ్ చేయగలిగేడనీ, కానీ అతను అర్థాంతరంగా ఉద్యోగం మానివెయ్యడంలో అది ముందుకు వెళ్ళలేదని ఫైలులోని వివరాల ద్వారా తెలిసింది. ఆ తరువాత నేను దాన్ని కొనసాగించి దాని తర్జుమా చేసి దండకారణ్యంలో ఉన్న ఆ మూడుగుళ్ళను గుర్తించడం జరిగింది. కాకపోతే మా కన్నా ఎవరో ముందుగా తెలుసుకొనీ నిధిని చేజిక్కించుకున్నట్లున్నారు..." దివాకర్ చెబుతూ దగ్గు రావడంతో ఆగాడు.

మంచినీళ్ళు తెచ్చి మారీచు ఇచ్చాడు. అది తాగిన తరువాత అతను మాములయ్యాడు.

"ఎవరి మీదైనా ఈ విషయంలో మీకు అనుమానం ఉందా?" శ్రీహర్ష తలెత్తి అడిగాడు.

"గిరిధారే ఆ నిధిని చేజిక్కున్నాడనీ నా అనుమానం... దాని మీద పరిశోధన చేసి అర్థాంతరంగా ఉద్యోగాన్ని వదలివెళ్ళిపోవడం ఇవన్నీ అనుమానాలు కలిగిస్తున్నాయి. అతన్ని ట్రేస్ చెయ్యగలిగితే ఈ చిక్కుముళ్ళన్నీ విడిపోవచ్చు. బహుశా ఆ నిధిని తవ్వి తీసికెళుతున్న సమయంలోనే ఆ జీపు ప్రమాదానికి గురై ఉంటుంది... అందులో పెట్టెల మీద రుద్రనేత్రం గుర్తులున్నాయంటే కచ్చితంగా అది నిధికి సంబంధించినవే అనీ నా నమ్మకం... నమ్మకం కాదు నిజం... మీ పోలీసులు ఆ ప్రమాదం ఎప్పుడు

జరిగిందో, ఎవరు దాని వెనకాల ఉన్నారో కనిపెడితే అన్ని వివరాలు బయటకు వచ్చి వందల కోట్ల నిధి ప్రభుత్వానికి దక్కుతుంది... ఈ దండకారణ్యంలోనే ఏదో జరిగిందనీ. నా సిక్త్‌సెన్స్ చెబుతోంది. ఎవరో అదృశ్యవ్యక్తులు ఈ గూడపుఠాణి వెనక ఉన్నారు. వాళ్ళని పట్టుకుంటే అన్ని తెలుస్తాయి. మీరు ఈ కేసుని లోతుగా పరిశోధిస్తే వాళ్ళని పట్టుకోవడం పెద్ద కష్టం కాదు" అన్నాడు దివాకర్.

"ఆ ప్రయత్నంలోనే ఉన్నాము. అందుకే నేనిక్కడ కేంపు చేసాను... వాళ్ళెంతటి వాళ్ళైనా వదిలే ప్రసక్తి లేదు... ఆ గిరిధారి ముల్లోకాల్లో ఎక్కడున్నా పట్టుకొనీ ఆ నిధి గుట్టు కనుక్కుంటాను" అన్నాడు శ్రీహర్ష...

"సంవత్సరం క్రితం నేను ఆ నిధి విషయమై ఈ అడవికి వచ్చినపుడు కొన్ని గిరిజన గ్రామాల్లోని పెద్దవాళ్ళు ఎవరో కొందరు వచ్చి అప్పట్లో తవ్వకాలు జరిపేరనీ చెప్పారు... అప్పుడే ఆ నిధిని ఎవరో కనుగొనీ పట్టుకెళ్ళిపోయి ఉంటారని అర్థం అయింది. ఏదైనా మీరు ఈ కేసు మీద ఇంట్రస్ట్ చూపడం ఓ మంచి శుభసూచకం... మంచి జరుగుతుందనీ అనుకుంటున్నాను" అన్నాడు దివాకర్...

ఓ గంట తరువాత అతను వెళ్ళిపోయాడు...

... ... ...

## <u>8</u>

అర్ధరాత్రి... చుట్టూ అంధకారం... అడవంతా చీకటి ఆక్రమించుకుంది... పక్షులన్నీ నిద్రలోకి జారేవేళ కావడంతో అడవంతా నిశ్శబ్దంగా ఉంది...

దూరంగా కొండల్లో ఎర్రటి నెగళ్ళు. కొండలను అంటిస్తే వెలిగే మంటల్ని నెగళ్ళు అంటారు. గిరిజనులు పోడు వ్యవసాయం కోసం కొండల్ని అంటించేస్తుంటారు.

ఆ నీరవ సమయంలో దూరంగా ఎక్కడి నుంచో మంద్రంగా డప్పుల చప్పుళ్ళు వినిపిస్తున్నాయి... ఆ డప్పుల శబ్దాలు అలలు అలలుగా వ్యాపిస్తూ భయంకరంగా వినిపిస్తున్నాయి. ఆ శబ్దాలకు వరండాలో నిద్రపోతున్న శ్రీహర్ష ఉలిక్కి పడిలేచాడు... ఒక్కసారిగా నిద్రాభంగం కలగటంతో ఏం జరుగుతోందో అర్థం కాలేదు...

రాను రాను డప్పుల శబ్దం ఉధృతం కాసాగింది. శ్రీహర్ష కొద్ది దూరంలో మంచం మీద పడుకొన్న భీమన్నను లేపి "ఏమిటా శబ్దం?" అని అడిగాడు.

వాడు కళ్ళు నులుముకుంటూ లేచి "దొరా! ఈడ దగ్గర్లోని తండాలో పెళ్ళి జరుగుతోంది. అక్కడి నుంచే ఆ డప్పులు" అన్నాడు.

"భీమన్నా! ఆ పెళ్ళిని ఓసారి చూద్దాం... వస్తావా?" అన్నాడు శ్రీహర్ష.

"అలాగే బాబూ!" అంటు వాడు లేచాడు.

ఐదునిముషాల్లో డ్రైవర్ జీపుని తీసుకువచ్చాడు...

ఆ తరువాత జీపు బయలుదేరింది. మధుమితకి మారీచు సాయంగా ఉన్నాడు. జీపు కొద్ది సేపటికి ఓ తండాకి చేరుకుంది... అక్కడ ఓ వ్యక్తిని లేపి అడిగితే ఇంకా 4 కిలోమీటర్లు వెళితే జొన్నగూడ వస్తుందనీ, అక్కడే పెళ్ళి జరుగుతోందని చెప్పాడు...

మళ్ళీ జీపు బయలుదేరింది...

పది నిముషాల తరువాత జీపు తండాకి చేరుకుంది. ఊరు మొదట్లోనే పెళ్ళి జరుగుతోంది... అప్పటికే పెళ్ళై పోవడంతో వాళ్లంతా విప్పసారా తాగుతూ తూలుతూ డేన్స్‌లు చేస్తూ కనిపించారు... ఎవ్వరూ స్పృహలో లేరు... మత్తులో జోగుతునారు...

ఇంకో పక్క డప్పుల హోరు... దివిటీల వెలుగులో వధూవరులతోపాటు అక్కడ చాలా మంది యువతీ యువకులు డేన్సులు చేస్తూ కనిపించారు.

పక్కనే మాంసంతో వండిన వంటకాలు... కొందరు భోజనం చేస్తున్నారు...

ఆ దివిటీల వెలుగులో వాళ్ళ వేషాలు ఆశ్చర్యంగా కనిపించాయి...

వంటిమీద అద్దాలతో నేసిన బట్టలు...

ఆడవారైతే జాకెట్టు లేకుండా తలలో పూలదండలు, మెడలో పూసలదండలు, కాళ్ళూ చేతులకు కడియాలతో విచిత్రంగా కనిపిస్తున్నారు.

"ఏమిటి జరుగుతోంది" అని అడిగాడు శ్రీహర్ష భీమన్నని –

"పెళ్ళి అయిపోయిన తరువాత అందరూ పూటుగా తాగి గెంతుతారు. అదిక్కడి గోండుల ఆసారం... ఆ తరువాత మాంసంతో వండిన భోజనాన్ని తిని యెళ్ళిపోతారు... ఆ పెళ్లిని మనం సూడ కూడదు. సూత్తే ఆళ్ళకి కోపం వత్తాది..." అన్నాడు భీమన్న...

"కోపం వస్తే ఏం చేస్తారు?"

"ఏటైనా సేస్తారు... కితంసారి ఎవురో ఫోటోలు తీసారనీ ఆళ్ళిద్దర్ని సెట్టుకి కట్టి కొట్టి సంపేసినారు... ఈళ్ళతో మా చెడ్డ పెమాదం... పదండి దొరా ఎల్లిపోదాం... ఎవురైనా సూత్తే పెమాదం..." అన్నాడు భీమన్న భయంగా...

శ్రీహర్ష దూరం నుంచే దృశ్యాలను కొద్దిసేపు చూసి జీపు ఎక్కాడు. ఆ తరువాత జీపు బయలుదేరింది...

కొద్ది దూరం వచ్చేసరికి ఎదురుగుండా ఉన్న కొండవైపు ఓ జీపు వెళ్ళడాన్ని శ్రీహర్ష గమనించాడు.

ఇంత అర్ధరాత్రప్పుడు ఈ కీకారణ్యంలో జీపు ఎవరిది అన్న సందేహం శ్రీహర్షకి కలిగి "భీమన్నా! ఆ జీపు ఎవరిదో తెలుసా? అని అడిగాడు...

"బాబూ! ఈ అడవిలో రాత్రిపూట ఎన్నో ఘోరాలు జరుగుతుంటాయి... పులుల్ని, ఏనుగులను ఏటాడ్డానికి ఏటగోళ్ళు అర్ధరాత్రీ వొత్తారు... సెట్లను కొట్టడానికి, ఆటిని లారీల్లో పట్టుకుపోడానికి అన్నిటికి రాత్రేళే... ఆళ్ళకి కనిపిత్తే సానా పెమాదం... పదండి దొరా ఎల్లిపోదాం" అన్నాడు.

"భీమన్నా! నాదగ్గర తుపాకీ ఉంది... మరేం భయం లేదు... ఆ జీపు వెనకాల వెళదాం" అనీ డ్రైవర్‌తో ఆ జీపు వెళ్లిన వైపు పొమ్మనీ చెప్పాడు... లైట్లు మాత్రం వద్దనీ చెప్పాడు...

దూరంగా వెళుతున్న జీపు యొక్క ఎర్రని లైట్లు చీకట్లో మెరుస్తూ కనిపిస్తున్నాయి...

శ్రీహర్ష జీపు కొద్ది సేపటికి కొండవాలు చేరుకుంది.

శ్రీహర్ష హై ఫ్రీక్వెన్సీ బైనాక్యులర్స్ తీసి చూసాడు. అందులో చీకట్లో కూడా అంతా స్పష్టంగా కనిపిస్తుంది... కొండ అంచున దివిటీల వెలుగు కనిపిస్తోంది.

కొద్దిసేపటికి అతనికి స్పష్టంగా అక్కడ మనుషులు కనిపించసాగారు. వాళ్ళు ఏవో తవ్వుతున్నారు... అప్పుడప్పుడు గునపాలు రాళ్ళకి తగులుతున్నపుడు వచ్చే ఠాంగ్ మన్న శబ్దాలు ఆ కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి...

శ్రీహర్షకి అక్కడే ఏం జరుగుతుందో అర్థం కాలేదు...

అంత చీకట్లో రహస్యంగా వాళ్ళు దేని కోసం తవ్వకాలు జరుపుతున్నారో అతనికి అర్థం కాలేదు. ఆ దృశ్యం చూస్తుంటే అక్కడ ఏదో జరుగుతోందనిపించింది. దండకారణ్యంలో తవ్వకాలంటే ఏదో దుర్భేద్యమైన రహస్యం ఉండే ఉంటుందన్న అనుమానం బలపడసాగింది. అప్పుడప్పుడు వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి...

దూరంగా దివిటీలు ఆకాశంలో చుక్కల్లా కనిపిస్తున్నాయి.

ఇంతలో జీప్ లైట్లు రోడ్డువైపు ఫోకస్ అవడం మొదలైంది...

కొద్దిసేపటికి ఒక వాహనం శబ్దం చేసుకుంటూ మెల్లగా రావడం కనిపించింది... డ్రైవర్ జీపుని దూరంగా చెట్ల వెనక ఆపడంతో వీళ్ళ జీపు వాళ్ళకి కనిపించే అవకాశం లేదు.

ఆ జీపు రానురాను దగ్గర కాసాగింది. ఎదురుగా వచ్చాక ఆ జీపు ఆగింది...

అందులోంచి ఒక వ్యక్తి దిగి మూత్రవిసర్జన చేసి 'ఎవరితోనో వాకీ టాకీలో మాట్లాడటం వినిపిస్తోంది." ఐదుమీటర్లు తవ్వినా ఏం కనిపించలేదు. అయినా మనం అంత లోతు తవ్వలేము. ఇక్కడ కాదనుకుంటాను. రేపు కలుస్తాను." అనీ మాటాడిన తరువాత ఆ జీపు మళ్ళీ బయలుదేరింది.

శ్రీహర్ష జీపు వెళ్ళిపోయిన తరువాత రోడ్డు మీదకు వచ్చాడు. అతని వెనకే భీమన్న...

"ఆ జీపులో ఉన్నవాడెవడో, అతనేం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు శ్రీహర్షకి... అతని మాటల్లో అక్కడ దేనికోసమో తవ్వకాలు జరుపుతున్నట్లు అర్థం అయింది హర్షకు.

"బాబూ! అతనే కైలాసం... ఈడ సెట్లను కొట్టి బయటకు తీసుకెళుతుంటాడు. కంట్రాక్టర్... ఇక్కడ ముగ్గురున్నారు కదా కంట్రాక్టర్లు... ఆళ్ళలో ఈడొకడు" అనీ చెప్పాడు భీమన్న.

భీమన్న మాటలు శ్రీహర్షకి ఆశ్చర్యం కలిగించాయి. ఈ కంట్రాక్టర్లు ఏవో తప్పుడు పనులకు పాల్పడుతున్నారేమోనన్న అనుమానం మరింత బలపడింది. అందుకే ఆ రోజు లారీ కలపని అక్రమంగా తరలిస్తూ లోయలోకి తోసేసారు. ఈరోజు దేని గురించో తవ్వకాలు... అటవీశాఖ వాళ్ళు సరిగ్గా డ్యూటీ చెయ్యటంలేదు. రేపు డీయఫ్వోని పిలిచి వాళ్ళని ఎలర్ట్ చెయ్యాలన్న ఆలోచన కొచ్చాడు హర్ష.

అర్థరాత్రిపూట జీపులు అడవిలో సంచరిస్తున్నా పట్టించుకోవడం లేదంటే వాళ్ళ ఉదాసీనత కనిపిస్తోంది... అసలు అభయారణ్యంలోకి ప్రైవేటు జీపులు ఎలా వస్తున్నాయి... ఏ వాహనం రాకూడని అడవి అది... ఏదైనా ఈ కైలాసం గురించి ఆరా తియ్యాలి... అప్పుడే రహస్యం బయటపడుతుం దనిపించింది హర్షకు. జీపు గెస్ట్‌హౌస్‌కి బయలుదేరింది.

## 9

మధుమిత పదిగంటలకు మారీచుని తీసుకొనీ అడవిలోకి బయలుదేరింది...

శ్రీహర్ష భీమన్నని తనతో ఉండమనీ చెప్పడంతో మారీచు మధుమితతో వెళ్ళాడు...

పదకొండు గంటల ప్రాంతంలో ఫారెస్ట్ రేంజర్ జీపులో వచ్చి శ్రీహర్షని కలిసాడు.

"సార్! నా పేరు బ్రహ్మానందం... మా డీయఫ్ఓ గారు మిమ్మల్ని కలవమన్నారు" అనీ చెప్పాడు...

"కూర్చోండి బ్రహ్మానందం గారూ! ఇక్కడ మీ కలప కంట్రాక్టర్లు ముగ్గురున్నారు... కైలాసం, జోగిందర్, గంగారాం... వాళ్లు ఇక్కడ స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు... మొన్ననే నేను ఒకలారీని వెంబడిస్తే దాన్ని లోయలోకి తోసేసి పారిపోయారు. మీ గార్డు కూడా దాని గురించి తెలియదన్నాడు.

వాళ్ళమీద మీరు చర్యలెందుకు తీసుకోవటం లేదు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా మీరేం పట్టించుకోవటం లేదు. మొన్న ఆ కైలాసం అర్ధరాత్రి పూట అడవిలో తిరుగుతూ ఏవో తవ్వకాలు జరుపుతూ నాకు కనిపించాడు... దీనివల్ల ప్రభుత్వానికి చాలా నష్టంతోపాటు ఇక్కడ గిరిజనులకు ఇబ్బందులు కలుగుతున్నాయి..." అన్నాడు శ్రీహర్ష.

"ఈ విషయాలు మాదృష్టికి వచ్చాయి సార్. స్టాఫ్‌ని గార్డుల్ని ఎలర్ట్ చేస్తున్నాను... దీన్ని కంట్రోల్ చేస్తాం" అన్నాడు బ్రహ్మానందం.

"ఆ కైలాసాన్ని ఓసారి పిలిపించండి. అతన్ని మీద నాకు కొన్ని అనుమానాలున్నాయి.." అన్నాడు శ్రీహర్ష...

"గార్డు శంకర్‌ని పంపించేను. మరో అరగంటలో వస్తాడు..." అన్నాడు.

ఇంతలో భీమన్న ఇద్దరికీ టీలు పట్టుకొచ్చాడు.

అరగంట తరువాత గార్డు శంకర్ వచ్చి "సార్! కైలాసం నెలరోజుల నుంచి ఇక్కడకి రాలేదనీ మిల్లు వాళ్ళు చెప్పారు" అన్నాడు.

అతని మాటలకు హర్ష ఆశ్చర్యపోయాడు.

"వాళ్ళు అబద్ధాలు చెబుతున్నట్లున్నారు. నిన్నారాత్రే అతన్ని మేము చూసాము. దీన్నిబట్టి అతను రహస్యంగా ఇక్కడ కొచ్చినట్లు తెలుస్తోంది. వాడి ఆచూకీని తెలుసుకోండి" అన్నాడు హర్ష.

"తప్పకుండా! అతనెక్కడున్నాడో కనుక్కొని రప్పిస్తాను... వాడి వ్యవహారాల మీద ఓ కన్ను వేసి ఉంచుతాము" అని చెప్పి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం మూడు గంటల దాకా ఏవో ఫైళ్ళను చూస్తూ కూర్చున్నాడు హర్ష... మధుమతి వస్తే భోజనం చేద్దాలు మనీ చూస్తున్నాడు.

ప్రతీరోజూ రెండు గంటలకే గెస్ట్‌హౌస్‌కి వచ్చేసేది మధుమిత. అటువంటిది ఆరోజు ఇంకా రాక పోవడంతో ఆలోచనలో పడ్డాడు శ్రీహర్ష...

కొద్దిసేపు ఆలోచించి అడవిలోకి జీపులో బయలుదేరాడు.

భీమన్న చెబుతుంటే ఏనుగు కొండ లోయ దగ్గరకు చేరుకున్నాడు...

వాకీటాకీ ఆన్ చేసాడు... అవసరం వస్తే మాట్లాడమనీ ఆమెకి ఓ వాకీ టాకీ ఇచ్చాడు హర్ష.

"శ్రీహర్ష హియర్... మధూ! ఎక్కడ... ప్లీజ్ రెస్పాండ్" అనీ రెండు మూడుసార్లు పిలిచాడు...

కొద్ది సేపటికి మధుమిత మాటలు వినిపించసాగేయి.

"శ్రీహర్షా! ఎవరో జీపులో నన్ను వెంబడించారు... అందులో నలుగురు మనుషులున్నారు... నేను మొన్న మనం వెళ్ళిన ఆ లోయ అంచున ఉన్నాను..." ఆ జీపులో వాళ్ళు మా మీద ఎటాక్ చెయ్యబోయారు... మారీచు కత్తి చూపించగానే వెనక్కి వెళ్ళిపోయారు... నువ్వు వెంటనేరా" అనీ చెప్పి కట్ చేసింది...

పదినిముషాల తరువాత శ్రీహర్ష ఆప్రదేశానికి చేరుకున్నాడు.

మధుమతి, మారీచు అక్కడ ఓ చెట్టు కింద కనిపించారు...

ఆమె ముఖంలో ఆందోళన కనిపిస్తోంది... శ్రీహర్ష దిగీ ఆమె దగ్గరికి వెళ్ళాడు.

"ఏం జరిగింది?" చుట్టూ చూస్తూ అడిగాడామెని.

"ఎవరో జీపులో వచ్చారు బాబూ... ఆ జీపు కైలాసం గారి మిల్లుది... మమ్మల్ని ఎంబడించారు... నాను కత్తి సూపించగానే ఎనక్కి తగ్గారు. అప్పుడే మా వూరోళ్ళు అక్కడికి ఏటకి రావడంతో ఆళ్ళు ఎల్లిపోయారు... ఆళ్ళు మా చెడ్డోళ్ళు బాబు, రేపట్నుంచీ జాగ్రత్తగా ఉండాలి" అన్నాడు మారీచు...

"అవును హర్షా! ఆ జీపు మా వెనకాల వస్తుంటే భయం వేసింది. వాళ్ళు క్రిమినల్స్‌లా ఉన్నారు. సమయానికి మారీచు బెదరించకపోతే వాళ్ళు ఏంచేసి ఉండేవాళ్ళో... అయినా ఈ రోజుతో నా ప్రాజెక్ట్ పూర్తైపోయింది. చాలావరకు వివరాలు సేకరించాను..." అంది మధుమిత.

ఆ మాటలు చెబుతున్నప్పుడు ఆమె ముఖంలో భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది...

శ్రీహర్ష ఆమెని జీపులో ఎక్కించుకొనీ గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నాడు.

మధు ఇంకా షాక్‌లో ఉండటం వల్ల రూమ్‌లోకి వెళ్ళిపోయింది...

భీమన్న టీ చేసి తెచ్చాడు.

"బాబూ! అది కైలాసం గాడి జీపు... కర్రల మిల్లు జీపని మారీచు గోడు సెప్పాడు. నిన్న మనం రాత్రి సూసేమే ఆ జీపే అది... కైలాసానికి ఆడపిచ్చి ఉంది... ఎవరైనా ఈ అడవికి కొత్తోళ్ళొత్తే ఆళ్ళని వదలి పెట్టడు... పాడుసేసి సంపేత్తాడు. కితం ఏడు మా పక్క ఊళ్లో కొత్తగా వొచ్చిన టీచరమ్మను ఇలాగే స్కూలొదిలిన తరువాత ఎత్తుకు పోయి పాడుసేసి సంపేసి సెట్టుకి ఉరేసేడు... కైలాసం గోడే ఈ పని సేసాడని అందరికీ తెలిసినా ఆడిని ఎవరూ ఏటీ సెయ్యనేకపోనారు. పోలీసులకు డబ్బిచ్చి తప్పించుకున్నాడని తెలిసింది. ఆనాకొడుకు బతక్కూడదు. ఆడు బతికుంటే మా ఆడోళ్ళకి పెమాదం" అన్నాడు భీమన్న కోపంతో ఊగిపోతూ...

"కైలాసం..." ఆ పేరు వింటేనే శ్రీహర్షకి కోపం తారాస్థాయికి చేరుకుంటోంది...

ఇంత క్రూరమైన నేరస్తుణ్ణి ఏమీ చెయ్యలేని స్థితిలో వ్యవస్తలున్నందుకు అతనికి తనమీదే కోపం వచ్చింది...

"ఏదో చెయ్యాలి... పండితే ఏపండూ చెట్టునుండదు. రాలిపోక తప్పదు... చూద్దాం వీడి పాపం ఎప్పుడు పండుతుందో"... మనసులో అనుకొని లోపలికెళ్ళాడు శ్రీహర్ష...

గదిలో మధుమతి అన్యమనస్కంగా కూర్చొని ఉంది... ఆమెకు ఆరోజు అడవిలో జరిగిన సంఘటన గుర్తుకు వస్తోంది.

"దీని గురించి నువ్వేం ఎక్కువగా ఆలోచించకు... ఇలాంటివి అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అందుకే మొదట్నుంచి నీవెంట ఈ అడవి గిరిజన యువకుల్ని పంపించేను. వాళ్ళు తమ ప్రాణాల్ని త్యాగం చేసైనా మనల్ని కాపాడుతారు... ఈరోజు నీ అదృష్టం బాగుంది... రేపు జీపులో విశాఖ వెళ్ళిపోదువు గాని... నేను అడవి దాటే దాకా నీతో పాటు వస్తాను..." అన్నాడు శ్రీహర్ష.

ఆ తరువాత ఇద్దరూ డైనింగ్ టేబుల్ మీద భోజనం చేసి లాన్‌లోకి వచ్చి కూర్చున్నారు. మారీచు వాళ్ళకి బొత్తాయి రసం తెచ్చి ఇచ్చాడు.

రాత్రి ఎనిమిది దాకా వాళ్ళిద్దరూ అక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకున్నారు... ఆ తరువాత మారీచు చపాతీ చేసి తెచ్చాడు... వేడి వేడి చపాతీలు బంగాళాదుంపల కూర... ఆ చలిలో తింటూ ఉంటే చాలా బాగున్నాయి...

రాత్రిపూట వెన్నెల కురుస్తుంటే చెట్ల మధ్య కూర్చొని అందమైన అమ్మాయితో కబుర్లు చెప్పుకుంటూ తినడం అనేది ఒక అందమైన అనుభూతి కలిగించింది శ్రీహర్షకు...

"నెలరోజుల నుంచి నువ్వు ఉన్నావు కాబట్టి నాకు సమయం తెలియలేదు. రేపట్నుంచీ నేను వంటరిగా ఇక్కడ ఉండాలి... ఇక్కడ పక్షులతోను, జంతువులతోనూ మాట్లాడుకోవాలి" అన్నాడు నవ్వుతూ...

తను రేపు ఈ అడవిని వదలి వెళ్ళిపోతున్నానన్న ఆలోచన రాగానే మధుమతికి ఒక్కసారిగా బాధ కలిగింది...

ఈ నెలరోజులూ శ్రీహర్ష సాన్నిహిత్యంలో సమయం ఇట్టే గడిచిపోయింది... ప్రతీరోజూ జంతువులతో, పక్షులతో తను గడిపిన మధురమైన క్షణాలు ఆమెకు గుర్తుకొచ్చి కంటనీరు చెమ్మగిల్లింది.

అవి మనుషులకన్నా ఎక్కువగా ప్రేమని తనమీద కురిపించాయి...

"మనిషి కూడా రెండు కాళ్ళ జంతువు" అనీ ఆమె ఎక్కడో చదివింది... అవును మానవుడు కూడా జంతువే... కాకపోతే స్వార్థపరుడు... అడవిలో జంతువులకు అది ఉండదు.

ఆమె ఆ అడవిలో ఎన్నో జంతువుల్ని చూసింది... కొత్త పక్షుల్ని గమనించింది... వాటితో ఎనలేని బంధం ఏర్పడింది'. ఇప్పుడు ఒక్కసారిగా వాటిని విడిచి వెళ్ళడం ఆమెకు బాధ కలిగిస్తోంది. అర్ధరాత్రి కావడంతో లోపలికెళ్ళిపోయింది... అలా ఆలోచిస్తూ ఆమె నిద్రలోకి జారిపోయింది. శ్రీహర్ష ఆ రాత్రి ఆకాశంకిందే పడుకున్నాడు... ఆ వెన్నెలని వదలి వెళ్ళలేకపోయాడు...

మధుమతి వెళ్లిపోతోందన్న ఆలోచనని భరించలేకపోతున్నాడు...

అలా ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు...

ఆ రాత్రి అడవిలో నిశ్శబ్దం భయంకరంగా ఉంది... అప్పుడప్పుడు క్రూరమృగాల అరుపులు అలజడిని పెంచుతన్నాయి...

దూరంగా ఎర్రటి నెగళ్ళతో కొండలు... అడవి అంటుకుంది అంటే ఇదే కాబోలనిపించింది. ఎక్కడ నుంచో డప్పుల మోతలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

రాత్రి అడవి నిద్రపోదు... రాను రాను ఆ చప్పుడు మరణమృదంగంలా వినిపిస్తోంది...

అప్పుడప్పుడూ భయంకరంగా తీతువు అరుపు...

ఈ రాత్రి ఏదో జరగబోతోంది ఈ అడవిలో అనీ అనిపిస్తోంది అతనికి...

ఆ ఆలోచన రాగానే భయం వేసింది...

క్షణాలు మెల్లగా గడుస్తున్నాయి...

అలా ఆలోచిస్తూ ఉంటే కళ్ళు మూతలు పడుతున్నాయి... నిద్ర ముంచుకు వస్తోంది...

అలా ఎంతసేపు పడుకున్నాడో తెలియదు కానీ భీమన్న వచ్చి "దొరగారూ! దొరగారూ" అంటూ గట్టిగా పిలుస్తుంటే ఒక్కసారిగా ఉలిక్కిపడీ లేచాడు...

ఎదురుగుండా భీమన్న. తూర్పు రేకలు విచ్చుకుంటున్నాయి... తెలతెలవారుతోంది... తూరుపు ఎరుపుగా మారుతోంది. సూర్యుడి ఏటవాలు కిరణాలు పుడమిని ముద్దాడుతున్నాయి...

"ఏం జరిగింది" అన్నాడు ఒక్క ఉదుటన లేస్తూ...

"బాబూ! కొండ కవతల మర్రిసెట్టు దగ్గర కైలాసం సెవం ఏలాడుతోందనీ అందరూ సెప్పుకుంటున్నారు... ఎవరో సంపేసి ఏలాడదీసారనీ మా ఊరు సహదేవుగాడు సెప్పాడు" అన్నాడు

గాబరాగా...

“కైలాసాన్ని చంపేసారు”” అన్న మాట వినీ ఒక్కసారిగా ఉలిక్కి పడి లేచాడు.

“మారీచూ! డ్రైవర్ రాజుని పిలుపు” అంటూ ఒక్క ఉదుటన లోపలికెళ్ళి ముఖం కడుక్కొనీ డ్రెస్సు మార్చుకొనీ వచ్చాడు శ్రీహర్ష.

ఇంతలో డ్రైవర్ రాజు జీపుని తీసుకువచ్చాడు. శ్రీహర్ష, భీమన్న, ఎక్కగానే అది స్పీడందుకుంది...

అరగంట తరువాత సంఘటనా స్థలానికి చేరుకున్నారు వాళ్ళు. ఎదురుగుండా ఆకాశాన్ని అంటుతూ పెద్దకొండ. దానికిందున్న రావిచెట్టుకి పెద్దతాడుతో వేలాడుతున్న కైలాసం శవం... అప్పుడే మొదటిసారిగా కైలాసాన్ని చూసాడు శ్రీహర్ష... నల్లపేంటు, ఆకుపచ్చ చొక్క ధరించి ఉన్నాడు. మనిషి పొడవుగా, తెల్లగా ఉన్నాడు... చాలాసేపటి క్రితం చనిపోవడం వల్ల నాలుక పొడవుగా బయటకు వచ్చి శవం భయంకరంగా కనిపిస్తోంది... బట్టల మీద ఎర్రటి రక్తం... ఉరితీయిడానికి ముందు బాగా గాయపరిచి నట్లున్నారు... కైలాసం ఒంటరిగా ఎందుకు వచ్చాడు. నిన్న నెలరోజుల నుంచి ఇక్కడ లేడనీ వాళ్ళ మిల్లు వాళ్ళు చెప్పారు. అటువంటివాడు ఈ రోజు అడవిలో ఎలా ప్రత్యక్షమయ్యాడు. అంటే మొన్నరాత్రి పెళ్ళి జరిగిననాడు తవ్వకాల దగ్గర జీపులో కన్పించింది కైలాసమే కాబోలు అనిపించింది శ్రీహర్షకు... వెంటనే పోలీస్టేషన్‌కి ఫోన్ చేసాడు...

అరగంట తరువాత మెల్లమెల్లగా పోలీసులు అక్కడికి చేరుకోసాగారు... ఇంతలో ఫారెస్ట్ గార్డ్ సోమరాజు, రేంజర్ గోపాల్ అందరూ ఒక్కొక్కరూ వచ్చేరు...

“పోలీసులు కైలాసం శవానికి ఫోటోలు, వీడియో తీసి శవాన్ని కిందకు దించారు... ఆ తరువాత దాన్ని స్టేషన్‌కి తరలించారు...

శ్రీహర్షకి ఏ జరిగిందో అర్థం కాలేదు. ఎవరు చంపి ఉంటారు కైలాసాన్ని? ఎందుకు చంపి ఉంటారు? ఇవే ప్రశ్నలు అతని మెదడుని తొలచి వేస్తున్నాయి... వెంటనే పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు... అక్కడ శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపిస్తున్నాడు. ఎస్సై...; ఆ సమయంలో అతని ముఖంపై రక్తంతో రుద్రనేత్రం బొమ్మని గమనించి ఆశ్చర్యపోయాడు.

యస్సై గోపాల్‌తో మాట్లాడి వచ్చేసాడు. జీపులలో వస్తున్నంత సేపూ అతని మనసులో ‘రుద్రనేత్రం’ చిత్రం వెంటాడసాగింది...

## 9

ఆ మధ్యాహ్నం “కైలాసం శవం వేలాడగట్టిన రావిచెట్టు దగ్గరికి వెళ్ళాడు శ్రీహర్ష.. ఆ చెట్టు

కింద కొన్ని పాదముద్రలు కనిపించాయి... అక్కడ గొడవ జరిగిన ఆధారాలు కనిపించాయి... కింద పొదల్లోని ఆకులు, కొమ్మలు కింద వాడిపోయి కనిపించడం, బలమైన పాదముద్రలు ఇవన్నీ సూచిస్తున్నాయి... చుట్టుపక్కల ఇంకేమైనా ఆధారాలు లభిస్తాయేమోననీ ఆ తుప్పల్లో వెతకసాగేడు.. కానీ అటువంటి వేవీ అక్కడ కనిపించలేదు...

కొద్దిసేపటి తరువాత వెనక్కి తిరిగి వచ్చేస్తున్న సమయంలో అతని దృష్టి పక్కనే ఉన్న ముళ్ళ తుప్ప మీదకి మళ్ళింది. దాని మీద వేలాడుతూ కనిపిస్తోంది ఓ గొలుసు... అతను ఆగి వెనక్కి వెళ్ళి దాన్ని తీసాడు... అది నల్లటి కాశీ తాడు. చివర్లో ఒక లాకెట్ ఉంది. దాని మీద ఓ దేవత చిత్రం ఉంది... ఈ లాకెట్ ఎవరిదై ఉంటుంది? దాన్ని చూస్తుంటే ఎక్కడో చూసినట్లు అనిపిస్తోంది... ఎక్కడో గుర్తుకు రావటం లేదు... జీపు గెస్ట్ హౌస్‌కి చేరుకుంది...

రెండు నిముషాల తరువాత మారీచు టీపట్టుకొనీ వచ్చాడు...

శ్రీహర్ష అన్యమనస్కంగా ఉన్నాడు.. ఏదో ఆలోచిస్తున్నాడు... మెదడులో ఎన్నో ఆలోచనలు...

"బాబూ! టీ చల్లారి పోతోంది" అనీ గుర్తుకు చేసాడు మారీచు...

ఆలోచిస్తూ మారీచుని చూసాడు. వాడు వంగి తుడుస్తుంటే మెడలో లాకెట్ వేలాడుతోంది... అది కూడా తుప్పల్లో దొరికిన లాకెట్ లాగానే ఉంది. అప్పుడు అతనికి ఆ లాకెట్ ఎక్కడ చూసాడో గుర్తుకొచ్చింది.

జేబులోంచి కైలాసాన్ని ఉరితీసిన ప్రదేశంలో దొరికిన లాకెట్‌ని తీసాడు.

చేతులోని లాకెట్‌ని, మారీచు మెడలో లాకెట్టుని మార్చి మార్చి చూడసాగేడు. సందేహం లేదు... రెండూ ఒకటే...

ఇంతలో మారీచు శ్రీహర్ష చేతిలో ఉన్న లాకెట్టుని చూసి "నా మెడలో ఇలాంటిదే ఉంది బాబూ" అంటూ తన లాకెట్‌ని చూపించాడు. శ్రీహర్ష దాన్ని చూస్తున్నాడు.

"ఎక్కడ దొరికింది బాబూ" అని అడిగాడు.

"మారీచూ! ఆ లాకెట్టు ఎవరిచ్చారు నీకు" అన్నాడు.

"ఇది నా సిన్నప్పట్నుంచీ ఉంది బాబూ" మా అయ్య సంతలో కొన్నాడు" అన్నాడు...

"ఇలాంటివి సంతలో దొరుకుతాయా?" అనీ అడిగాడు.

"దొరుకుతాయి బాబూ... ఈ లాకెట్టు మీద మా అడవిదేవత పోలమ్మ ఫోటో ఉంటాది... ఇలాంటివి బోలెడు దొరుకుతాయి. మావోళ్ళందరూ ఏసుకుంటారు" అన్నాడు మారీచు.

కైలాసాన్ని చంపినవాడు ఈ ప్రాంతం గిరిజనుడేనా? అయినా కైలాసాన్ని చంపవలసిన అవసరం ఎవరికుంది? జీపులో పెట్టెల మీదా, కైలాసం శరీరం మీద ఆ రుద్రనేత్రం బొమ్మలను ఎందుకు ఎవరు వేసారు? ఈ నిధికి కైలాసం హత్యకూ సంబంధం ఉందా? రుద్రనేత్రానికి నిధికి ఏమైనా సంబంధం ఉందా? ఈ నిధి వెనక ఎవరున్నారు?" ఆలోచనలతో శ్రీహర్ష మస్తిష్కం వేడెక్కి పోసాగింది.

ఆ సమయంలో అతనికి గిరిధారి గుర్తుకు వచ్చాడు... వెంటనే విశాఖలోని సిఐడీ బ్రాంచ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్‌కి ఫోను చేసాడు...

"నమస్తే చెప్పండి సార్!" అన్నాడు యుగంధర్.

శ్రీహర్ష నిధి విషయమై వివరాలన్ని చెప్పి "మీరొకసారి గిరిధారిని ట్రేస్ చెయ్యాలి... పేరు అతి తక్కువ మందికి ఉండే ఛాన్సుంది కాబట్టి వోటర్ లిస్టులు చెక్ చేస్తే దొరికే ఛాన్సుంది... అతను దొరికితే వివరాలు సేకరించండి... అతని మీద నిఘా పెట్టండి... అవసరం అయితే నాతో మాట్లాడండి" అంటూ ఫోన్ పెట్టేసాడు.

మధ్యాహ్నం లంచ్ టైములో గోపాల్ వచ్చాడు.

మారీచు ఇద్దరికీ భోజనాలు వడ్డించాడు.

"గోపాల్! ఏమిటి విషయాలు? కేసులో ఏమైనా పురోభివృద్ధి వుందా?" అని అడిగాడు.

నిన్న కైలాసం శవాన్ని పోస్ట్ మార్టెమ్‌కి పంపాను. రిపోర్ట్ ఈ రోజు వచ్చింది. వీపు వెనక భాగంలో గుండె దగ్గర బలంగా కత్తితో పొడవటం వల్ల చనిపోయాడనీ డాక్టరు అభిప్రాయపడ్డాడు... కొన ప్రాణం ఉన్నప్పుడు తాడుతో ఉరి వెయ్యడం వల్ల చనిపోయాడనీ ముగింపులో వ్రాసారు. అది మనం అనుకున్నదే... శవం మీద వేలిముద్రలు కనిపించలేదు అంటే హంతకుడు తెలివైన క్రిమినల్లా ఉన్నాడు..." అన్నాడు.

"ఇంతకీ హత్య వెనక ఎవరున్నారో ఏవైనా ఆధారాలు దొరికాయా?" శ్రీహర్ష అసహనంతో అడిగాడు.

"నా ఊహ ప్రకారం ఇక్కడ ముగ్గురు కలప కంట్రాక్టర్లున్నారు... గంగారాం, జోగిందర్, కైలాసం... వీళ్ళ ముగ్గురికీ పోటీ... ఒకరంటే ఒకరికి పడదు... ఈ మధ్యనే కైలాసం లారీని మనం పట్టుకొని కేసు పెట్టేము... మిల్లుని మూసి వేయించాము. దీంతో అతనికి మిగతా ఇద్దరి మీద అనుమానం వచ్చి ఉంటుంది... వాళ్ళ ముగ్గురి మధ్యలో ఏదో జరిగింది... దాని వల్లే కైలాసం హత్యకు గురై ఉంటాడు" అన్నాడు గోపాల్ మంచినీళ్ళు తాగుతూ...

"అంటే కైలాసం హత్యలో గంగారాం, జోగిందర్‌ల హస్తం ఉందంటావా?"

"కచ్చితంగా వాళ్ళ హస్తం ఉండే ఉంటుంది. లేకపోతే ఈ అడవిలో అతన్ని చంపడానికి ఎవరొస్తారు? అంత అవసరం ఎవరి కుంటుంది?" అన్నాడు గోపాల్...

"మరి అతని ముఖం మీద 'రుద్రనేత్రం' రక్తంతో గీసిన బొమ్మ ఉంది... ఎందుకు దాన్ని గీసారు..? ఇది వరకు మనకు దొరికిన జీపులోని పెట్టల మీద కూడా ఈ గుర్తు ఉంది. అంటే నిధికి ఈ హత్యకు సంబంధం ఉందా? ఇంతకీ ఆ నిధి ఈ అడవిలోనే ఉందా? లేకపోతే ఎక్కడో దాచి ఉంచారంటావా?" శ్రీహర్ష గోపాల్ని ప్రశ్నలతో ముంచెత్తాడు.

"ఆ నిధి ఈ అడవి దాటిపోతే ఈ ముగ్గురూ అడవికి రారు... దాన్ని ఈ అడవిలోనే ఎక్కడో దాచారు. దాని కోసమే వెతుకుతున్నారు... అందుకే బహుశా ఈ గొడవలు..." ఒకవేళ ఇతని హత్యలో వాళ్ళిద్దరి హస్తం లేకపోతే ఎవరో ఇంకొకరి హస్తం ఉండి ఉంటే ఇద్దరి ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. వాళ్ళు కూడా హత్య కాబడే అవకాశం ఉంది... ఈ అడవిలో ఏదో జరుగుతోంది" అన్నాడు గోపాల్ సాలోచనగా...

"అలాంటప్పుడు జోగిందర్, గంగారాంల మీద ఓ కన్ను వేసి ఉంచడం మంచిది. మనవాళ్ళెవరికైనా ఆ పని అప్పగించండి. మనం ఏ చిన్న అనుమానాన్ని వదలకూడదు. ఏ పుట్టలో ఏ పాముందో?" అన్నాడు శ్రీహర్ష.

"తప్పకుండా నేను మా కానిస్టేబుల్ వీర్రాజుకి ఆ పని అప్పగిస్తాను... వాడు ఇటువంటి విషయాల్లో ఆరితేరినవాడు" అంటూ లేచాడు...

ఓకే గోపాల్... ఏవిషయమైనా తెలిస్తే నాకు చెప్పండి... డోంట్ లీవ్ ఎనీ స్మాల్ క్లూ" అన్నాడు శ్రీహర్ష... కొద్దిసేపు కూర్చొని వెళ్ళిపోయాడు గోపాల్.

సాయంత్రం మారీచు తన ఊరికి వెళ్ళడంతో భీమన్న టీ తెచ్చిచ్చాడు...

బయట వరండాలో హాయిగా ఉంది. చల్లటి గాలి వీస్తోంది... గెస్ట్ హౌస్ ఆవరణలో రెండు కుందేళ్ళు ఆడుకుంటూ కనిపించిన దృశ్యం వీనుల విందుగా ఉంది...

భీమన్న వెళ్ళిపోతూ "బాబూ? మొన్న అమ్మగారితో అడవిలోకి ఎల్లినపుడు రెండు శివుడి గుళ్ళు కొండ మీద కనిపించాయి. ఆ రెండు గుళ్ళ మీద మనం ఆరోజు పెట్టెల మీద సూసిన శివుడి కన్ను ఎర్రగా ఏసి ఉంది..." అన్నాడు.

"ఎక్కడ ఉన్నాయి ఆ గుళ్ళు? ఇక్కడికెంత దూరం ఉంటాయి?" అని అడిగాడు శ్రీహర్ష.

"ఐదు కోసులుంటాది బాబు... జీపులో ఎల్లొచ్చు"

“రేపుదయాన్నే అక్కడికెళ్దాం...” అన్నాడు హర్ష..

## 10

ఉదయాన్నే యుగంధర్ నుంచి ఫోను వచ్చింది...

“సార్.. మీరు చెప్పినట్లు ఓటర్ల లిస్టు, టెలిఫోన్ డైరక్టరీ ద్వారా గిరిధారిని కనుగొన్నాను. అతనికిప్పుడు 80 ఏళ్ళు... బాగా వృద్ధుడు. అతన్ని ఈ నిధి విషయమై అడిగితే “అప్పట్లో తను పురావస్తు శాఖలో పనిచేసిన మాట నిజమే కానీ ప్రభుత్వం అంగీకరించకపోవడంతో తాను ఆ పరిశోధనలాపేసాననీ, ఆ తరువాత ఉద్యోగం మానేసి అమెరికా వెళ్ళిపోయి రెండేళ్ళ క్రితమే వచ్చాననీ తానెప్పుడూ దండకారణ్యంలోకి వెళ్ళలేదనీ రుద్రనేత్రం ఏమిటో తనకు తెలియదనీ చెప్పాడు.” అన్నాడు యుంగధర్.

“అతను చెబుతున్నది నిజమేననీ గేరంటీ ఏమిటి?” శ్రీహర్ష ప్రశ్నించాడు.

“నేను అతన్ని స్టడీ చేసాను సార్. అతని పిల్లలందరూ అమెరికాలో ఉన్నారు. అతని గురించి చుట్టుపక్కలా చాలామందిని అడిగితే వాళ్ళంతా అతను మంచివాడనీ ఒకరి ఊసు అక్కర్లేదనీ, ఈ మధ్యనే వచ్చాడనీ చెబుతున్నారు” అనీ చెప్పాడు.

“ఓకే... యుగంధర్... అవసరం అయితే మిమ్మల్ని పిలుస్తాను” అనీ చెప్పి ఫోన్ కట్ చేసాడు...

... ... ...

ఉదయం పది గంటలైంది... జీపు ఘాట్ రోడ్డులో వెళుతోంది. కొంచెం దూరం వెళ్ళిన తరువాత రోడ్డు ఇరుకుగా మారడంతో జీపుని అక్కడే ఆపి నడుచుకుంటూ బయలుదేరారు శ్రీహర్ష, గోపాల్, భీమన్న.

“భీమన్నా! నిన్న కైలాసాన్ని వేలడదీసిన చెట్టు దగ్గర ఒకలాకెట్టు దొరికింది... అది మారీచు మెడలోని లాకెట్టు లాగే ఉంది... ఇక్కడ ఇలాంటివి వేసుకుంటారా?” అని కొండవాలులో నడుస్తూ అడిగేడు.

“నాసిన్నప్పుడు ఏసుకునే వోళ్ళు. ఇప్పుడెవ్వరు ఎయ్యటం లేదు దొరా...” అన్నాడు...

“మారీచు ఆరోజు ఎక్కడున్నాడు?”

ఆడు గెస్ట్‌హౌస్ దాటి ఏడకీ వెళ్ళడు? ఆడు అమాయకుడు బాబూ! పదిరోజుల కితం అనుకుంటాను ఆళ్ళూరు ఎల్లాడు” అన్నాడు భీమన్న...

కొద్ది దూరం వెళ్ళగానే కొండవాలు ఎక్కువైంది... అక్కడ నుంచి కర్రసాయంతో కొండ ఎక్కారు.

కొండ మీదకు ఎక్కడానికి చాలాసేపు పట్టింది. మధ్య మధ్యలో ఆగుతూ ఆయాసం తీరాక నడుస్తూ కొండపైకి చేరుకొనేసరికి మధ్యాహ్నం ఒంటి గంటైంది. అక్కడ నుంచి చూస్తే శివాలయం కనిపిస్తోంది... దగ్గరికి వెళ్ళి చూస్తే అది పాడుబడిపోయి శిథిలమై కనిపించింది... అదొక చిన్న గుడి... గోడలన్నీ కూలిపోయి ఉన్నాయి... లోపల శివలింగం లేదు... దాని బయట 'రుద్రనేత్రం' ఎర్రటి రంగుతో వేసి ఉంది; దాన్ని భీమన్న శ్రీహర్షకి చూపిస్తూ

"దీని గురించే బాబూ మీకు నేను సెప్పింది..." అన్నాడు భీమన్న...

"గోపాల్! గమనించావా? ఆ రోజు పెట్టెల మీద నిన్న కైలాసం ముఖం మీద, ఇప్పుడిక్కడ... అన్ని చోట్లా ఒకేలా రుద్రనేత్రం బొమ్మలు... దీన్లో ఏదో రహస్యం ఉండే ఉంటుంది... ఏమంటావు" అన్నాడు.

"మీరు చెప్పింది నూరుపాళ్ళూ నిజం... ఈ అడవిలో ఏదో జరుగుతోంది... దాన్ని మనం కనిపెట్టాలి. ఇంకో వారం పదిరోజుల్లో కొన్ని విషయాలు" బయటకు రావచ్చు" అన్నాడు గోపాల్.

"అది తెలియాలంటే మనకి ఏదో ఆధారం దొరకాలి... ఈలోగా ఇంకెన్ని హత్యలు జరుగుతాయో? కైలాసం ఆరోజు ఆ తవ్వకాల ప్రదేశంలో కనిపించడం, తరువాత హత్యకి గురవడం... దానివల్ల ఈ హత్యకు ఆ తవ్వకాలకూ, ఈ రుద్రనేత్రంకు ఏదో సంబంధం ఉందనీ అనిపిస్తోంది... కానీ ఏమిటా లింక్..." ఇది తెలుసుకోవాలి. అప్పుడే ఆ రహస్యం తెలుస్తుంది" అన్నాడు శ్రీహర్ష...

"మా వాడు జోగేందర్, గంగారాం మీద కన్నేసి ఉంచాడు... వాళ్ళ రహస్యం వెలికితీసే పనిలో ఉన్నాడు... అప్పుడు రహస్యం ముడి విడుతుంది. పదండి... మూడు అవుతోంది. కిందకు వెళ్ళేసరికి చీకటి పడిపోవచ్చు" అంటూ వెనుదిరిగాడు గోపాల్.

"ఏదో ఒకటి చెయ్యాలి... లేకపోతే మనం ఇక్కడికొచ్చిన పర్పస్ ఫ్రూట్‌ఫుల్ అవదు..." అన్నాడు శ్రీహర్ష...

ముగ్గురూ కలిసి కిందకు దిగడం మొదలు పెట్టారు.

గంట తరువాత జీపు దగ్గరికి చేరుకున్నారు.

... ... ...

## 11

రాత్రి పదిగంటలైంది... జోగేందర్ కర్రల మిల్లు... ఆ ఆవరణంలోనే జోగేందర్ గెస్ట్ హౌస్

అతను విశాఖపట్నం నుంచి అప్పుడప్పుడు వస్తుంటాడు... ఈ మధ్యన పదిహేను రోజుల నుంచి అతను అక్కడే ఉన్నాడు...

ఆ సమయంలో ఒక జీపు మిల్లు ఆవరణలోకి ప్రవేశించింది...

అది తిన్నగా వెళ్ళి గెస్ట్‌హౌస్ ముందర ఆగింది. దూరంగా మిల్లు శబ్దం తప్పా అడవంతా నిశ్శబ్దంగా ఉంది.

ఆ జీపులోంచి గంగారాం దిగాడు... అతనే స్వయంగా జీపుని నడుపుకుంటూ వచ్చాడు.

గబగబా నడుచుకుంటూ లోనికి వెళ్ళాడు. అప్పటికే జోగీందర్ మందు బాటిళ్ళు ముందు వేసుకొని సేవించడం మొదలు పెట్టాడు. మత్తు మొదలైంది... ఆ సమయంలో వచ్చిన గంగారాంని చూడగానే ఒక్కసారి మత్తు వదిలింది...

"ఏం గంగారాం ఫోన్ చెయ్యకుండా వచ్చావేం?" అన్నాడు అతని మాటలు ముద్దగా వస్తున్నాయి...

"ఏం! రాకూడని సమయంలో వచ్చేనా? లేక నీకు చెప్పకుండా రాకూడదా?" అన్నాడు గంగారాం వెటకారంగా.

"అదేం లేదు... చెప్పి వస్తే నీకన్ని ఏర్పాట్లు చేసేవాడిని."

"ఎప్పుడిక్కడికి వచ్చినా నన్ను పిలిచేవాడివి. ఈసారి వంటరిగా ఎందుకొచ్చావ్? మన మిత్రుడు పార్ట్‌నర్ కైలాసం చనిపోయినా నా కెందుకు చెప్పలేదు... ఎప్పుడు లేనిదీ పదిహేనురోజుల నుంచి ఇక్కడెందుకు కేంపు వేసావు. దీన్ని బట్టి నీ రాక వెనక ఏవో దురుద్దేశాలు ఉండే ఉంటాయి. అందుకే వచ్చాను..." అన్నాడు గంగారాం... కైలాసం చనిపోయాడన్న వార్త అతనికి నిద్రలేకుండా చేస్తోంది.

"గంగా! నీకు నోటి దురుసు తనం ఎక్కువ... ఇక్కడ మిల్లులో సమస్యలెక్కువయ్యాయి. అయినా కైలాసం మనం దాచిన బంగారాన్ని కనుక్కోలేకపోయాడు... ఆ రోజు తవ్వకాల్లో దొరికిన బంగారాన్ని ఎలాగైనా తీసికెళ్ళిపోదామంటే మీరే వద్దన్నారు... ఇప్పుడు దాన్ని ఎక్కడ దాచేమో తెలియటం లేదు. మనం దాచిన దగ్గర అది లేదు. ఇవన్నీ చూస్తుంటే ఇందులో ఏదో మర్మం ఉన్నట్లు కనిపిస్తోంది" జోగీందర్ కోపంగా అన్నాడు.

"ఏమిటి మర్మం జోగిందర్! జీపుని నేను డ్రైవ్ చేస్తానంటే వద్దనీ నువ్వు చేసావు... ఘాట్ రోడ్డులో అంత వేగంతో వెళ్ళొద్దనీ అంటే వినకుండా జోరుగా పోనిచ్చి ప్రమాదానికి గురి చేసావు. లోయలో పడ్డ జీపు లోంచి అదృష్టవశాత్తూ ముగ్గురం బయట పడ్డాము. పోనీ ఆ బంగారాన్ని ఎలాగైనా రోడ్డుకి తెచ్చి మనతోపాటే విశాఖపట్నం పట్టుకెళ్ళి పోదామంటే వద్దనక దాన్ని ఇంకో దగ్గర పాతిపెట్టించావు.

ఇప్పుడు చూడు మనం ఎక్కడ దాచామో అక్కడ లేదనీ కైలాసం చెప్పాడు... ఆ రోజు మనం ఎక్కడ దాచిందీ ఆ ప్రాంతాన్ని పోల్చుకోవడానికి ఒక మేపు కూడా తయారు చేసాము... మరి ఆ జాగాలో వందల కోట్లు విలువ చేసే ఆ బంగారం ఏమైంది. అది దాచిన ప్రదేశం నీకు, నాకు, కైలాసానికే తెలుసు... అటువంటిది ఆ బంగారం ఏమైంది... కైలాసం ఆ బంగారం అక్కడ లేదు అనీ నాకు ఫోన్ చేసి చెప్పినపుడు నాకు మతిపోయింది. ఎంతో కష్టపడి ఆ నిధిని తవ్వేము. ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ అధికారులకు దొరకని నిధిని మనం చేజిక్కించుకున్నాము... అలాంటిది మనకు కాకుండా పోతుంటే బాధ వెయ్యదా? కైలాసం ముఖం మీద రుద్రనేత్రం వేసి ఉంది. అంటే కచ్చితంగా అతని చావుకి ఆ దొరికిన నిధికీ సంబంధం ఉండే ఉంటుంది... దాన్ని తవ్వి తీసింది మనం ముగ్గురమే... అతన్ని చంపాలంటే నువ్వో, నేనో తప్ప ఇంకెవరికీ అవకాశం లేదు" అన్నాడు గంగారాం లేచి నిలబడుతూ...

"గంగారాం... నీ మాటలు హద్దులు మీరుతున్నాయి. అంటే నన్నే అనుమానిస్తున్నావా? ఏం నువ్వెందుకు కాకూడదు... అసలు అక్కడ నిధి ఉందనీ నేనే ముందుగా మీ ఇద్దరికీ చెప్పిన సంగతి మరిచిపోయావా? ఆ నిధి కోసం ఆ దివాకర్ గాడిని ఎంతో ప్రలోభపెడితే గానీ ఆ రహస్యం వాడు చెప్పలేదు... ఆ తరువాత ఆ మేపుల్ని డీకోడ్ చెయ్యడానికి ఎంత ఖర్చు పెట్టామో నీకు తెలియదా? దివాకరానికి నా చేత్తో పదికోట్లిచ్చాను... మీ ఇద్దరూ నా చిన్ననాటి స్నేహితులని మిమ్మల్ని ఇందులో భాగం చేసాను. ఆ రోజు నేను డ్రైవింగ్ ఎందుకు చేసానంటే నాకందరు ఫారెస్ట్ వాళ్ళూ తెలుసు. నేనైతే ఎవ్వరూ అనుమానించరనీ ఆ పనిచేసాను... ఆ రోజు మన జీపు ప్రమాదానికి గురైనపుడు పెద్ద శబ్దం రావడంతో అదెవరికైనా తెలిసే ప్రమాదం ఉందనీ, ఆ బంగారాన్ని ఆ రోజు బయటకు తెస్తే పోలీసులకు పట్టుబడే ప్రమాదం ఉందనే ఆ రాత్రి ఈ అడవిలో దాచి పెట్టవలసి వచ్చింది... ఒక వేళ ఎవరైనా దాన్ని పట్టుకుంటే కష్టపడి చేజిక్కుంచుకున్న నిధి పోలీసులకి చేజిక్కే ప్రమాదం ఉండేది... ఆ బంగారం దాచింది మన ముగ్గురమే... ఇప్పుడది అక్కడ లేదంటే అర్థం ఏమిటి? ఈ విషయంలో మీ ఇద్దర్నీ ఎందుకు అనుమానించకూడదు? ఆ రోజు తరువాతనే నినక్కడకు రాలేదు. కైలాసం ఆ బంగారం దొరక లేదంటే నాకనుమానం వచ్చి ఇక్కడికి రావలసి వచ్చింది... నేను వచ్చిన తరువాత కైలాసం నన్ను కలవలేదు. అతని హత్యకు నాకు ఎటువంటి సంబంధం లేదు... ఇప్పుడు ఆ బంగారం గురించి ఆలోచించు... ఒకవేళ కైలాసాన్ని ఈ విషయంలో ఎందుకు అనుమానించకూడదు చెప్పు?" అన్నాడు జోగీందర్. గ్లాసులో ద్రవాన్ని తాగుతూ...

"చనిపోయిన వాడిని అనుమానిస్తే ఉపయోగం ఏమిటి చెప్పు? వాడి హత్యకు గురయ్యాడంటే మనకూ ప్రమాదం ఉన్నట్లే? ఎవరో ఆ బంగారాన్ని కొట్టేసి మన మీద పగబట్టారేమో... ఇప్పుడు కైలాసం హత్యకు గురయ్యాడు. కాబట్టి మనం కూడా జాగ్రత్తలో ఉండాలి... ఏదో జరుగుతోందన్న

అనుమానం నాకు కలుగుతోంది...” అన్నాడు గంగారాం గాబరాగా...

“గంగా! ఇప్పుడు ఉన్నది మనిద్దరమే... మనం ఒకరిమీద ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అనుమానాలు పెంచుకుంటే ఒరిగేదేమి ఉండదు... అయినా కైలాసాన్ని చంపే అవసరం నాకేంటి చెప్పు... ఆ మొత్తం బంగారం నేనే కొట్టేయాలంటే మీ ఇద్దరికీ ఎందుకు చెబుతాను చెప్పు? కాబట్టి ఇప్పుడు ఏం జరగబోతుందో ఆలోచించు... నాకు తెలిసి ప్రభుత్వం మన మీద ఓ కన్ను వేసి ఉంది. ఈ ఆపరేషన్ కోసం ఒక ఆఫీసర్ని కూడా రహస్యంగా నియమించిందట... అత నెవ్వరో ఎవ్వరికీ తెలియటం లేదు... వాడేమైనా చాపకింద నీరులా మనకి తెలీకుండా మన గుట్టు తెలుసుకుంటున్నాడా అన్న అనుమానం కలుగుతోంది. అందుకే ఇక్కడికి వచ్చి అన్ని కూపీలు లాగుతున్నాను... శ్రీహర్ష అన్న పోలీసు ఆఫీసర్ నెలరోజుల నుంచి ఈ అడవిలోనే తిష్టవేసి అన్ని వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది... కాబట్టి మనం జాగ్రత్తగా ఉండాలి... ఒకవేళ దీని వెనకాల దివాకర్ హస్తం ఎందుకుండకూడదు? వాడికి బంగారం దొరికితే 20 కోట్లు ఇస్తామని చెప్పి పదికోట్లు ఎడ్వాన్స్ మాత్రమే ఇచ్చాము. ఆ కోపంతో వాడే పోలీసులకు చెప్పి ఉండొచ్చు లేకపోతే ఇంకెవరితోనైనా చేతులు కలిపి ఆ బంగారం చేజిక్కించుకున్నాడేమో? ఏదైనా జరిగి ఉండచ్చు... నువ్వు చెప్పినట్లు మనం ఇక మీదట జాగ్రత్తగా ఉండాలి... ఎవరో మనల్ని నీడలా వెంటాడుతున్నారనిపిస్తోంది. కాబట్టి నువ్వు అనవసర అనుమానాలేవీ పెట్టుకోకుండా జరగబోయేదాన్ని గురించి ఆలోచించు... నన్ను కలవడానికి వస్తే మనకే ప్రమాదం” అన్నాడు జోగిందర్.

“నాకూ అలాగే అనిపిస్తోంది... మన వెనక ఏదో జరుగుతోంది... ఇంక ఇక్కడికి రాను... నువ్వు కూడా ఆ బంగారం ఎక్కడ దాచామో గుర్తు చేసుకో... అసలు మేపు నీ దగ్గరే ఉంది కదా... నీ చేతుల్తో నువ్వే దాన్ని గీసావు... అందులో అన్ని గుర్తులు, దార్లు వ్రాసావు కదా? ఇప్పుడేమైందో ఆలోచించు... వెళ్ళే ముందు ఓ చిన్న మాట. మాకు అన్యాయం చెయ్యాలనీ చూడకు... అది నీమెడకే చుట్టుకుంటుంది... మోసం తాత్కాలికంగా గెల్చినా చివరకు ముంచేస్తుందన్న విషయం మరిచిపోకు వస్తాను” అన్నాడు గంగారాం బయటకు నడుస్తూ.

... ... ...

ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లోని హాలు...

ఒక్కసారిగా టీవీ స్క్రీన్ ఆగిపోయింది. హాల్లో లైట్లు వెలిగాయి... అక్కడ శ్రీహర్ష గోపాల్ ఉ న్నారు...

“ఈ వీడియో చూసిన తరువాత మీకు స్పష్టత వచ్చి ఉంటుంది... ఈ వీడియోను రహస్యంగా పెన్ కెమేరాని జోగిందర్ గెస్ట్‌హౌస్‌లో అమర్చి జోగిందర్, గంగారాంల సంభాషణని రికార్డ్ చేయించాను...

మొన్న మా కానిస్టేబుల్‌ని ఈ పనికోసం పురమాయించాను అనీ మీకు చెప్పాను గుర్తుండే ఉంటుంది... అతను ఆ మిల్లులోని డ్రైవర్‌ని పట్టుకొని వాడి ద్వారా గెస్ట్‌హౌస్ తలుపులు తీయించి ఆ కెమేరాలు పెట్టించి రికార్డ్ చేయించాడు... దీనివల్ల జోగీందర్, గంగారాం, కైలాసాలకు ఉండే సంబంధం, ఆ నిధి గురించిన సమాచారం అంతా తెలిసింది. ఈ వీడియోని బట్టి ఆ నిధి ఆ ముగ్గురూ దండకారణ్యంలోంచి తెచ్చి ఈ అడవిలో ఎక్కడో దాచినట్లు తెలుస్తోంది." అన్నాడు గోపాల్ శ్రీహర్షతో...

శ్రీహర్ష చాలాసేపు మౌనం దాల్చేడు...

"ఈ వీడియోతో చాలా వరకు క్లారిటీ వచ్చింది. కానీ అసలు విషయాలు ఆ నిధి ఎక్కడుంది. కైలాసాన్ని ఎవరు ఎందుకు చంపారు? లేక ఎవరైనా పట్టుకెళ్ళి పోయారా? ఆ విషయాలు తెలియాలి" అన్నాడు హర్ష.

"అవును... కానీ గంగారాం, జోగీందర్‌ల మాటలు వింటుంటే ఆ నిధి ఎక్కడ దాచారో వాళ్ళు కనుక్కోలేకపోయారని తెలుస్తోంది. లేకపోతే వీళ్ళలో ఎవరైనా దాన్ని కొట్టేసి మిగతా ఇద్దర్నీ చంపేద్దామనీ అనుకొనీ ఉండవచ్చు. కైలాసం హత్య చూస్తే అలా కూడా అర్థం చేసుకోవచ్చు" అన్నాడు సాలోచనగా గోపాల్...

"గోపాల్! ఓ విషయం నాకాశ్చర్యం వేస్తోంది. మనం ఎప్పుడూ ఊహించని దివాకర్ పేరు ఈ కేసులో వినిపించడం గొప్ప ట్విస్ట్. నేను గిరిధారిని అనుమానించాను కానీ దివాకర్‌ని అనుమానించలేదు. ఇందులో అతని పాత్ర ఎంతో తెలుసుకోవాలి... ఇదో కొత్త కోణం. డబ్బెంత పనైనా చేయిస్తుందనడానికి దివాకర్ ఉదాహరణ... అతన్ని మనం ఈ వలలోకి లాగాలి... ఇన్నాళ్లూ అతను ఔట్ ఆఫ్ ది నెస్ట్. ఇప్పుడు కాదు... ఈ చక్రవ్యూహంలో ఇంకెంతమంది ఉన్నారో" శ్రీహర్ష ఆలోచిస్తూ చెప్పాడు...

ఆ తరువాత గోపాల్ వెళ్ళిపోయాడు...

## 12

అర్థరాత్రి... చీకట్లో ఒక జీపు వెళ్తోంది... ఆ రాత్రిపూట దాని శబ్దం తప్పా అడవంతా నిశ్శబ్దంగా ఉంది... దానికి కిలోమీటరు దూరంలో ఇంకో జీపు ఆగి ఉంది... దాని డ్రైవింగ్ సీట్లో గంగారాం ఉన్నాడు. తన జీపు లైట్లు ఆపి ముందు జీపులో వెళ్తున్న వ్యక్తికి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు గంగారాం...

ఆ జీపు కొంచెం దూరం వెళ్లిన తరువాత ఇంకో ఇరుకు రోడ్డులోకి మళ్ళింది...

ఐదునిముషాల తరువాత గంగారాం కూడా అక్కడికి చేరుకొని జీపుని ఆ రోడ్డులోకి మళ్ళించాడు.

రాను రాను ఆ జీపు వేగం తగ్గింది... కొంచెం దూరం వెళ్ళిన తరువాత జీపు ఆగి అందులోంచి ఒక వ్యక్తి దిగాడు. తరువాత టార్చిలైటు వెలిగించి కొండ ఎక్కడం ప్రారంభించేడు...

గంగారాం దూరం నుంచి జీపులో కూర్చొని అతన్ని గమనిస్తున్నాడు. అతను దిగి వెళ్ళిపోగానే గంగారాం జీపు దిగి నడుస్తూ ముందు జీపు ఆగిన ప్రదేశానికి చేరుకున్నాడు... అక్కడి నుంచి చూస్తే ఆ వ్యక్తి ఎదురుగా ఉన్న కొండ ఎక్కుతున్న దృశ్యం టార్చిలైటు వెలుగు వల్ల తెలుస్తోంది... గంగారాం దూరం నుంచే ఆ జీపుని గమనించాడు. జీపులో ఎవ్వరూ లేరు... అంటే ఆ వ్యక్తి ఒంటరిగా వచ్చినట్లు తెలుస్తోంది. జీపు నెంబరుని టార్చి వేచి చూసాడు... ఆ తరువాత దగ్గర్లోని చెట్టు దగ్గర్నుంచి బైనాకులర్ తీసి ఆ కొండెక్కిన వ్యక్తిని గమనించసాగేడు.

రాను రాను ఆ వ్యక్తి కొండ మీదకు ఎక్కడం తెలుస్తోంది. కొంతసేపటికి అతను ఆ కొండ మీదకు చేరుకున్నాడు. ఆ తరువాత వెలుగు కనిపించటం లేదు. అంతా చీకటి... ఒక అరగంట దాకా గంగారాం ఓపిగ్గా ఆ కొండని చూస్తూ కూర్చున్నాడు. ఆ తరువాత వెలుగు మళ్ళీ కనిపించింది. అది రాను రాను కిందకు ప్రసరిస్తూ కదులుతోంది... ఆ వ్యక్తి బహుశా కిందకు దిగుతున్నట్లు ఊహించాడు గంగారాం...

అలా ఆ వెలుగు కొండ కిందకు వస్తూ అరగంట తరువాత కిందకు చేరుకుంది... ఆ వ్యక్తి టార్చి ఆపి జీపు ఎక్కి దాన్ని స్టార్ట్ చేసాడు... ఆ తరువాత ఆ జీపు మెల్లగా వెళ్ళిపోయింది...

అప్పటి దాకా చెట్టు చాటున ఉన్న గంగారాం ఆ జీపు దూరం వెళ్ళిన తరువాత నడుచుకుంటూ తను జీపు ఆపిన ప్రదేశం దగ్గరికి వచ్చి జీపుని స్టార్ట్ చేసాడు...

ఆ తరువాత జీపులో ఇంటికి చేరుకున్నాడు గంగారాం...

గంగారాంకి ఇప్పుడు జోగీందర్ మీద అనుమానం మరింత బలపడింది... ఆ జీపు నెంబరు జోగీందర్‌ది... అంటే అందులో ఉన్నది జోగిందర్ అనీ అర్థం అయింది... అతను అనుకున్నట్లే జోగీందర్ బయటకు వచ్చాడు... ఎందుకు జోగీందర్ అంత రాత్రిపూట ఆ కొండ దగ్గరికి వెళ్ళాడు? తనకి తెలిసి ఈ ప్రాంతానికి ఆరోజు రాలేదు... ఈ దారి పూర్తిగా కొత్త... ఇది జోగీందర్ తమకిచ్చిన మేపులో లేదు... మరిప్పుడు ఈ ప్రాంతానికెందుకు జోగీందర్ వచ్చాడు?

గంగారాంకి ఆలోచనలతో మెదడు వేడిక్క సాగింది. తామిద్దరికీ తెలియకుండా నిధి దాచిన ప్రదేశాన్ని జోగీందర్ నిన్న రాత్రి వెళ్ళిన కొండ మీదకు తరలించి ఉంటాడనీ అతనికి అర్థం అయింది. బహుశా కైలాసం హత్య కూడా అతనే చేయించి ఉంటాడన్న అనుమానం గంగారాంకి ఇప్పుడు బలపడసాగింది...

గంగారాం ఆ మర్నాడు ఉదయాన్నే నిన్న రాత్రి వెళ్ళిన కొండ ప్రాంతానికి బయలుదేరాడు. జీపుని నిన్న రాత్రి జోగీందర్ ఆపిన ప్రదేశంలో ఆపి కొంచెం దూరం నడిచి కొండ ఎక్కసాగేడు...

గంగారాం కదలికల్ని గమనిస్తున్న శ్రీహర్ష, గోపాల్ తాము కూడా ఇంకో జీపులో అతన్ని అనుసరించసాగారు...

"గోపాల్... ఇంత ఉదయాన్నే గంగారాం ఇక్కడికొచ్చాడేమిటి?" అన్నాడు శ్రీహర్ష జీపు దిగుతూ.

"సార్! జోగీందర్, గంగారాంల దగ్గర మన కానిస్టేబుళ్ళని మఫ్టీలో ఉంచాను. వాళ్ళు నిన్న జోగిందర్ రాత్రిపూట అడవులోకి వెళ్ళాడనీ, అతన్ని వెనకనే గంగారాం కూడా అనుసరిస్తూ వెళ్ళాడనీ చెప్పారు...

అప్పుడు నాకు అనుమానం వచ్చింది. వీళ్ళిద్దరి మధ్య ఏవో అనుమానాలు తలెత్తినట్లున్నాయి. బహుశా ఆ నిధిని జోగీందర్ వాళ్ళిద్దరికీ తెలియకుండా వేరొక్కడో దాచేసి ఉండొచ్చు... ఆ విషయంలో వాళ్ళ ముగ్గురి మధ్యా గొడవ జరిగి ఉండాలి. అందుకే బహుశా కైలాసాన్ని జోగీందర్ చంపి ఉంటాడు. కైలాసం హత్య తరువాత గంగారాంకి జోగీందర్‌పై అనుమానం మరింత పెరిగింది; అందుకే నిన్న రాత్రి అతన్ని వెంబడించీ అతనెక్కడికి వెళ్ళిందీ తెలుసుకొని ఉంటాడు. వీడిప్పుడు బహుశా ఆ ప్రదేశానికి వెళుతుండవచ్చు. అందుకే మిమ్మల్ని పిలిచాను" అంటూ తను కూడా జీపుని రోడ్డు వార చెట్టు పక్కన ఆపీ జీపు దిగాడు. శ్రీహర్ష కూడా బైనాక్యులర్స్ పట్టుకొనీ దిగాడు. ఆ తరువాత వాళ్ళిద్దరూ ఆ కొండవైపు నడవటం మొదలు పెట్టారు...

సూర్యోదయం అవుతోంది. తూరుపంతా వెలుగు రేకలు పరుచుకుంటున్నాయి... అడవి మేల్కొంటోంది...ఎక్కడ నుంచో గండు కోకిళ్ళ స్వరమాధుర్యాలు, పిచ్చుకల కిచకిచలు, పావురాల కువకువలు... ఆ సుప్రభాతంలో ఆ పక్షుల కూతలు కీరవాణి రాగాన్ని తలపిస్తున్నాయి.

కొండవాలులో సిల్వర్ జోక్ చెట్ల మధ్య నుంచి ఏటవాలు కిరణాలు పడుతున్నాయి.

ఆ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది శ్రీహర్షకు... అంత అందమైన ప్రకృతిని అతనెప్పుడూ చూడలేదు... ఆ అందమైన దృశ్యాలను పక్షుల్ని తన డిజిటల్ కెమేరాలో బంధించసాగాడు...

ఇంతలో నీలాకాశంలో ఒక మల్లెపూల దండలా తెల్లటి కొంగల బారు ఎగురుతూ కనిపించింది... మొత్తానికి ఆ ప్రత్యూషపు వేళ అక్కడి వనసౌందర్యం చాలా ఆహ్లాదకరంగా ఉంది...

అలా ప్రకృతిని ఆస్వాదిస్తూ నడవసాగేడు శ్రీహర్ష...

గోపాల్ ముందు వెళ్తున్న గంగారాంని గమనిస్తూ కొండ ఎక్కడం మొదలు పెట్టాడు. అతని

వెనకే శ్రీహర్ష.

అరగంట తరువాత గంగారాం కొండ ఎక్కాడు. అతనికి కొద్ది దూరంలో గోపాల్, శ్రీహర్ష అతన్ని చూస్తూ నిలబడ్డారు... కానీ ఎంతసేపటికీ అతను రాకపోవటంతో గోపాల్‌కి అసహనం మొదలైంది...

గంగారాం కొండ మీద ఏం చేస్తున్నాడు... నిన్న జోగీందర్ ఇదే ప్రాంతానికొచ్చినట్లుంది... అంటే బహుశా ఈ ప్రాంతంలోనే నిధి దాచాడేమో... ఆ రోజు జీపు ప్రమాదానికి గురైన తరువాత ముగ్గురు కలిసి ఆ బంగారాన్ని దాచి ఉండాలి... అప్పుడు ఆ ప్రదేశం గురించి ముగ్గురికీ తెలిసి ఉండాలి. మరి జోగీందర్‌ని గంగారాం రహస్యంగా ఎందుకు వెంబడించాడు? కైలాసం ఇంకో కొండ మీద ఎందుకు తవ్వకాలు జరిపించేడు? అంటే వాళ్ళకు తెలియకుండా జోగీందర్ మోసంచేసి ఆ బంగారాన్ని అక్కడ నుంచి ఈ ప్రాంతానికి తరలించాడా? ఎన్నో ప్రశ్నలు... ఏం జరిగిందో తెలియదు... శ్రీహర్ష తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

అప్పటికి గంగారాం ఆ కొండ మీదకు వెళ్ళి గంటన్నరైంది... రాను రాను విసుగుపుట్టడం మొదలైంది. ఇద్దరికీ... అక్కడే ఉన్న చెట్టు కింద కూర్చున్నారు...

మరో అరగంట తరువాత గంగారాం కిందకు దిగుతూ కనిపించాడు...

అతను మధ్య మధ్యలో ఆగుతూ కిందకు దిగటం తెలుస్తోంది...

రాను రాను అతను వాళ్ళని దాటి పోయాడు. అతను వాళ్ళని దాటి పోగానే వెంటనే ఇద్దరూ లేచి కొండెక్కటం మొదలు పెట్టారు. ఒకవైపు గంగారాం కొండ దిగుతుంటే ఇంకోవైపు గోపాల్, శ్రీహర్ష కొండనెక్కుతున్నారు...

కొద్దిసేపటికి గోపాల్, శ్రీహర్ష కొండ శిఖరం చేరుకున్నారు...

అక్కడ చాలా వరకు సమతలంగా ఉంది... ఇద్దరూ చాలాసేపు ఆ ప్రదేశాన్ని పరిశీలించసాగారు... కానీ అక్కడ ఏమీ కనిపించలేదు... ఇక్కడకొచ్చీ నిన్న జోగీందర్, ఈరోజు గంగారాం ఏం చూసారోననీ గోపాల్‌కి సందేహం కలిగింది. అదే విషయాన్ని శ్రీహర్షతో చెప్పాడు.

శ్రీహర్ష ఆ ప్రాంతాన్ని బైనాక్యులర్స్‌తో గమనించ సాగేడు...

కొంచెం సేపటికి అతనికి చెట్ల మధ్యలో తెల్లటి కట్టడం కనిపించింది.

"గోపాల్! ఇలా రండి" అంటూ పిలిచాడు శ్రీహర్ష..

గోపాల్ పరుగున అతని దగ్గరకు వచ్చాడు.

"ఇందులోంచి చూడండి... దూరంగా ఏదో కనిపిస్తోంది" అన్నాడు బైనాక్యులర్ ఇస్తూ.

గోపాల్ చాలాసేపు అటువైపు చూసి "సార్... అక్కడ ఏదో గుడి ఉన్నట్లున్నది. పదండి చూద్దాం" అంటూ అటువైపు నడవటం మొదలు పెట్టాడు. అతని వెంట శ్రీహర్ష వెళ్ళాడు...

అక్కడ చెట్ల మధ్య ఓ పాడుబడిన గుడి కనిపించింది... గోడలన్నీ కూలిపోయి ఉన్నాయి... చుట్టూ పెద్ద పెద్ద రాళ్ళ కుప్పలు... వందల సంవత్సరాల క్రితం కట్టిన గుడిలా ఉంది...

అక్కడ వెనక ఉన్న గుడిమీద ఎర్రరంగుతో ఒక స్వస్తిక్ గుర్తు ఉంది... అది ఎవరు ఎందుకు వేసారో అర్థం కాలేదు శ్రీహర్షకి...

గోపాల్ కొంచెం దూరం వెళ్ళి ఆ ప్రదేశాన్ని గమనించసాగేడు...

కొద్దిసేపటికి "సార్! ఇక్కడికి రండి" అన్నాడు. అక్కడ ఒక తవ్వకం, రాళ్ళు, మట్టి కనిపించాయి. శ్రీహర్ష ఆ గుడి దగ్గరకు వెళ్ళి చూడటం మొదలు పెట్టాడు.

"సార్! ఈ స్వస్తిక్ గుర్తు బహుశా పోల్చుకునేందుకు గుర్తుగా పెట్టి ఉంటారు... ఇక్కడ తవ్వకం జరిగింది అంటే ఇక్కడే ఆ నిధిని దాచి ఉంటారు... ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు మోసానికి పాల్పడ్డారు... కైలాసం చనిపోయాడు కాబట్టి ఇప్పుడు ఇద్దరే గంగారాం, జోగేందర్. వీళ్ళిద్దర్లో ఒకరికే ఈ ప్రదేశం గురించి తెలిసి ఉండాలి... నిన్న బహుశా జోగేందర్ ముందుగా వచ్చి ఉంటాడు కాబట్టి అతనే మిగతా ఇద్దర్నీ మోసం చేసి ఆ నిధిని ఇక్కడికి తరలించి ఉంటాడు. దాన్ని కన్ఫర్మ్ చేసుకోవడానికే గంగారాం ఈ కొండ మీదకు వచ్చి ఉంటాడు" అన్నాడు గోపాల్... మరి కొంచెం సేపు ఆ ప్రదేశాన్ని పరిశీలించి ఫోటోలు వీడియో తీసి కిందకు దిగడం మొదలు పెట్టారు.

అక్కడ నుంచి చూస్తే చాలా దూరంలో కిందకు దిగుతూ కనిపిస్తున్నాడు గంగారాం...

గంగారాం త్వరత్వరగా కిందకు దిగిపోతున్న దృశ్యం కొండ దిగుతున్న శ్రీహర్ష, గోపాల్ ఇద్దరికీ స్పష్టంగా కనిపిస్తోంది.

రాను రాను గంగారాం కనిపించడం లేదు. అతను కిందకు దిగిపోయి ఉంటాడు అనుకున్నారిద్దరూ...

ఇద్దరూ మౌనంగా కిందకు దిగుతున్నారు. అప్పటికి సమయం ఎనిమిదిగంటలైంది.

అలా దిగుతున్న సమయంలో కొండలు ప్రతిధ్వనించేలా ఒక కేక వినిపించింది...

ఆ ప్రతిధ్వని ప్రకంపనలు పూర్తి కాకుండానే మళ్ళీ మరో కేక, ఒక్కసారిగా ఆకాశంలో పక్షులు ఆ కేకలకి భీతిల్లి ఎగురుతూ కనిపించాయి.

ఆ కేకలు విన్న గోపాల్ శ్రీహర్ష వైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

శ్రీహర్షకి కూడా ఆ కేకలు ఎవరివో ఎందుకు వేసారో అర్థంకాలేదు.

ఇంతలో శ్రీహర్షకి ఓ అనుమానం వచ్చింది. ఆ కేకలు గంగారాం వేసినట్లు అనిపించింది.

"గోపాల్! ఆ కేకలు ఎవరివి?" అన్నాడు పరుగున కిందకు దిగుతూ...

"గంగారాంలా ఉన్నాయి... పదండి త్వరగా" అన్నాడు పరుగున కిందకు దిగుతూ...

అలా పరిగెడుతూ దిగడం వల్ల ఆయాసం వస్తోంది... ఆ తరువాత ఆ అరుపులు వినిపించలేదు.

అరగంట తరువాత ఆ కొండని దిగారు... అక్కడ దూరంగా గంగారాం వచ్చిన జీపు ఆగి ఉంది. తమ కంటే ముందు దిగిన గంగారాం ఈ పాటికి వెళ్ళిపోవాలి... కానీ జీపు అక్కడే ఉంది అంటే ఇక్కడే ఉండి ఉండాలనుకున్నాడు గోపాల్...

"సార్! గంగారాం జీపు ఇక్కడే ఉంది... అంటే వాడిక్కడే ఉండి ఉంటాడు... వాడు మన జీపుని గమనించాడేమో..." అన్నాడు గోపాల్...

"ఆ అరుపులు ఎవరివో ఆలోచించు... వాడు ప్రమాదంలో ఉండి ఉంటాడు" అంటూ ఆ ప్రాంతాన్ని పరిశీలించసాగాడు...

అలా మాట్లాడుతూ రోడ్డు దాకా నడిచి వచ్చారు.

అరగంటసేపు వెతికినా ఎక్కడా ఎవ్వరూ కనిపించలేదు... జీపు ఆగిన ప్రదేశంలో చిన్న టైర్ల ముద్రలు కనిపించాయి. అవి వస్తున్నపుడు వెళ్ళిపోతున్నపుడు రెండేసి కనిపించాయి.

గోపాల్! ఒక మోటార్ సైకిల్ ఈ ప్రాంతానికి వచ్చినట్లుంది... ఎవరో ఇక్కడికి వచ్చారు!" అన్నాడు గాబరాగా... ఇద్దరూ ఆ ప్రాంతం అంతా జల్లెడ పడుతూ వెతుకుతున్న సమయంలో గోపాల్ అరుపు గట్టిగా వినిపించింది శ్రీహర్షకు.

పరుగున అటువైపు వెళ్ళాడు. అక్కడ గోపాల్ ఓ చెట్టు వైపు ఆశ్చర్యంగా చూస్తూ కనిపించాడు.

శ్రీహర్ష కూడా అటు చూసాడు...

ఎదురుగా చెట్టుకి భయంకరంగా వేలాడుతూ గంగారాం" తాడుతో ఉరివేయడం వల్ల గుడ్లు నాలుక బయటకొచ్చి చాలా భయంకరంగా కనిపిస్తున్నాడు...

## 13

గంగారాం శవానికి పోస్ట్‌మార్టమ్ పూర్తైంది. అతని నుదుట మీద కూడా రుద్రనేత్రం బొమ్మ

ఎర్రటి రక్తంతో గీసి ఉంది...

శ్రీహర్షకు ఆశ్చర్యం వేస్తోంది.

తాము కొండదిగే లోపు ఎవరో వచ్చి గంగారాంని పొడిచి చెట్టుకి వేలాడదీసి పారిపోయాడంటే ఆ కిల్లర్ చాలా ప్రొఫెషనల్లా ఉన్నాడనిపించింది.

అదే విషయాన్ని ఆ సాయంత్రం తన దగ్గరకు వచ్చినపుడు గోపాల్‌తో చెప్పాడు...

"అవును సార్! మనం ఎంతసేపూ ఈ ముగ్గురి గొడవగానే చూసాము కానీ ఇప్పుడు ఎవరో బయట వ్యక్తి ఈ పనిచేస్తున్నట్లనిపిస్తోంది. అదీ కాక అతను బంగారం కోసం ఈ పని చేస్తున్నట్లు లేదు. అలా అయితే ఆ బంగారన్ని తీసుకొని వెళ్ళిపోయి ఉండేవాడు కానీ భయంకరంగా చంపి ఉరితీసి ఆ ముఖం మీద ఆ గుర్తు ఎందుకు వేస్తాడు... దాని వల్ల అతనికి ఏమిటి లాభం... కాబట్టి ఎవరో వీళ్ళని వెంటాడుతూ చంపుతున్నాడు... నిధి గురించే మనం ఆలోచిస్తూ మనం తప్పటడుగు వేసామనిపిస్తోంది" గోపాల్ విచారంగా అన్నాడు...

"ఆ ముగ్గురిని చంపే అవసరం ఎవరికుందంటావు... ఎవరు చేస్తున్నారీ హత్యలు" అన్నాడు శ్రీహర్ష.

"సార్... ఆరోజు వీడియోలో జోగీందర్ దివాకర్ గురించి మాట్లాడేడు. బహుశా అతని హస్తం ఉండొచ్చు". "దివాకర్ని పిలిచి విచారిస్తే అన్ని విషయాలు తెలుస్తాయి. అతన్ని పిలిపించండి" అన్నాడు గోపాల్.

"ఇప్పుడు జోగీందర్ ప్రాణానికి కూడా ముప్పు ఉందనిపిస్తోంది... అతనింటి చుట్టూ మన వాళ్ళని పెట్టి, అతని కదలికల్ని గమనించమనీ చెప్పండి... అతనింటికి ఎవరు వస్తున్నారో ఓ కన్నువేసి ఉంచండి..." శ్రీహర్ష మేపుని గమనిస్తూ చెప్పాడు.

"ఈరోజు నుంచి మనుషుల్ని పెడతాను. దివాకర్ని తీసుకురమ్మనీ అక్కడ సీఐ గారికి చెబుతాను... మీరు కూడా ఒకసారి ఎస్పీ గారితో మాట్లాడండి." అన్నాడు గోపాల్...

ఆ తరువాత ఇద్దరూ గెస్ట్ హౌస్‌కి బయలుదేరారు.

... ... ...

అడవి అంతా నిశ్శబ్దంగా ఉంది...

రాత్రి ఎనిమిదైంది. గెస్ట్‌హౌస్ లాన్‌లో ఒంటరిగా కూర్చుని ఉన్నాడు శ్రీహర్ష.

అతను గోపాల్ కోసం ఎదురుచూస్తున్నాడు. గోపాల్ మధ్యాహ్నం ఫోన్ చేసి దివాకర్ని తీసుకు వస్తున్నట్లు చెప్పాడు...

అప్పట్నుంచీ వాళ్ళ కోసం ఎదురు చూస్తున్నాడు. మరో అరగంట తరువాత ఒక జీపు వస్తూ కనిపించింది.

అది గెస్ట్‌హౌస్ ముందు ఆగగానే ముందుగా గోపాల్, అతని వెనక దివాకర్ దిగారు...

మారీచు ముగ్గురికి టీలు తెచ్చాడు.

దివాకర్ వస్తూనే శ్రీహర్షకి నమస్కారం పెట్టి కూర్చున్నాడు.

"గోపాల్! దివాకర్ని మన వాళ్ళు తీసుకు వచ్చారా? లేక ఇతనే వచ్చాడా?" అని అడిగాడు హర్ష.

"ఇతను మనం పిలవక ముందే ఇక్కడ జోగిందర్ని కలవడానికి వచ్చాడు..." అనీ చెప్పాడు గోపాల్.

"దివాకర్! మేము మీరు నిజం చెప్పారని నమ్మాము. కానీ మీరు కొన్ని విషయాలు దాచేరు... ఆ నిధిని మీరు దండకారణ్యంలోని దాచిన దేవాలయాల్లోకి వెళ్ళేసరికి ఎవ్వరో తవ్వి పట్టుకెళ్ళిపోయారనీ, గిరిధారి మీద అనుమానం ఉందనీ అబద్ధం చెప్పారు... మీరు పురావస్తు శాఖలో పెర్మనెంట్ ఉద్యోగి కాబట్టి మీరు నిజమే చెప్పారనుకున్నాము.

కానీ మీరు అబ్ధం చెప్పి దాన్ని వమ్ము చేసారు... నిజమా కాదా?" అని గట్టిగా ప్రశ్నించాడు శ్రీహర్ష.

దివాకర్ మౌనం దాల్చేడు.

"ఏం మాట్లాడరేం! ఈ మొత్తం వ్యవహారానికి మీరే కారణం... మీరే ఆ నిధిని కనిపెట్టి బయట వ్యక్తులతో డీల్ కుదుర్చుకున్నారు... నిజమా కాదా?" శ్రీహర్ష ప్రశ్నలు దివాకర్ని వణికిస్తున్నాయి.

"అటువంటిదేం లేదు... అదంతా అబద్ధం... నాకేం తెలియదు" అన్నాడు దివాకర్... మాట్లాడుతుంటే అతని కళ్ళల్లో భయం కనిపిస్తోంది.

"అలా అయితే ఈరోజు జోగిందర్ని కలవడానికెందుకొచ్చారు? జోగిందర్ మీకెలా తెలుసు? నిజం చెబితే మీకు శిక్ష తగ్గుతుంది. లేకపోతే 10 సంవత్సరాల జైలు ఖాయం" హెచ్చరించాడు శ్రీహర్ష...

"నాకు 4 ఏళ్ళుగా తెలుసు. అతను మా శాఖ కాంట్రాక్ట్ పనులు చేసేవాడు. అందుకే అతను పరిచయం. మొన్న జోగిందర్ ఫోన్ చేసి ఏదో విషయం మీద మాట్లాడదామనీ చెబితే వచ్చాను... అంతే తప్పా నాకింకేం తెలియదు" దివాకర్ మెల్లగా చెప్పాడు.

"నిన్న జోగిందర్, గంగారాం మాటలని రికార్డ్ చేసాము... అందులో మీరే ముందుగా నిధి గురించి అతనికి చెప్పారనీ చెప్పాడు... మర్యాదగా నిజం ఒప్పుకొని ఏం జరిగిందో చెప్పండి... లేకపోతే మీ చేత ఎలా నిజం చెప్పించాలో తెలుసు... ఒకరోజు పోలీస్ స్టేషన్‌లో ఉంచితే మీరే నిజం చెబుతారు..."

శ్రీహర్ష మాటలు తూటాల్లా తగులుతున్నాయి దివాకర్‌కి.

అతని ముఖమంతా చెమటలు పడుతున్నాయి.

"దివాకర్... ఈ నిధి విషయం మీ ద్వారా వాళ్ళ ముగ్గురికీ తెలిసింది. అందులో ఇద్దరు హత్యకు గురయ్యారు... వాళ్ళ శవాల మీద మీరు ఇది వరకు చూసిన రుద్రనేత్రం రక్తంతో వేసి ఉంది. దీన్నిబట్టి ఆ హత్యలతో మీకు సంబంధం ఉండే ఉంటుంది... చెప్పండి ఆ హత్యలెందుకు చేసారు" గోపాల్ ప్రశ్నించాడు.

"లేదు సార్... నాకా హత్యలతో గాని, నిధితో గాని సంబంధం లేదు నమ్మండి" దివాకర్ వేడుకుంటూ చెప్పాడు.

"అయితే ఆ హత్యను జోగిందర్ చేసాడా?" గోపాల్ అసహనంతో ప్రశ్నించాడు.

"నాకేం తెలియదు సార్... ప్లీజ్ నన్ను వదిలేయండి." దివాకర్ రెండు చేతులూ జోడించాడు.

"దివాకర్... నువ్వీ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటున్నావు. ఎవ్వరో ఈ హత్యలు చేస్తున్నారు... మీరిద్దరూ కాకపోతే ఇంకొక వ్యక్తి మీ నలుగురిని చంపాలనీ చూస్తున్నాడు. అలా అయితే మీ ప్రాణాలకు కూడా ముప్పు ఉంది... కాబట్టి నిజం చెబితే మీకు రక్షణగా మేముంటాము..." శ్రీహర్ష మాటలకు ఆలోచనలో పడ్డాడు దివాకర్.

"నేను తప్పు చేసాను సార్. పేదరికం, దురాశ నన్నీ పనికి పురిగొలిపాయి" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను ఆఫీసులో చేరిన తరువాత ఒకరోజు ఫైల్స్ చూస్తుండగా "దండకారణ్యంలో నిధి" అన్న ఫైలు కంట పడింది. అది గిరిధారి అనే డీకోడింగ్ అసిస్టెంట్ తయారు చేసిన ఫైలు.

అందులో నిధి గురించిన సమూల సమాచారం ఉంది... అతను అన్నింటినీ డీకోడ్ చేసి దండకారణ్యంలోని శబరి నది ఒడ్డున ఉన్న మూడు పురాతన ఆలయాలలో ఆ నిధి రహస్యం యొక్క సమాచారం ఉందనీ వ్రాసాడు. ఈలోగా అక్కడ శివుడి గుడి ఉందనీ తెలిసీ తవ్వకాలు జరిపితే ఒక రాగిరేకు దొరికింది.

నేను దాన్ని మరింతగా పరిశోధించి వాటిని మేపుల ద్వారా పరిశీలించి మా డైరక్టర్ శివరాం

గారికి తెలియకుండా శలవు పెట్టి అక్కడికెళ్ళి ఆ మూడు గుళ్ళను గురించిన కొంత సమాచారం సేకరించాను.

తరువాత మా డైరెక్టర్ శివరాం గారి అనుమతి తీసుకొని ఆ రాగిరేకు మీద వ్రాసిన శాసనాన్ని తర్జుమా చేసి ఆ మూడు కొండల ఉనికిని కనిపెట్టాను... కానీ అప్పటికే బహుశా గిరిధారి కాబోలు తవ్వకాలు జరిపి నిధి తీసుకు వెళ్ళిపోయినట్లు కనిపించింది. కానీ నేను అవతలి ఒడ్డున ఉన్న గుడికి దగ్గరగా వెళ్ళినపుడు ఆ రుద్రనేత్రానికి ఎదురుగా ఉన్న ప్రదేశంలో ఒక రాతి గుహ కనిపించింది... అందులోకి దిగిన తరువాత అక్కడ బోలెడు బంగారం కనిపించింది. ఆ విషయాన్ని ఎవ్వరికీ చెప్పకుండా ఆఫీసుకి వచ్చేసి శివరాం గారితో అక్కడ ఏమీ దొరకలేదనీ ఎవ్వరో ఆ నిధిని తవ్వుకొని వెళ్లిపోయారనీ చెప్పేసాను...

ఆ తరువాత ఆ నిధిని ఎలా తవ్వి సంపాదించాలనీ ఆలోచించడం మొదలు పెట్టాను. కానీ నేనొక్కడినీ ఆ పని చెయ్యలేననిపించింది. ఎవ్వరో సహాయం చేస్తే తప్పా దాన్ని బయటకు తీసుకు రాలేము అన్న నిర్ణయానికొచ్చాను.

అప్పుడు నాకు జోగిందర్ గురించి తెలిసింది... అతను ఓ పెద్ద మైనింగ్ కంట్రాక్టర్... కలప మిల్లులు కూడా ఉన్నాయి. అడవిలో ఎక్కడైనా తవ్వకాలు జరపాలంటే అతనికే సాధ్యం... అందుకనీ ఒక రోజు అతన్ని కలిసి ఆ నిధి గురించిన వివరాలు చెప్పి ఆ శాసనం చూపించి అక్కడ ఉన్న నేల మాళిగలో నిక్షిప్త పరచిన బంగారం నిధి గురించి చెప్పి అది తవ్వి నా వాటా కింద సగం ఇవ్వమనీ చెప్పాను. దానికి అతను ఒప్పుకొనీ తన ఇద్దరి స్నేహితులైన గంగారాం, కైలాసంలతో కలిసి తవ్వకాలు జరిపి ఆ నిధిని తవ్వి తీసాడు. కానీ నాకు ఇవ్వవలసిన వాటా ఇవ్వలేదు. నేను దాని గురించి అడిగితే ఆ నిధిని దగ్గర్లోని గాలికొండ లోయ దగ్గర దాచేమని అది బయటకు వచ్చిన తరువాత నా వాటా యిస్తామనీ చెప్పారు. సంవత్సరం అయింది కాని దాన్ని వాళ్ళు బయటకు తేలేకపోయారు. ఈ మధ్యన నేను ఇక్కడికి వచ్చి అడిగితే ఆ నిధి దాచిన ప్రదేశాన్ని మరిచిపోయామనీ దాని కోసం వెతుకుతున్నామనీ చెప్పాడు... నేనింకేం చెయ్యలేక వెనుదిరిగి వెళ్ళిపోయాను... నిజానికి నాకు గంగారాం, కైలాసం ఎవ్వరో తెలియదు. ఈ మధ్యనే వాళ్ళు హత్యకావించబడ్డారని తెలిసింది. నాకెందుకో జోగిందర్ మీదే అనుమానంగా ఉంది. ఎందుకంటే ఆ నిధిని దాచింది అతనే. వాళ్ళకి తెలియదు. నా ఉద్దేశ్యంలో ఆ నిధిని వేరే స్థలంలో దాచి వాళ్ళకి తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటాడనిపిస్తోంది. అందుకే వాళ్ళ మధ్య గొడవలు జరిగి హత్యలు దాకా దారి తీసినట్లున్నాయి. నాకు తెలిసింది ఇదే సార్. నిధి విషయం ప్రభుత్వానికి చెప్పకుండా నేను పెద్ద తప్పే చేసాను... అది ఇలా పరిణమిస్తుందనీ నేననుకోలేదు... అంతే కానీ నాకీ హత్యలతో ఏ సంబంధం లేదు..." అనీ కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు దివాకర్...

దివాకర్! చాలామంది నీలాగే తప్పటడుగు వేస్తారు. మనం మన ఉద్యోగానికి సంస్థకూ

జవాబుదారీగా ఉండాలి... డబ్బు కోసం తప్పుడు పనులు చేస్తే జీవితాంతం బాధపడాలనీ నిన్ను చూస్తే తెలుస్తుంది... ఇంతకీ మొన్న నువ్వు ఇక్కడికి వచ్చి జోగేందర్‌తో ఏం మాట్లాడావు? ఇంతకీ ఆ నిధిని తను ఎక్కడ దాచాడు...?" అనీ ప్రశ్నించాడు గోపాల్.

వాళ్ళ సంభాషణంతా సీసీ కెమెరాలో రికార్డవుతోంది...

"నేను మొన్న వచ్చినపుడు అతను నిధి ఎక్కడ దాచాడో ప్రశ్నించలేదు... నా వాటా ఇమ్మనమని అడిగాను. నా దృష్టిలో అతను ఆ డబ్బుని తరలించుకు పోయుంటాడు. మిగతా ఇద్దరూ అతన్ని తమ వాటా ఇవ్వలేదనీ అడిగేసరికి హత్యలకు పాల్పడినట్లున్నాడు... అందుకే నా డబ్బు ఇమ్మనమనీ అడిగినపుడు అబద్ధం చెప్పాడు. ఎందుకంటే నాకు చెప్పి సంవత్సరం అయింది. ఇనాళ్ళు అతను డబ్బు తరలించకుండా ఉంటాడనీ నేననుకోను... ఏదైనా జోగేందర్ వీటన్నింటికీ మూలం అతనే ఇవన్నీ చేయిస్తున్నాడు... అతన్ని పట్టుకుంటే అన్నీ తెలుస్తాయి. అతను చాలా దుర్మార్గుడు – అతను చాలా రోజుల క్రితం రాజస్థాన్ నుంచి ఇక్కడకు వచ్చాడు. అతి పెద్ద క్రిమినల్, ఇక్కడకు వచ్చి ఎన్నో దొంగతనాలు, హత్యలు చేసి డబ్బులు సంపాదించుకున్నాడు... ఎందరో ఫారెస్ట్ వాళ్ళను, పోలీసుల్ని చంపేసాడు. అయినా రాజకీయ నాయకుల్ని తన చెప్పుచేతల్లో ఉంచుకొనీ ఇటువంటి ఘోరాలు చేస్తున్నాడు... వాడిని ఉపేక్షించకూడదు సార్... నాకు ఏ డబ్బూ అక్కర్లేదు. నేను ఈ కేసులో ఎప్రూవర్‌గా మారతాను. మీ క్కావలసిన విధంగా కోర్టులో చెబుతాను. వాడిని మాత్రం వదలొద్దు... వాడికి ఇక్కడికి దగ్గర్లోని రోళ్ళ బండ తండాలో ఓ గిరిజన మహిళతో అక్రమ సంబంధం ఉంది. వచ్చినపుడు అక్కడే ఉంటాడు. వాడిని పట్టుకోవాలంటే అదే సరియైన ప్రదేశం" అన్నాడు దివాకర్. అతనిలో పశ్చాత్తాపాన్ని గమనించాడు శ్రీహర్ష. దివాకర్ నిజానికి నేరస్వభావం ఉన్నవాడు కాదు. కానీ డబ్బు ఆశ అతనితో అలా చేయించింది. ఇక అతన్ని ఎంత ప్రశ్నించినా ఉపయోగం లేదనిపించింది శ్రీహర్షకు.

"ఓకే దివాకర్... మీరు పోలీస్టేషన్‌లో మూడు రోజులుండండి. ఈలోగా ఈ కేసు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది" అన్నాడు శ్రీహర్ష.

ఆ తరువాత ఒక కానిస్టేబుల్ వచ్చి అతన్ని తీసికెళ్ళిపోయాడు.

కొంచెం సేపటి తరువాత భీమన్న ఓ గిరిజనుణ్ణి తీసుకు వచ్చాడు.

"ఏంటి భీమన్నా? ఎవరితను?" అనీ అడిగాడు శ్రీహర్ష.

బాబూ ఈడిది పక్క ఊరు కోడిపెంట. మీతో ఏదో సెప్పాలంటున్నాడు. నాకు సెప్పరా నేను దొరగారితో సెబుతానంటే ఇంటంనేదు..." అన్నాడు.

"సరే నువ్వెళ్ళు... నేను మాట్లాడతాను" అనీ చెప్పాడు శ్రీహర్ష.

వాడు వెళ్ళిపోయిన తరువాత అతను భయం భయంగా చూడసాగేడు.

"నీ పేరేంటి?" అనీ అడిగాడు శ్రీహర్ష.

"నా పేరు సివుడు. మొన్న నేనుదయాన్నె అడవికి కర్రల కొచ్చినపుడు ఒకడు మోటార్ సైకిల్ మీద వొచ్చి ఓ మనిషిని కర్రతో కొట్టి ఆ తరువాత ఆణ్ణి సెట్టుకి ఏలాడదీసినాడు. నేనప్పుడు అక్కడే కర్రలు కొడుతున్నాను... ఆ తరువాత ఆడు మోటారు సైకిలెక్కి ఎల్లిపోనాడు. ఆణ్ణి దూరం నుంచి సూత్తే పక్క ఊరు మారీచుగోడిలా ఉన్నాడు. అది సెప్పడానికే వచ్చాను" అని చెప్పి వెళ్ళిపోయాడు...

శ్రీహర్షకి వాడి మాటలు ఆశ్చర్యం కలిగించాయి. భీమన్నని పిలిచి "నువ్వు తీసికొచ్చినవాడిదే ఊరు... వాడు మారీచు గాడే. ఈ హత్యలు చేసాడనీ చెబుతనాడు" అన్నాడు.

"నేదు బాబూ... మారీచుగోడు అమాయకుడు. ఆడు సంపేడంటే నాన్నమ్మను... ఆ సివుడుగోడు తప్పు సెప్పాడు" అన్నాడు భీమన్న.

"సర్లే... మారీచుగాడు అలాంటి వాడు కాదులే... నువ్వెళ్ళు" అని చెప్పడంతో భీమన్న వెళ్లిపోయాడు.

ఆ తరువాత అక్కడ శ్రీహర్ష వంటరిగా మిగిలాడు.

అతని ఆలోచన లిప్పుడు మారీచు చుట్టూ తిరగసాగాయి. కైలాసం హత్యపుడు మారీచు మెడలోని లాకెట్టు లాంటిదే హత్యా స్థలంలో దొరికింది. ఇప్పుడు గంగారాం హత్యకేసులో నిందితుడు మారీచులా ఉన్నాడనీ సివుడు చెప్పడం... ఇవన్నీ మారీచు మీద అనుమానాలు కలిగించ సాగాయి.

ఆ సమయంలో అతనికి మారీచు ప్రవర్తన గుర్తుకు రాసాగింది.

మారీచులో అటువంటి లక్షణాలు ఎప్పుడూ గమనించలేదు.

ఏదైనా ఈ విషయం తరువాత ఆలోచించాలి...

ముందు జోగిందర్ని పట్టుకోవాలి... మొన్న దొరికినట్టే దొరికి తప్పించుకున్నాడు. ఈసారి వాడిని వదలకూడదు.

ఈ కేసులో ఎన్నో ముడులు"... అన్నింటినీ విప్పితే గానీ నిజం బయటకు రాదు" అనుకున్నాడు శ్రీహర్ష

## 14

శ్రీహర్ష జీపులో బయల్దేరాడు... కొద్ది క్షణాల్లో అది కొండదారి పట్టింది. 2 గంటల ప్రయాణం తరువాత అది రోళ్ళబండ తండా చేరుకుంది.

ఆ సమయానికి గోపాల్ నలుగురు పోలీసులతో అడ్డురోడ్డు దగ్గర అతని కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.

జీపు ఆగగానే గోపాల్ వచ్చాడు.

"సార్ ఆ కనిపిస్తున్నదే రోళ్ళబండ. కొండ పక్కన ఉంది... జీపు ఆ ఊరికి అర కిలోమీటరు దూరం వరకూ వెళుతుంది" అన్నాడు.

ఆ తరువాత రెండు జీపులూ ఊరివైపు బయల్దేరాయి.

అరకిలోమీటరు దూరంలో జీపుల్ని ఆపి ఊరివైపు నడవటం మొదలు పెట్టారు.

ఊరు కొండవాలులో ఉంది... ఊరి ముందర చిన్నకొండ గెడ్డ... అందులో ఎక్కువగా నీరు లేదు. ఫేంట్లు ఎత్తుకొని దాన్ని దాటేరు... ఊరు ముందర చింతచెట్ల కింద చాలామంది మంచాలు వేసి పడుకొనీ కనిపించారు...

వాళ్ళను చూస్తే ఈ లోకంలో లేనట్లు కనిపిస్తున్నారు... బాగా తాగి మత్తులో ఊగుతున్నారు.

ఇంతలో ఒక యువకుడు బొరిగ పట్టుకొని వెళ్తు కనిపించాడు.

కానిస్టేబుల్ శేషు అతన్నాపి "దొరా! సీతాలు ఇల్లెక్కడ?" అని అడిగాడు.

అతను కొద్ది దూరంలో ఉన్న చిన్న డాబా ఇల్లుని చూపించాడు...

ఆ ఊళ్ళో ఆ ఇల్లే డాబా... మిగతావన్నీ పెంకుటిళ్ళే... కొన్ని తాటి కమ్మల ఇళ్ళు...

"సార్... మనం జాగ్రత్తగా వెళ్ళాలి... లేకపోతే వాడు పారిపోవచ్చు లేకపోతే కాల్పులు జరపొచ్చు..." అన్నాడు శేషు...

ఆ తరువాత ఇద్దరు సివిల్ డ్రెస్సులో ఉన్న కానిస్టేబుళ్ళు అక్కడికి వెళ్ళారు...

దూరం నుంచి శ్రీహర్ష, గోపాల్ వాళ్ళకి గమనిస్తూ నిలబడ్డారు...

అక్కడ నుంచి వాళ్ళు తలుపు కొడుతున్న దృశ్యం కనిపిస్తోంది...

ఎప్పటికీ వాళ్ళు రాకపోయేసరికి గోపాల్ వెళ్ళాడు. అతని జేబులో పిస్టల్ ఉంది... పది నిముషాలైనా వాళ్ళెవరూ రాకపోవటంతో శ్రీహర్షలో ఆందోళన మొదలైంది.

కొద్దిసేపటి తరువాత గోపాల్ వచ్చి "సార్! తలుపులు తెరవటం లేదు. బహుశా వాడికి మనం వచ్చినట్లు తెలిసిపోయినట్లుంది" అన్నాడు.

"ఏం చేద్దాం?" అని అడిగాడు శ్రీహర్ష.

"సార్... మా నలుగురు కానిస్టేబుళ్ళు, నా దగ్గర పిస్టల్స్ ఉన్నాయి. ఎటాక్ చేస్తే వాడు లొంగిపోతాడు." అంటూ ఆ ఇంటివైపు వెళ్ళాడు. నలుగురు కానిస్టేబుళ్ళు తలుపు దగ్గరకు చేరుకున్నారు.

ఈసారి తలుపులను బాగా కొట్టటం కనిపిస్తోంది.. ఇంతలో ఊళ్ళో కొందరు యువకులు అక్కడికి చేరుకోవడం శ్రీహర్ష గమనించాడు.

కొద్ది నిముషాలు ఏం జరుగుతోందో తెలియదు...

అరగంట తరువాత గోపాల్ పరిగెడుతూ వచ్చి "సార్... పదండి... వాడు వెనక నుంచి పారిపోయాడు. దూరంగా మోటార్ సైకిల్ కనిపిస్తోంది చూడండి... రండి" అంటూ పరుగున జీపుల దగ్గరికి పరిగెత్తాడు...

పరుగు లాంటి నడకతో ఆరుగురు ఐదు నిముషాల్లో జీపుల వద్దకు చేరారు. ఆ తరువాత జీపులు ధూళి రేపుకుంటూ బయల్దేరాయి... రోడ్డు సరిగ్గా లేకపోయినా అరవై కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి...

కానీ జోగీందర్ మోటారు సైకిల్ ఎక్కడా కనిపించటం లేదు. జీపులు స్పీదందుకున్నాయి. కొంచెం దూరం వెళ్ళిన తరువాత దూరంగా కనిపిస్తున్న కొండ పక్కన ధూళి కనిపించటంతో గోపాల్ "సార్... వాడు ఆ కొండ వైపు వారిపోతున్నాడు... శేషూ... జీపు అటువైపు తిప్పు" అనీ అరిచాడు.

ఐదు నిముషాల్లో జీపులు ఆ కొండవైపు మరలాయి. దూరం నుంచి ధూళి మధ్యలో మోటార్ సైకిల్ కనిపిస్తోంది...

వాడు జీపుల్ని చూసినట్లున్నాడు కాబోలు కొండ వాలులోకి వెళ్ళిపోవడం మొదలు పెట్టాడు...

కానీ జీపుల స్పీడు ముందు వాడి మోటార్ సైకిల్ పనికిరాలేదు...

పావుగంట తరువాత జీపులు ఆ కొండ ప్రాంతం చేరుకున్నాయి... అక్కడ ఓ చెట్టుకింద మోటారు సైకిల్ పార్క్ చేసి కనిపించింది...

ఎవ్వరూ కనిపించలేదు... అంతా నిశ్శబ్దంగా ఉంది... ఎదురుగా ఆకాశాన్ని తాకుతున్న పచ్చటి కొండలు...

"వాడు కనిపించాడా?" అని అడిగేడు శ్రీహర్ష...

"లేదు సార్! బహుశా అడవిలోకి పారిపోయి ఉంటాడు" అన్నాడు గోపాల్...

ఇంతలో కానిస్టేబుల్ శేషు వచ్చి "సార్ చూడండి... ఆ కొండ ఎక్కి పారిపోతున్నాడు..." అనీ కొండవైపు చూపించాడు...

దూరంగా ఓ వ్యక్తి... కొండ గబగబా ఎక్కుతూ కనిపిస్తున్నాడు.

“గోపాల్... క్విక్... మనం వెళ్ళాలి... కొంచెం మనం స్పీడుగా వెళితే వాడిని పట్టుకోవటం పెద్ద కష్టం కాదు” అన్నాడు శ్రీహర్ష.

“సార్ మీరిక్కడే ఉండండి. నేనూ, శేషూ వెళతాము... మా దగ్గర పిస్టల్స్ ఉన్నాయి. కాబట్టి పరవాలేదు” అంటూ బయలుదేరాడు గోపాల్... అతని వెనకే శేషు.

కొద్ది సేపటికి వాళ్ళు కొండ ఎక్కుతూ కనిపించారు... జోగీందర్ తనని ఎవరో వెంటాడుతున్నట్లు గమనించీ స్పీడు పెంచాడు... రాను రాను వాళ్ళ మధ్య దూరం తగ్గుతోంది.

ఇప్పుడు గోపాల్ రేంజ్‌లోకి వచ్చాడు జోగీందర్...

“జోగీందర్! మర్యాదగా లొంగిపో... లేకపోతే తూపాకీ గుండు దూసుకు పోతుంది” అనీ శేషగిరి గట్టిగా అరిచిన అరుపు కొండల్లో ప్రతిధ్వనించింది.

జోగీందర్ ఒక్కసారి ఇటు చూసి పారిపోవడం మొదలు పెట్టాడు.

గోపాల్ పిస్టల్ తీసి జోగిందర్ని గురి పెట్టి “జోగిందర్... దొరికిపో... లేకపోతే కాల్చేస్తాను” అనీ గట్టిగా అరిచాడు.

ఆ అరుపు కొండల్లో ప్రతిధ్వనించసాగింది. కానీ జోగీందర్ ఆ మాటలు లక్ష్య పెట్టకుండా పరిగెత్తుతూ వెళ్ళిపోతున్నాడు.

“జోగీందర్! నా మాట విను... లేకపోతే నీ ప్రాణానికే ప్రమాదం... మర్యాదగా లొంగిపో” అనీ మళ్ళీ చెప్పాడు...

అయినా జోగీందర్ పరుగు ఆపలేదు. వెనుదిరిగి చూడలేదు...

గోపాల్ క్షణం సేపు ఆలోచించాడు...

అంతే... పిస్టల్ ట్రిగ్గర్‌ని నొక్కాడు... ఒక్కసారిగా ‘ధాం’ అన్న ధ్వని ప్రతిధ్వనించింది. బులెట్ పోయి వేగంగా వెళ్ళి జోగీందర్ కాలు పక్కగా దూసుకు పోయింది... ఒక్కసారిగా పొగవ్యాపించింది. ఇంకోసారి మళ్ళీ పేల్చాడు. అది కూడా పక్క నుంచి రాసుకుంటూ వెళ్ళిపోయింది.

అప్పటి దాకా అలుపులేకుండా పరిగెదుతున్న జోగీందర్ రెండు బులెట్లు దూసుకు రాగానే ఒక్కసారిగా ఆగిపోయాడు.

అతను గోపాల్ పిస్టల్ పేలుస్తాడనీ ఊహించలేదు...

వెంటనే ఒక్కసారిగా చేతులెత్తాడు. అరగంట తరువాత కొండదిగి పోలీసుల దగ్గరకు వచ్చాడు.

అతన్ని అదుపులోకి తీసుకొని జీపెక్కించారు కానిస్టేబుళ్ళు...

ఆ తరువాత ఆ రెండు జీపులు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌కి బయలుదేరాయి.

## <u>14</u>

"రెండేళ్ళ క్రితం ఒకరోజు దివాకర్ నా వద్దకు వచ్చి దండకారణ్యంలోని గాలికొండ మీద గుడిలో నిధి ఉందనీ, రాగిరేకు శాసనం ద్వారా దాన్ని తెలుసుకున్నాననీ, దాన్ని బయటకు తేవడానికి నా సహాయం కావాలనీ చెప్పాడు.

అందుకు అతను ఏభైకోట్లు కావాలని చెప్పాడు.

నేను ఒప్పుకొని నా ఇద్దరు స్నేహితులు కైలాసం, గంగారాం లను తీసుకొనీ అక్కడికి వెళ్ళాను. దివాకర్ చెప్పినట్లుగా అక్కడ బోలెడు నిధి దొరికింది. అందులో వందల కోట్లు విలువ చేసే వజ్రాలు, బంగారం ఉన్నాయి... వాటిని మూడు కర్రపెట్టెల్లో పెట్టి కిందకు తెచ్చి జీపులో బయలుదరాము. ఇంతలో పోలీసులు మా జీపుని వెంబడిస్తున్నారన్న సమాచారం అందింది... వాళ్ళ నుంచి తప్పించుకోవాలన్న గాబరాతో వేగంగా జీపుని నడపడం వల్ల అది అదుపు తప్పి లోయలోకి పడిపోయింది.

అయితే అదృష్టవశాత్తూ ముందే మేము గెంతెయ్యడంతో ప్రాణాలతో బయటపడ్డాము...

కిందకు దిగి చూస్తే జీపు చాలా లోతుకు పడిపోయింది... కానీ అదృష్టవశాత్తూ ఆ నిధిని తెస్తున్న మూడు పెట్టెలు ఆ లోయలో ఒక చెట్టు అడ్డుపడటం వల్ల మాకు దొరికాయి...

"ఆ మూడు పెట్టెలను తీసుకొని లోయ బయటకు వచ్చి ఆ పక్కనే ఉన్న ఓ గుట్ట మీద పాడుబడిపోయిన ఓ గుడి పక్కన వాటిని గోతిలో కప్పి కిందకు వచ్చాము. ఆ దాచిన ప్రదేశాన్ని గుర్తుంచుకునేందుకు ఒక మేపు గీసి ముగ్గురికీ ఇచ్చాను.

అప్పుడు బాగా చీకటి పడిపోవడం, దానికి తోడు మాకు ఆ ప్రమాదంలో దెబ్బలు తగలడంతో ఆ రాత్రి ప్రయాణించలేక అక్కడికిదగ్గర్లోని ఊరు చేరుకున్నాము...

ఆ రాత్రి రామన్నదొర ఇంట్లో పడుకొనీ మర్నాడు ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయాము...

రెండు నెలల తరువాత ఒకసారి అడవికి వచ్చి అక్కడ దాచిన నిధిని తెద్దామని ప్రయత్నించాము. కానీ పోలీసులు మా గురించి నిధిని గురించీ వెతుకుతున్నారని తెలిసి వెనక్కి వెళ్లిపోయాము...

ఈలోగా రెండుసార్లు ప్రయత్నించినా పోలీసుల వల్ల కుదరలేదు... ఇంక తప్పక ఈ అడవికి

మేం ముగ్గురం వచ్చి కలప కంట్రాక్టులు సంపాదించాము. ఇక్కడ ముదిరిపోయిన చెట్లను వేలంలో కొనీ, రంపపు మిల్లులో కోసి అమ్ముతూ నిధిని బయటకు తీసికెళ్ళాలనీ ప్రయత్నించ సాగేము. నిజానికి మేమిక్కడకు వచ్చింది నిధి కోసం... కలప కంట్రాక్టుల కోసం కాదు.

కానీ మేము ఒకసారి మేపు ఆధారంగా ఆ గుట్ట మీద గుడి పక్కన వెతికితే ఆ నిధి అక్కడ లేదు. దాంతో నాకు కైలాసం, గంగారాం మీద అనుమానం పెరిగింది. వాళ్ళు నాకు తెలియకుండా ఆ నిధిని కాజేసారన్న అనుమానం వచ్చింది... ఒకసారి వాళ్ళిద్దర్ని పిలిచి అడిగితే తమకు తెలియదనీ చెప్పారు...

కానీ ఆ తరువాత కైలాసం, గంగారాంలు హత్యకు గురయ్యారు. దాంతో నాకు కూడా భయం పట్టుకుంది. ఆ నిధిని దాచింది మేము ముగ్గురమే కాబట్టి నన్ను కూడా చంపేస్తారనీ భయం వేసింది. అప్పుడు ఈ హత్యలను ఎవరో చేస్తున్నారనిపించింది... దాంతో దివాకర్ మీద అనుమానం వచ్చింది. అతన్నిక్కడికి పిలిచి మాట్లాడితే నాకు తెలియదనీ చెప్పాడు. అప్పట్నుంచీ భయం భయంగా గడుపుతున్నాను" అనీ జరిగినది పూసగుచ్చినట్లు చెప్పాడు జోగిందర్.

గెస్ట్‌హౌస్‌లోని ఒక విశాలమైన హాల్లో అతన్ని ప్రశ్నించ సాగేరు శ్రీహర్ష, గోపాల్.

ఆ ఇద్దరూ సోఫాలో కూర్చుంటే ఎదురు గుండా జోగిందర్ కూర్చున్నాడు.

"జోగిందర్! నువ్వు నిజమే చెబుతున్నావా?" అని అడిగాడు శ్రీహర్ష.

"ముమ్మాటికీ నిజం చెబుతున్నాను" అన్నాడు జోగిందర్.

"నువ్వు కాకపోతే ఆ ఇద్దర్నీ చంపింది ఎవరు? నువ్వే చంపి ఆ నిధిని తీసుకున్నావేమో! అది నిజం ఎందుకు కాకూడదు" అన్నాడు. "ఆ నిధిని నువ్వే అక్కణ్ణుంచి వేరే ప్రదేశానికి తరలించి వాళ్ళను చంపేవనీ దివాకర్ చెప్పాడు... నువ్వు నిజం చెస్తే నిన్ను వదిలి పెడతాము......... ఆ నిధిని ఎక్కడ దాచేవో మర్యాదగా చెప్పు?" అన్నాడు శ్రీహర్ష..

శ్రీహర్ష మాటలు తీవ్రస్థాయిలో వినిపించాయి.

"సార్! నిధిని నేను ఇంకో దగ్గర దాస్తే దాన్ని నేను తీసికెళ్ళిపోతాను గానీ వాళ్ళిద్దర్నీ ఎందుకు చంపుతాను?" దాని వల్ల నాకు ఏమిటి లాభం?" అన్నాడు జోగిందర్.

"మరెవరు ఆ ఇద్దర్నీ చంపారు? ఆ నిధిని ఎవరు తీసారు? ఈ విషయం నీకు తెలిసే ఉంటుంది... నువ్వు ఏదో దాస్తున్నావు" అన్నాడు గోపాల్.

"అదే నాకు అర్థం కావటం లేదు. మా వాళ్ళేమో నేనే పట్టుకెళ్ళిపోయాననీ అనుమానం పెంచుకున్నారు. వాళ్ళు హత్య గురికాగానే అందరూ నన్నే అనుమానిస్తున్నారు. నిజానికి నాకూ ఆ

హత్యలకూ సంబంధం లేదు. నిన్న రాత్రి ఒక వ్యక్తి నన్ను అనుసరించాడు... వాడిని మావాళ్ళు చాలా సార్లు గమనించారు... ఇప్పుడు నాకు వాడెక్కడ ఆ నిధిని దాచాడో అర్థమైంది. బహుశా ఇవాళో రేపో నామీద కూడా వాడు దాడి చేయొచ్చు... కానీ ఈసారి వాడి నొదలను. వాడిని చంపి మీకు లొంగిపోతాను... రెండు నెలలైంది కంటికి నిద్ర లేకుండా చేస్తున్నాడు" అన్నాడు ఆవేశంగా...

వాడు చెబుతున్నది నిజమో అబద్ధమో అర్థం కాలేదు శ్రీహర్ష.

"ఇంకీ వాడెవడు? నిజంగా వాళ్ళని నువ్వు చంపలేదా? అయితే వాళ్ళని చంపే అవసరం ఇంకెవరికుంది చెప్పు?"

"సార్! మీరు నా మాటలు నమ్మటం లేదు... నేను ఆ నిధిని దాచిన మాట నిజమే కానీ అదిప్పుడు అక్కడ లేదు. ఎవడో దాన్ని ఇంకో చోటికి తరలించి మమ్మల్ని వెంటాడుతున్నాడు. వాడే మమ్మల్ని చంపుతున్నాడని నా నమ్మకం" కోపంగా చెప్పాడు జోగిందర్.

"జోగిందర్... నువ్వు చెప్పినట్లే వాడు నిధి కోసమే అయితే దాన్ని పట్టుకెళ్ళిపోతాడు. గానీ మిమ్మల్నెందుకు చంపుతాడు. ఆ అవసరం వాడికేమిటి? నువ్వు చెప్పినదాంట్లో లాజిక్ లేదు..." అన్నాడు శ్రీహర్ష.

"ఇంతకన్నా నేను మీకు ఏం చెప్పలేను. చెప్పినా మీరు నమ్మరు" అంటూనే ఒక్కసారిగా లేచి నిలబడి" ఎవడో వచ్చాడు... అటు చూడండి... ఆచెట్టుచాటున ఉన్నాడు... వాడు నన్ను చంపడానికే వచ్చి ఉంటాడు" అన్నాడు జోగిందర్ భయంగా...

ఒక్కసారి శ్రీహర్ష, గోపాల్ ఎలర్టయ్యారు. "ఎటువైపు... కమాన్ క్విక్" అనీ చెబుతుండగానే 'ధాం' అన్న శబ్దం ఒక్కసారిగా అక్కడ ధ్వనించింది... అట్నుంచి పిస్టల్ పేలింది.

ఆ బులెట్ ధ్వని ఆ పరిసరాలంతా ప్రతిధ్వనించసాగింది... చెట్ల మీద పక్షులు భయంతో ఒక్కసారిగా బయటకొచ్చి అరుస్తూ ఎగర సాగాయి.

"గోపాల్.. కమాన్ క్విక్" అంటూ ఆ బులెట్ పేలినవైపు పరుగెత్తాడు శ్రీహర్ష...

అదృష్టవశాత్తూ ఆ బులెట్ జోగిందర్ పక్క నుంచీ దూసుకెళ్ళడంతో అతను అప్రమత్తమయ్యాడు. అతనూ తన పిస్టల్ తీసి అటువైపు పరిగెత్తాడు...

దూరంగా చెట్ల మధ్య నుంచి నల్లటి ముసుగు, నల్లటి బట్టలతో ఉన్న వ్యక్తి పారిపోతూ కనిపించాడు.

జోగిందర్ అటు వైపు పరుగు లంఘించుకున్నాడు...

శ్రీహర్ష గోపాల్, జోగిందర్ వెళ్తున్న వైపు చూస్తూ నిలబడ్డారు...

ఒక్కసారిగా ఏం జరిగిందో అర్థం కాలేదు శ్రీహర్షకు.

"గోపాల్... జీపు తియ్యండి. మనం వాడిని పట్టుకోవాలి... జోగిందర్‌కి ఏదైనా ప్రమాదం ఉందా? లేక మనల్నుంచీ తప్పించుకునేందుకు ఇది నాటకమా తెలియాలి" అన్నాడు.

"అదే ఆలోచిస్తున్నాను... ఎవడో వీళ్ళని వెంటాడుతున్నాడు... ఏదో జరిగింది... లేకపోతే జోగిందర్ కళ్ళలో ఆ భయం కనిపించదు... మీరు గమనించారో లేదో కానీ జోగిందర్ కళ్ళల్లో ఒక విధమైన మృత్యుభయం కనిపిస్తోంది... నాకు వాడు చెబుతున్నదానిలో అబద్ధం కనిపించటం లేదు... కానీ వాడు ఏదో దాస్తున్నాడు... ఏదో జరిగింది.. ఎవరు వాడిని వెంటాడుతున్నాడో తెలిసే ఉండాలి. అందుకే ఆ మృత్యు భయం..." అన్నాడు జీపు వైపు వెళ్తూ...

"ధనం మనిషిని మృగంలా మారుస్తుంది... మంచీ, చెడుల విచక్షణను చంపేస్తుంది... ఆశ పుట్టిస్తుంది... తన, పర భేదాన్ని మరిపిస్తుంది... చివరకు ప్రాణాలనే బలిగొంటుంది... ఇప్పుడు జోగిందర్ ఆ స్థితిలోనే ఉన్నాడు" అనీ చెబుతుండగానే గోపాల్ జీపు తీసుకొచ్చాడు.

ఇద్దరూ జీపులో బయలుదేరారు. కొంచెం సేపటికి అది ఏనుగు కొండవైపు వెళ్ళసాగింది... ఇంతలో గోపాల్ 'సార్... అటు చూడండి... ఎవరో వ్యక్తి అటువైపు వెళ్తున్నాడు" అంటూ పులికొండవైపు చూపించాడు.

అది ఏనుగు కొండలకి ఎదురుగా ఉంటుంది.

"జీపాపు గోపాల్..." అన్నాడు శ్రీహర్ష.

ఒక్కసారిగా కుదుపుతో జీపాగింది... డోరు తీఃసుకొని శ్రీహర్ష దిగాడు. ఇంతలో జీపుని రివర్స్ చేసాడు గోపాల్... జీపు పులికొండ వైపు బయలుదేరింది...

కొద్ది దూరం వెళ్ళగానే దూరంగా ఇద్దరు వ్యక్తులు కనిపించసాగారు.

ముందు నల్లముసుగు వేసుకున్న వ్యక్తి... అతనికి కొద్ది దూరంలో జోగిందర్...

ఇంతలో ఒక్కసారిగా 'ఢాం' అనీ మళ్ళీ పేలుడు వినిపించింది... జోగిందర్ పేల్చినట్లున్నాడు.

కొండలో దాని శబ్దం తరంగాలుగా ప్రతిధ్వనిస్తోంది...

మళ్ళీ ఇంకో బుల్లెట్... ఆ ప్రాంతమంతా దుమ్ము ధూళి... ఏమీ కనిపించటం లేదు...

ఇంతలో మళ్ళీ 'ఢాం' అన్న శబ్దం. ఈసారి ఆ ముసుగు వ్యక్తి పేల్చాడు... కింద అంతా దుమ్ము...

కొద్దిసేపటికి ఆ దుమ్ము తగ్గింది. పరిసరాలు కనిపిస్తున్నాయి...

జీపు స్పీడుగా కొండవైపు బయలుదేరింది...

పదినిముషాల తరువాత శ్రీహర్ష గోపాల్ కొండ కిందకు చేరుకున్నారు.

"ఏం చేద్దాం" అనీ అడిగాడు శ్రీహర్ష.

వాళ్ళిద్దరూ ఈకొండే ఎక్కారు... పదండి మనం కూడా ఎక్కుదాము... కానీ ప్రమాదం. వాళ్ళిద్దరూ మనల్ని షూట్ చేసే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్ళాలి" అన్నాడు గోపాల్...

ఇద్దరూ కనిపిస్తున్న సన్నటి దారిలో కొండమీదకు బయలుదేరారు.

గోపాల్ కొండ మీదకు చూసాడు...

కానీ ఎవ్వరూ కనిపించటం లేదు...

"సార్... మనం త్వరగా వెళ్ళకపోతే ఏదో జరిగే ప్రమాదం ఉంది. పదండి... ఈ అడ్డదారంట వెళదాం..." అని పక్క దార్లోంచి నడవటం మొదలు పెట్టాడు.

రాను రాను కొండ నిటారుగా ఉండటంతో నడవటం కష్టం అవుతోంది...

కొద్ది దూరం వెళ్ళిన తరువాత శ్రీహర్ష ఆగి "గోపాల్... అటు చూడు... ఇద్దరు వ్యక్తులు కనిపిస్తున్నారు. పద...క్విక్" అన్నాడు.

గోపాల్ నడక వేగాన్ని పెంచాడు... ముందు గోపాల్, వెనక శ్రీహర్ష... కొండ మీదకు ఎక్కడం కష్టం అవుతోంది. అది ఓ గుట్ట కావడంతో పెద్ద ఎత్తు లేదు... అయినా ఆయాసం వస్తోంది.

అరగంట తరువాత ఇద్దరూ ఆ గుట్ట మీదకు చేరుకున్నారు.

ఆ ప్రాంతం అంతా సమతలంగా ఉంది.

అక్కడ ఎవ్వరూ కనిపించలేదు...

ఇంతలో చెట్టు చాటు నుంచి ఓ పిస్టల్ పేలింది. వెంటనే అట్నుంచీ కూడా పేలుడు...

ఆ తరువాత అంతా నిశ్శబ్దం...

ఇంతలో "అమ్మో! రక్షించండి... రక్షించండి" అంటూ జోగిందర్ అరవడం మొదలు పెట్టాడు.

ఆ అరుపులు వచ్చిన వైపు శ్రీహర్ష గోపాల్ పరిగెత్తారు...

అక్కడి దృశ్యం చూసి ఒక్కసారిగా ఇద్దరూ స్థాణువయ్యారు...

చాలా బీభత్సంగా ఉందా దృశ్యం...

ఎదురుగా మర్రిచెట్టు కింద ఒక ముసుగు వ్యక్తి కత్తితో జోగీందర్ వీపు మీద పొడుస్తుంటే జోగీందర్ గట్టిగా కేకలు వేస్తున్నాడు. ఆ కేకలతో ఆ ప్రాంతం అంతా ప్రతిధ్వనించి పోతోంది.

జోగీందర్ అరుపులు భీకరంగా వినిపిస్తున్నాయి.

"నన్ను చంపొద్దు... ప్లీజ్... రక్షించండి" అంటూ జోగీందర్ పెడుతున్న కేకలు హృదయవిదారంగా వినిపిస్తున్నాయి.

వెంటనే శ్రీహర్ష పిస్టల్ తీసి ఆ ముసుగు వ్యక్తి కాలుమీద కాల్పులు జరిపాడు.

ఒక్కసారిగా బులెట్ కాల్లోకి దూసుకుపోవడంతో

ఆ ముసుగువ్యక్తి 'అమ్మా' అంటూ కూలబడిపోయాడు.

వెంటనే గోపాల్ పరుగున అక్కడికి వెళ్ళి ఆ ముసుగు వ్యక్తి చేతులు వెనక్కి లాగి పట్టుకున్నాడు...

అప్పటికే జోగీందర్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు.

ఆ ముసుగు వ్యక్తి దాహం దాహం అనీ అరుస్తున్నాడు. తన దగ్గర ఉన్న వాటర్ బాటిల్లో నీరు వాడికి తాగించాడు శ్రీహర్ష.

ఇంతలో గోపాల్ అతని ముసుగుని తొలగించాడు.

శ్రీహర్ష అతన్ని చూసి ఒక్కసారిగా స్థాణువయ్యాడు.

ఒక్కసారిగా శ్రీహర్ష నోటి నుంచి 'మారీచు' అన్న మాట బయటకు వచ్చింది.

"నువ్వు మారీచు వేనా?" అని అడిగాడు శ్రీహర్ష.

గోపాల్ కూడా వాడిని చూసి "మారీచే..." అనుమానం లేదు... ఇంత ఘోరానికి ఎందుకు సిద్ధపడ్డావు...?" అనీ అడిగాడు.

వాడు ఒక్క సారిగా గోపాల్ చేతిని విదిల్చుకొనీ "సార్! నేనెక్కడికీ పారిపోను. నా పని జోగీందర్ గాడి చావుతో పూర్తైపోయింది. ఇంక నేనేమైపోయినా పరవాలేదు" అన్నాడు కూర్చుంటూ.

"మరి నువ్వు మారీచువేనా?"

"కాదు బాబూ... నేను మారీచుని కాను... "కబందు"ని... ఆడి అన్నని... దయచేసి ఆడినేటీ అనొద్దు... "వాడికీ హత్యల్తో సంబంధం నేదు" అన్నాడు.

"మరి మీరిద్దరూ ఒకేలా ఉన్నారు..." శ్రీహర్ష అడిగాడు...

"మేమిద్దరం కవలలం బాబూ... నేనే పెద్దోణ్ణి... ఇద్దరికీ పది నిమిషాలు తేడా..."

"మరి వీళ్ళ ముగ్గుర్నీ ఎందుకు చంపావు?"

గోపాల్ వాడికి ఎదురుగా కూర్చుంటూ అడిగాడు.

"సెబుతాను ముందు జోగిందర్ గాడికి సెప్పనివ్వండి. ఒరేయ్ దొంగనా కొడకా. ఆ రోజు మా ఇంటికి వచ్చిన రాత్రి ఏం ఘోరం చేసారో గుర్తుకు తెచ్చుకోరా... ఆ తప్పే మీకు మృత్యుసాపం అయినాది... ఆ రోజు మీరు పాడు చేసింది మా సెల్లెల్ని రా... అందుకే మీ ముగ్గుర్నీ ఏటాడి మరీ సంపాను. సంపేముందు మీ ముగ్గురికీ ఎందుకు సంపానో సెప్పాకనే సంపాను... ఎందుకంటే మీరు సేసిన ఘోరం ఎంత ఘోరమైందో మీకు తెలియాల్రా దొంగనా కొడుకల్లారా... ఒరేయ్... ఓ ఆడది ఆర్తనాదం ఎవ్వర్నీ తేలిగ్గా వదలదురా... అది సావై ఎంటాడతాది" అనీ ఏడుస్తూ చెప్పాడు కబందు...

ఇంతలో జోగిందర్ "నీళ్ళు" అనీ మళ్ళీ అరిచాడు...

శ్రీహర్ష జోగిందర్‌కి నీళ్ళు తాగించి" నువ్వేం తప్పు చేసావో తెలిసిందా? ఆ విషయం మాకెందుకు చెప్పలేదు... ఇప్పుడైనా తెలిసిందా మిమ్మల్నెందుకు కబందు చంపేడో?" అన్నాడు శ్రీహర్ష.

"తప్పు చేసాము బాబూ... తాగుడు మైకంలో కళ్ళు పొరలు కమ్మి జంతువులా ప్రవర్తించాము... ఘోరమైన తప్పు చేసాము... అన్నం పెట్టి ఆశ్రయం ఇచ్చిన వాడి కుటుంబానికి తీరని అన్యాయం చేసాము. అందుకు ప్రతిఫలం అనుభవించాము" అంటూ తలవాల్చేసాడు జోగిందర్...

"కబందూ! ఇంతకీ ఏం జరిగిందో చెప్పు... వీళ్ళు తప్పులు చేసారు.. కానీ వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకొని నువ్వూ తప్పు చేసావు... కన్నుకు కన్ను... అన్నది సరియైనది కాదు. శిక్షించడానికి చట్టం ఉంది. నువ్వెందుకు దాన్ని చేతిలోకి తీసుకున్నావు" అన్నాడు గోపాల్.

"నేను సేసింది తప్పనీ తెలుసు బాబూ... కానీ మా అయ్యకిచ్చిన మాట కోసం ఇదంతా సెయ్యవలసి వచ్చింది... మీకు జరిగినదంతా సెబితే మీకు నేనెందుకీ పని సెయ్యవలసి వచ్చిందో అర్థం అవుతాది" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు కబందు.

## 15

మాది ఈ దండకారణ్యంలోనే కోడిపెంట తండా.. మాదో సిన్న ఊరు... ఏభై గడపుంటాది. మా అయ్య పేరు రామ్‌దేవ్... రామ్‌దేవ్ సాహూ... ఎవసాయం సేసేవాడు... మేము ముగ్గురం పిల్లలం. నేనూ, మారీచూ కవలలం... నా పేరు కబందు సాహూ, తమ్ముడు మారీచు సాహూ. మాలో రాక్షసుల

పేర్లు పెడతారు. మా తరువాత సెల్లెలు సైరంధ్రీ సాహు. అది పుట్టినపుడే మా అమ్మకి గర్భవాతం సేసి సనిపోయింది... ఎంటనే డాక్టరు దగ్గరికి తీసికెళితే బతికేదనీ మా అయ్య సెప్పేవాడు. మా అమ్మని బతికించాలనీ మా అయ్య మంచం మీద పడుకోబెట్టి నలుగురు తో కలిసి కిందకు డాక్టరు కోసం ఎళు తుంటే మధ్యలో వాతం కమ్మి సనిపోయిందిట. ఆ తరువాత మా అయ్య తాగుడు మానేసి మా ముగ్గుర్ని ఎంతో పేమతో పెంచినాడు.

నేనూ, తమ్ముడూ, చెల్లి సైరంధ్రి మా ఊరి స్కూల్లోనే సదివాము. కానీ డబ్బుల్లేక ఎనిమిది తరవాత సదువు మానీసేము. సెల్లెల్ని మాత్రం స్కూల్లో చేర్పించి సదివించాము. పతి వోరం సంతకెళ్ళి కర్రలు అమ్మే వోడిని... తమ్ముడు మారీచు సింతపండు అమ్మేవోడు.

మా అయ్య కూడా కర్రలు కొట్టేవాడు. మాకు నాలుగెకరాల పొలం ఉండేది. పోడు ఎవసాయం సేసేవోళ్ళం... వరి, జొన్నలు, సోళ్ళు పండేవి. పనసకాయల్ని, కూరగాయల్ని సంతకు తీసికెళ్ళి అయ్య, తమ్ముడు అమ్మేవోళ్ళు. అయ్యకి సెల్లెలంటే ఎంతో పేమ... దాని చేత పని సేయించేవోడు కాదు. మా ఇద్దరు అన్నదమ్ములం కూడా సెల్లిని ఎంతో ముద్దుగా సూసేవోళ్ళం...

ఒక రోజు రాత్రి మా ఇంటికి ముగ్గురు వ్యక్తులు వొచ్చినారు... అప్పుడు నేను, తమ్ముడు లేము... నేను సంతకెళ్లినాను. తమ్ముడు పట్నం ఎళ్ళాడు. ఆడికి అప్పుడప్పుడు ఒంట్లో బాగుండేది కాదు. అందుకోసం డాక్టరు గోరి దగ్గరికి ఎళ్ళాడు.

ఆ వచ్చినోళ్ళు ముగ్గురూ జోగీందర్, గంగారాం, కైలాసం... మా ఊళ్ళో మాది ఊరికి దూరంగా ఉన్న ఇల్లు కాబట్టి మా ఇంటికి వొచ్చినారు. వచ్చినోళ్ళు అయ్యతో తమ జీపు ఘాటు రోడ్డుపక్క లోయలోకి పడి పోయిందనీ, అదృట్టం వల్ల గెంతేసి బతికామనీ ఆళ్ళకు తగిలిన దెబ్బలు మా అయ్యకు సూపించారు... ఆ రాత్రి మా ఇంట్లో ఉంటామనీ సెప్పినారు.

మా అయ్య ఆళ్ళని నమ్మేడు. అందుకని ఉండమనీ సెప్పాడు. ఆళ్ళ ముగ్గురికి ఒండి, మాంసంతో భోజనం ఎట్టాడు. ఆళ్ళు ఏడి భోజనం పూటుగా తినీ సారా తాగేసారు...

ఆ తరువాత ఆళ్ళ ముగ్గురికీ లోన మంచాలు ఏసి అయ్య బయట పడుకున్నాడు.

ఆళ్ళు పూటుగా తాగడం వల్ల గట్టిగా మాట్లాడుతుంటే బయటపడుకున్న అయ్యకి యినిపించసాగాయి.

ఆళ్ళ మాటల్లో అయ్యకి ఆళ్ళ గురించి అర్థం అయినాది. ఆ ముగ్గురూ ఎక్కడో బంగారాన్ని, వజ్రాలను తవ్వి, మూడు పెట్టెల్లో పెట్టి జీపులో తెత్తుంటే పెమాదం జరిగినాదని తెలిసింది. ఆ బంగారం

పెట్టెలు లోయలో పడిపోనాయి. ఆ ముగ్గురూ కూడా లోయ లోకి జారిపోనారు. ఆళ్ళకి బాగా దెబ్బలు తగిలినాయి. తరువాత ముగ్గురూ నేచి ఆ మూడు పెట్టెల్ని మోసుకొని లోయ బయటకు వొచ్చినారు. ఆ తరువాత ముగ్గురూ ఆ పెట్టెల్ని పక్కనే ఉన్న ఏనుగు గుట్ట మీద పాడు బడిపోన శివుడి గుడి పక్కన గొయ్యి తీసి కప్పేసినారు. అక్కడ ఎందుకు దాచారంటే బాగా దెబ్బలు తగలడం వల్ల నడవలేక ఆ కొండమీద దాచేసినారు. ఆళ్ళు మా ఇంట్లో భోజనాలు తిన్న తరువాత కూర్చొని ఆ బంగారాన్ని ఎక్కడ పాతిపెట్టారో ఓ మేపు తయారు చేసుకొనీ అందులో రాసుకున్నారు.

మా అయ్య ఆళ్ళు గట్టిగా మాట్లాడుకుంటుంటే కిటికీ తీసి లోపలికి సూస్తే ఆళ్ళ మేపు కనిపించినాది.

అప్పుడు మా అయ్యకి ఆళ్ళు ఆ బంగారం పెట్టెల్ని ఎక్కడ దాచినారో తెలిసిపోనాది. ఆళ్ళ మాటల్లో జోగిందర్ ఆళ్ళకు నాయకుడనీ మా అయ్య పోల్చుకున్నాడు.

రాత్రి పదకొండప్పుడు తలుపు సప్పుడైంది. మా అయ్య, సెల్లి బయట మంచం మీద పడుకున్నారు.

తలుపు తీసుకొని జోగీందర్ మెల్లగా సప్పుడు సెయ్యికుండా బయటకు రావడం అయ్య కంటబడింది.. ఆడు మెల్లగా ఆ సీకట్లో నడుసుకుంటూ బయటకు వెళ్ళడం అయ్య సూసాడు...

ఆడు బయటకెళ్ళిపోయిన తరువాత కిటికీలోంచి లోపలికి సూస్తే మిగతా ఇద్దరూ గంగారాం, కైలాసం పూటుగా తాగడం వల్ల గుర్రు పెట్టి నిద్రపోతున్నారు.

అప్పుడు మా అయ్యకు జోగిందర్ మీద అనుమానం వచ్చినాది.

వెంటనే మా అయ్య ఆ సీకట్లో జోగీందర్ ఎనకాల బయల్దేరినాడు... సీకటైనా మా అయ్యకు ఆదారి బాగా తెలుసు కాబట్టి అయ్య గబగబా నడుత్తున్నాడు.

జోగీందర్ టార్చిలైట్ ఏసుకొని ముందు కెల్తాంటే ఆడి ఎనకాల మా అయ్య...

జోగీందర్ తిన్నగా ఆ బంగారాన్ని దాచిన ఏనుగు గుట్ట మీదకు ఎక్కాడు. అయ్య కూడా ఆడి ఎనకాలే దాన్ని ఎక్కాడు...

ఆ సీకట్లో అయ్య ఆడి ఎనకాల వొత్తున్నట్లు ఆడు పోల్చుకోనేదు. జోగీందర్ ఆ గుట్ట ఎక్కి పాడుబడ్డ శివుడి గుడి దగ్గరికి సేరుకున్నాడు.

అయ్య దూరంగా నిలబడి సూత్తున్నాడు. జోగీందర్ ఆడకు ఎళ్ళేసరికి అక్కడ ఆరుగురు మనుషులు గునపాలతో గొయ్యి తవ్వుతూ కనిపించినారు.

ఆ ఆరుగురు జోగీందర్ మనుసులు. ఆళ్ళు జీపు ఎనకాలే వొత్తుంటే జీపు లోయలోకి పడిపోనాది.

జోగిందర్ లోయలోంచి బయటకొచ్చి ఏనుగు గుట్ట మీద బంగారాన్ని పాతిపెడుతున్నప్పుడు ఆళ్ళకి ఫోన్ చేసి తాము ఎళ్ళిపోయిన తరువాత ఆ బంగారాన్ని తీసేసి ఎదురు గుండా ఉన్న పులికొండ మీదకు మార్చేయమనీ సెప్పడంతో ఆళ్ళు గునపాలు, పారలతో ఆ ఏనుగుల గుట్టకెళ్ళి ఆ బంగారాన్ని తవ్వడం మొదలెట్టినారు. ఆ పెట్టెల్ని బయటకు తీసినారు.

అప్పుడే అక్కడికి జోగిందర్ ఎళ్ళినాడు. ఆ తరువాత ఆళ్ళందరూ కలిసి ఆ మూడు పెట్టెల్ని ఎదురుగుండా కొండ మీద కెళ్ళి పాడుబడ్డ గుడి పక్క గొయ్యి తవ్వి ఆ మూడు పెట్టెల్ని కప్పెట్టేసినారు. అవి ఎక్కడ పాతిపెట్టారో గుర్తుగా ఆ గుడి మీద శివుడి కన్ను బొమ్మని ఏసాడు జోగిందర్.

ఆ తరువాత ఆ ఆరుగురు కొండదిగి సీకట్లో ఎక్కడికో ఎళ్ళిపోనారు. జోగిందర్ మళ్ళీ ఆ సీకట్లో నడుచుకుంటూ మా ఇంటికొచ్చేసి తలుపు తీసుకొని లోపలికెళ్ళిపోనాడు. గంగారాం, కైలాసం గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. జోగిందర్ ఏమీ తెలీనట్లు ఆళ్ళ పక్కనే నిద్రపోనాడు.

అయ్య జోగిందర్ గాడి కంటే ముందే వొచ్చి మంచం మీద పడుకోవడంతో అయ్య మీద ఆడికి అనుమానం రానేదు. అయ్య పడుకున్నాడే గానీ నిద్ర పట్టనేదు. జోగిందర్ గాడు చేసిన మోసం అర్థమైపోనాది. ఆ ఇద్దరికీ తెలీకుండా బంగారాన్ని ఇంకో కొండ మీదకి మార్చేయడం అయ్య సూసినాడు. అయ్యకిప్పుడు ఆ బంగారాన్ని జోగిందర్ ఎక్కడ దాచాడో తెలిసిపోనాది.

అలా నిద్రపట్టని అయ్యకు తెల్లారి బాగా నిద్రపట్టేసినాది. అప్పుడు మా సెల్లెలి కేకలతో ఒక్కసారిగా అయ్య మంచం మీద నుంచి లేచాడు. ఆళ్ళ ముగ్గురూ అప్పటికే మా అయ్య పక్కన పడుకున్న మా సెల్లెల్ని లోపలికి తీసికెళ్ళి పాడుసేత్తూ కనిపించినారు.

అయ్య లేచి తలుపు కొట్టడం మొదలెట్టినాడు. కానీ పూటుగా తాగిన ఆ ముగ్గురికీ అయ్య కేకలు యినిపించలేదు.

అయ్య పక్కనే ఉన్న గునపంతో తలుపుని పొడిసి లోపలికెళ్ళినాడు.

అప్పటికే సెల్లి పసువుల్లా ఆ ముగ్గురూ మీద పడేసరికి ఊపిరాడక సచ్చిపోయి కనిపించినాది.

నాన్నకు సెల్లిని అలా సూడగానే ఎక్కడాలేని కోపం వొచ్చింది. అంతే ఆళ్ళ మీద కలియబడ్డాడు. కానీ ఆళ్ళు ముగ్గురు అయ్య ఒక్కడు. ఆ తగువులో ఆళ్ళు అయ్య చేతిలోని గునపం లాక్కొని అయ్య గుండెల్లో పొడిచి పారిపోనారు.

అయ్య నేల మీద పడిపోనాడు.

అలా మన్నాడు ఉదయం నాను వచ్చేదాకా అక్కడే మూలుగుతూ ఉన్నాడు. ఆళ్ళు పొడిచిన

దానికి అయ్య ఎప్పుడో సచ్చిపోవలసింది కానీ నా కోసం బలవంతంగా బతికున్నాడు.

నన్ను సూసి అయ్య బావురు మన్నాడు. నాకు మాసెల్లెల్ని అయ్యని అలా సూసేసరికి ఏం సెయ్యాలో తెలీనేదు.

అయ్య మూలుగుతూ నాకు ఏం జరిగిందీ సెప్పినాడు. ఆళ్ళ ముగ్గురి ఫోటోల్ని తెల్లకాగితం మీద పెన్సిల్‌తో గీసినాడు. అయ్య బాగా బొమ్మలు ఏత్తాడు.

ఆ కాగితాలను నా చేతులో పెట్టి ఆ బంగారాన్ని జోగిందర్ ఎక్కడ దాచాడో నాకు సెప్పాడు.

ఇంక అయ్య సనిపోయే సమయం వచ్చేసింది. కళ్ళు మూతలు పడిపోతునాయి.

"కబందూ... ఆళ్ళు ముగ్గుర్నీ వొదలకు, సెల్లెల్ని దారుణంగా పాడుసేసినందుకు ఆ ముగ్గురూ బతక్కూడదు... కత్తితో పీక కోసి దారుణంగా సంపి కచ్చ తీర్చుకో. ఆ బంగారాన్ని ఆ జోగిందర్ గాడికి దక్కనివ్వకు. సెల్లీ, నేనూ ఆళ్ళ వల్ల సనిపోయామనీ పోలీసులకు సెప్పకు. తమ్ముడికి కూడా ఈ యిసయం సెప్పకు... ఈ యిసయం నీ మనసులోనే ఉంచుకో... ఆళ్ళ ముగ్గుర్నీ సంపితేనే నా ఆత్మ శాంతిత్తాది. ఇక నుంచి ఆళ్ళను ఏటాడు. ఆళ్ళని సంపుతాననీ పెమానం సెయ్యి" అంటూ నా సేతిని తన సేతిలో తీసుకొని తల వోల్చేసినాడు.

అప్పట్నుంచీ నేను నిద్రపోనేదు. ఆ ముగ్గురి ఫోటోల్ని మా అయ్య బొమ్మలుగా ఏసి నాకిచ్చినవి నా దగ్గరే ఉన్నాయి. ఆ బంగారం కోసం ఆ ముగ్గురూ ఈ అడవికి వత్తారనీ నాకు తెలుసు...

అందుకనీ ఎవసాయం మానేసి మా ఇంటికాడే ఉండి పోనాను. తమ్ముడు మారీచుకి ఈ యిసయాలు ఏటీ సెప్పనేదు. ఆడు ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో వంటోడిగా చేరాడు... ఆడికి అయ్య, సెల్లెలు జొరాలొచ్చీ సచ్చిపోయారనీ సెప్పాను.

ఆ తరువాత ఆళ్ళని ఈ అడవిలోనే ఉంటూ ఇక్కడే తిరుగుతూ ఎతకటం మొదలెట్టాను.

రోజూ ఆ కొండ దగ్గరే కాసుకు కూర్చునేవోణ్ణి. ఆళ్ళు ఈ కొండ మీదకు ఎప్పుడు వత్తే ఆళ్ళని గుర్తు పట్టి సంపాలనుకున్నాను.

ఒక ఏల ఆ బంగారం నేను లేప్పుడు ఆళ్ళొచ్చి పట్టుకెళిపోతే నన్న భయం ఏసింది. మా అయ్య జోగిందర్ ఎక్కడ ఆ మూడు పెట్టెల్ని ఆరాత్రి పాతిపెట్టి దాచిందీ నాకు సెప్పాడు కాబట్టి నేను ఒకరోజు ఆ కొండమీద పాడుబడిపోయిన గుడి పక్కన తవ్వి ఆ మూడు పెట్టెల్ని బయటకు తీసాను. ఆటిని ఆ కొండ మీంచి ఈ కొండమీదకు తెచ్చి ఆ సెట్టు పక్కన దాచేను కాబట్టి అది దొరకదు. ఇంక ఆ ముగ్గురూ వొచ్చినా ఆ మూడుపెట్టెల్లో దాచిన బంగారం ఆళ్ళకి దొరకని జాగాలో దాచేసేను. ఇంక ఆళ్ళు

దాన్నిఎతుకుతూ ఈ అడవిలోనే మకాం ఏత్తారు. అప్పుడు ఒక్కొక్క నాకొడుకునీ నా కత్తితో పొడిసి సంపాలనీ కాసుక్కూసున్నాను...

నేను అనుకున్నట్లే నెలరోజుల తరువాత ముందుగా కైలాసం గోడు ఆ పెట్టెలు దాచిన ఏనుగుల గుట్ట మీదకు వొచ్చాడు. నేను ఆడిని ఎనకాలే ఎళ్ళాను. మా అయ్య గీసిన ముగ్గురు బొమ్మల్లో ఓ బొమ్మ అచ్చు ఆడిలాగే ఉండటంతో ఆడే కైలాసం అనీ పోల్చుకున్నాను.

ఆ మన్నాడు ఆడు ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో కొత్తగా వొచ్చిన అమ్మాయి గోరిని పాడుసయ్యబోతే కఱ్ఱతో ఆడిని గట్టిగా కొట్టి అమ్మాయి గోర్ని పంపించి అడిని ఎంటాడేను. ఆడు నాకు దొరక్కుండా కొండెక్కి పారిపోతుంటే నేను కూడా వాడి ఎనకాల పరిగెత్తి కత్తితో మెడమీద నాలుగుసార్లు పొడిచాను. దాంతో నా కసి తీరింది. మా సెల్లిలికి, మా కుటుంబానికి ఆడు సేసిన పనికి అదే శిచ్ఛ... ఆడు కత్తి పోట్లకు అరుస్తుంటే ఆడిని ఎందుకు పొడిసిందీ సెప్పి తాడుతో సెట్టుకి ఉరేసి వాడి ముఖం మీద ఆ మిగతా ఇద్దరికీ తెలియాలనీ శివుడి కన్ను అదే ఆ పెట్టెల మీదున్న రుద్రనేత్రం బొమ్మని రక్తంతో ఏసి ఎళ్ళిపోనాను.

అలాగే ఆ తరువాత గంగారాం వొచ్చాడు. ఆడికి ఓ సీటీ మీద బంగారాన్ని జోగీందర్ ఎక్కడికి మార్చేసేడో రాసి ఆడింట్లో పడేసాను...

నేననుకున్నట్లే గంగారాంకి జోగీందర్ మీద అనుమానం వొచ్చింది. కైలాసాన్ని ఆడే సంపాడనుకొనీ ఆ బంగారం కోసం నేను సెప్పిన కొండ దగ్గరకు వత్తుంటే మీరిద్దరూ కూడా ఆరోజు రావడంతో ఆడి కోసం కొండ కిందే కాసాను. ఆడు కొండ మీదకెళ్ళి ఆ పెట్టెలు ఆడ లేకపోవడంతో కిందకు వత్తుంటే మళ్ళీ కత్తితో ఎనక నుంచి పీక మీద మూడుసార్లు పొడిసాను. ఆడి కేకలు వినీ మీరు పరిగెత్తుకొత్తుంటే నేనెందుకు సంపేనో ఆడికి సెప్పి తాడుతో సెట్టుకి ఏలాడదీసి పారిపోనాను.

ఇక మిగిలింది ఈ జోగీందర్. అసలు ఈ సావులకు ఈడే కారణం. ఈడు ఎంతో మందిని సంపిన జంతువు... వాటికన్నా పాపాత్ముడు... ఈడి కోసం రెండుసార్లు ఆడింటికెళ్ళి కుదరక వొచ్చేసినాను. ఆ తరువాత ఈడు ఈ అడవికి రావడం మానేసేడు. అప్పుడు నేనే ఆళ్ళ మిల్లులోని సోమం దొరకి ఆ బంగారం ఏడ ఉందో సెప్పడంతో ఆడు జోగీందర్ దాని గురించి సెప్పడంతో వారం తరువాత జోగీందర్ మళ్ళీ ఈ అడవికొచ్చినాడు.

ఈ పాలి ఆడిని వదలకూడదనుకున్నాను. ఈడు ఎప్పుడొచ్చినా కోడిపెంట ఊళ్ళోని నర్సు సీతాలింటికి వొత్తూంటాడు. దాన్ని ఈడుంచుకున్నాడు...

అక్కడ కాపుకాసి ఆడిని సంపాలనుకున్నాను. కానీ అప్పుడే మీరు ఆడిని పట్టుకునేందుకు అక్కడి

కొచ్చినారు. దాంతో నేను ఆ రాత్రి ఆ కొండ మీదే ఉండి మర్నాడుదయాన్నే గెస్ట్‌హౌస్ కొచ్చి ఆడిమీద కాల్పులు జరపడంతో ఆడు బయటకొచ్చాడు. వాడు ఆ బంగారం కోసం నేను సెప్పిన కొండ మీదకు పారిపోతుంటే ఆణ్ణి వేటాడి ఇప్పుడే పట్టుకొని సంపేసాను...

అయ్యా... ఈడు సావడంతో నాను మా అయ్యకిచ్చిన మాట నిలబెట్టుకున్నాను. ఈళ్ళ ముగ్గురు మా సెల్లిని అన్నేయంగా పాడుసేసి సంపేసినారు. ఈళ్ళ పాపానికి పచ్చగా నూరేళ్ళు బతకాల్సిన నా సెల్లెలు సైరంధ్రి. పదారేళ్ళకే సనిపోనాది. మా ముగ్గుర్నీ ఎంతో పేమగా పెంచిన మా అయ్య సనిపోనాడు. అలా ఈళ్ళ ముగ్గురి వల్ల మా కుటుంబం సెల్లా సెదురైపోయింది.

బాబూ! మేము పేద గిరిజనులం... పాప పున్నాలు ఎరగని అమాయకులం. ఏదో వానకాలం సదువు పది దాకా సదివిన వోణ్ణి. మా తమ్ముడు మారీచు అది కూడా సదవనేదు. మా మానాన మేము ఈ అడవిలో బతుకుతుంటే మా కుటుంబాన్ని ఈళ్ళు సర్వనాసినం సేసారు.

ఓ రాతిరి ఉంటామనీ వొచ్చిన వోళ్ళని మా అయ్య అన్నం పెట్టి ఆదరిత్తే ఇంత ఘోరం సెయ్యడం అన్నాయం కాదా సార్... యీళ్ళకన్నా జంతువులు నయం... అవి ఆటినేమీ సెయ్యంది మననేటీ సెయ్యవు...

బాబూ! నేను సేసింది తప్పే... ముగ్గురిని సంపాను కాబట్టి నాకు సిచ్చ పడుద్ది. జైలు కెళ్ళక తప్పదు. ఆ యిసయం నాకు తెలుసు. బాబూ... ఈ హత్యలతో నా తమ్ముడు మారీచుకి ఏ సంబంధం నేదు. ఆడి నేటీ సెయ్యొద్దు...

బాబూ! నేను బతికున్నా జైల్లోనే ఉండాలి. దానికన్నా సనిపోయి మా అయ్య, సెల్లెలు దగ్గరికి ఎల్లిపోవడమే మంచిది” అంటూ కబందు ఒక్కసారిగా కొండ మీదనుంచి లోయలోకి దూకేసాడు.

ఆ తరువాత వాడు పెట్టిన కేకలు ఆ లోయంతా ప్రతిధ్వనించ సాగాయి.

అలా కబందు జీవితం ముగిసింది. జోగీందర్‌ని కిందకు తీసికెళ్దామనీ గోపాల్, శ్రీహర్ష ప్రయత్నించారు, కానీ అప్పటికి వాడు చనిపోయాడు..

ఆ మర్నాడు పోలీసు బృందంతో శ్రీహర్ష, గోపాల్ కబందు దాచిన ఆ మూడు పెట్టెలను కొండ మీద నుంచి తవ్వి బయటకు తీసుకువచ్చారు. అందులో ఐదారు వందల సంవత్సరాల క్రితం లభ్యమైన వజ్రవైడూర్యాలు, పచ్చలు, ఎంతో విలువైన దేవుడి బంగారు ఆభరణాలూ దొరికాయి.

వాటిని లెక్కించి ప్రభుత్వాని కప్పచెప్పాడు శ్రీహర్ష.

ఈ కేసులో కీలక వక్తైన దివాకర్ని అరెస్ట్ చేయడం జరిగింది. జోగీందర్, గంగారాం, కైలాసం, దివాకర్లను ఏ వన్, ఏటూ, ఏత్రీ, ఏఫోర్ ముద్దాయిలుగా చేర్చి ఎఫ్ఐఆర్ కోర్టులో దాఖలు చెయ్యడం

జరిగింది...

అందులో ఏ1, ఏ2, ఏ3లు ముగ్గురూ హత్యకు గురైనట్లు పేర్కొనబడటంతో దివాకర్ ఏవన్‌గా మిగిలాడు. అలా ఆ కేసు ఓ కొలిక్కి వచ్చింది.

## 16

ఆరోజు శ్రీహర్ష ఆఫీసులో ఉండగా మధుమతి అతని దగ్గరికి వచ్చింది.

"ఎప్పుడొచ్చారు అడవి నుంచి... మీ కేసులు కొలిక్కి వచ్చాయా?" అని అడిగింది...

"నేను అక్కడికి వెళ్ళింది నిధి కోసం... మా ఎస్పీ గారు నాకు పురావస్తు శాఖ వాళ్ళిచ్చిన ఫిర్యాదు మేరకు ఆ నిధిని వెతికి దాని వెనకున్న నేరస్తుల్ని పట్టుకోవాలనీ ఆ కేసుని నాకు ప్రత్యేకంగా అప్పచెప్పడంతో నేను ఆ కేసు పరిశోధన కోసం దండకారణ్యానికి వచ్చాను. కానీ అదే సమయంలో అటవీ శాఖవాళ్ళు తమ అడవి నుంచి టేకు, గంధపు చెట్లను దొంగతనంగా కొట్టి బయటకు తీసికెళ్ళిపోతున్నారన్న ఫిర్యాదు చెయ్యడంతో ఆ కేసు కోసం వచ్చినట్లు నీతో సహా అందరూ భావించారు...

ఆ రెండు కేసులూ ఇప్పుడు పరిష్కారమయ్యాయి. చెట్లు, పక్షుల గురించిన నీ పరిశోధనకి ఆటంకం అనీ ఆ కేసుల వివరాలు నీకు చెప్పలేదు. అది సరే... ఇంతకీ నీ ప్రాజెక్ట్ ఏమైంది... పూర్తైందా? మీ ప్రొఫెసర్ గారు సంతృప్తి చెందారా?" అని అడిగాడు శ్రీహర్ష...

"కొద్దిగా ఉంది గానీ పూర్తైనట్లే... ఆ అడవిలో నేను ప్రాజెక్ట్ చేసినట్లు అటవీశాఖ వారినుంచి ఒక సర్టిఫికేటు కావాలి... అందుకే వచ్చాను నేను" అంది మధుమతి...

"మధూ! నా ఐపీయస్ పూర్తైనపుడే నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. అప్పుడు పీహెచ్‌డీ అన్నావు. ఇప్పుడై పోయింది కదా ఇంకా మన పెళ్ళికేమిటి ఆలస్యం చెప్పు?'' అన్నాడు శ్రీహర్ష చిరుకోపంతో...

"నాన్నగారికీ విషయం చెప్పాను... ఆయన మీ నాన్న గారిని కలిసి ముహూర్తాలు పెడతామన్నారు... ఆ విషయం చెప్పడానికే నేనిప్పుడు వచ్చాను..." అంది మధుమతి సిగ్గుతో తలవంచుకుంటూ...

"ఇంటర్ నుంచీ మనం ప్రేమించుకుంటున్న విషయం నీకు గుర్తుందా? అంటే మన ప్రేమకు ఆరేళ్ళు పూర్తైంది. ఇంత సుదీర్ఘంగా ప్రేమించుకున్న జంట మనమేనేమో" అన్నాడు నవ్వుతూ శ్రీహర్ష.

అతని నవ్వుతో మధుమతి కూడా శృతి కలిపింది.

(సమాప్తం)